ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
విశాఖపట్నం
జిల్లా వార్తలు
మంగళవారం 11 ఫిబ్రవరి 2025





శంకరమఠం శివాలయం వీధి వద్ద పేరుకుపోయిన చెత్త

మహా నిర్లిప్తత!

పూర్తిస్థాయి కమిషనర్ లేకపోవడంతో జీవీఎంసీ సిబ్బందిలో పెరుగుతున్న నిర్లక్ష్యం

- మూడు వారాలుగా కమిషనర్ పోస్టు ఖాళీ
- పారిశుధ్య నిర్వహణ, తాగునీటి సరఫరా సహా పలు అంశాలపై ప్రభావం



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

మహా విశాఖ నగర పాలక సంస్థ (జీవీఎంసీ)కు పూర్తిస్థాయి కమిషనర్ లేకపోవడంతో అధికారులు, సిబ్బందిలో నిర్లిప్తత నెలకొంది. రాష్ట్రంలోనే అతిపెద్ద నగర పాలక సంస్థగా గుర్తింపు పొందిన జీవీఎంసీ పరిధిలో అనేక భారీ ప్రాజెక్టులు సాగుతున్నాయి. అదేవిధంగా పారిశుధ్య నిర్వహణ, తాగునీటి సరఫరా వంటి పనులను నిత్యం కమిషనర్ క్షేత్రస్థాయిలో పరిశీలించాల్సి ఉంటుంది. కానీ గత 20 రోజులుగా కమిషనర్ లేకపోవడంతో సంబంధిత విభాగాల్లో నిర్లక్ష్యం పెరుగుతోంది.

జీవీఎంసీ కమిషనర్‌గా ఉన్న పి.సంపత్‌కుమార్‌ను ప్రభుత్వం గత నెల 20న రాష్ట్ర పట్టణాభివృద్ధి శాఖ డైరెక్టర్‌గా నియమించింది. ఆయన స్థానంలో ఎవరినీ నియమించకుండా జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్‌కు అదనపు బాధ్యతలు అప్పగించింది. రెండు, మూడు రోజులు తర్వాత కొత్త కమిషనర్‌ను నియమిస్తారని అంతా భావించారు. అయితే ఇంతవరకూ కొత్త కమిషనర్‌ను నియమించలేదు. ప్రస్తుతం జీవీఎంసీ అధికారులు ఫైళ్లను జిల్లా కలెక్టర్ కార్యాలయానికి తీసుకువెళ్లి సంతకాలు చేయించుకుంటున్నారు. తాను ఇన్‌చార్జి కమిషనర్‌నే కాబట్టి రెగ్యులర్ ఫైళ్లను మాత్రమే తన వద్దకు తీసుకురావాలని ఆయన సూచిస్తున్నట్టు అధికారులు చెబుతున్నారు. ఇదిలావుండగా నగరంలో చెత్త సేకరణ, రోడ్లను శుభ్రం చేయడం, డ్రైనేజీల్లో పూడికతీత, తాగునీటి సరఫరా వంటివి సక్రమంగా సాగేలా కమిషనర్ క్షేత్రస్థాయి పర్యటనలకు వెళ్లేవారు. ఇక, కార్పొరేటర్లు తమ వార్డుల్లోని సమస్యలను పరిష్కరించాలని, కొత్తగా రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం చేపట్టాలని కోరుతూ కమిషనర్‌కు వినతిపత్రాలు

... మిగతా 6వ పేజీలో

కొండలపై భూమి నూరు శాతం వినియోగం

రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

- ముంబై తరహాలో ఉపయోగించుకోవాలని యోచన
- త్వరలో అధ్యయనానికి అధికారుల బృందం
- మధురవాడ ఐటీ హిల్స్‌లో అదనపు అంతస్థుల నిర్మాణానికి అనుమతులు, రాయితీలు
- 33 శాతం వాణిజ్య అవసరాలుగా మార్చుకోవడానికి పాలసీలో మార్పులు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)



రుషికొండలోని ఐటీ హిల్స్

విశాఖపట్నంలో కొండలపై భూములను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వం యోచిస్తోంది. ముంబైలో కొండలను వంద శాతం సద్వినియోగం చేసుకుంటున్నారు. ఇక్కడ అలా లేదు. ఐటీ సంస్థలకు కొండలపై ఎకరాల కొద్దీ భూమి కేటాయిస్తే చిన్న చిన్న భవనాలు నిర్మించి 'మమ' అనిపిస్తున్నారు. భూ కేటాయింపులు ఎక్కువ, ఉద్యోగులు తక్కువ...అన్నట్టు పరిస్థితి ఉంది. దీనిలో మార్పు తీసుకురావాలని పరిశ్రమల శాఖ యత్నిస్తోంది. ఇప్పటికే భూములు పొంది భవనాలు నిర్మించినవారు అదనపు అంతస్థులు నిర్మిస్తే రాయితీలు, ఇతర ప్రయోజనాలు కల్పిస్తామని ప్రభుత్వం కొత్త ఐటీ పాలసీలో ప్రకటించింది. 33 శాతం వాణిజ్య అవసరాలకు ఉపయోగించుకోవచ్చునని ప్రకటించింది.

కూటమి ప్రభుత్వం వచ్చాక విశాఖపట్నంలో ప్రభుత్వ భూములకు భారీ డిమాండ్ ఏర్పడింది. అనేక ఐటీ కంపెనీలు, పర్యాటక సంస్థలు పరిశ్రమల ఏర్పాటుకు ముందుకువస్తున్నాయి. గూగుల్ సంస్థ సాధారణ కార్యాలయంతో పాటు డేటా సెంటర్ ఏర్పాటుచేయాలని నిర్ణయించింది. ఇన్ఫోసిస్‌కు రెండు ఎకరాల స్థలం ఉంది. క్యాంపస్ ఏర్పాటుకు ఇంకా భూమి అవసరమని చెబుతోంది. టీసీఎస్ ప్రస్తుతం మిలీనియం టవర్స్‌లో కార్యకలాపాలకు ముందుకు వచ్చినా శాశ్వత క్యాంపస్‌కు భూమి కావాలని అడుగుతోంది. ఇటీవల విశాఖలో పర్యాటక శాఖ నిర్వహించిన ప్రాంతీయ పెట్టుబడిదారుల సదస్సులో ప్రముఖ సంస్థలు భూమి ఇస్తే ప్రాజెక్టులు ఏర్పాటు చేస్తామని ప్రకటించాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం విశాఖలో కొండలు, అక్కడున్న భూములను ఎలా సద్వినియోగం చేసుకోవచ్చునో ప్రణాళిక రూపొందించాలని జిల్లా అధికారులను ఆదేశించింది. దీనికి ముందు ముంబైకు వీఎంఆర్‌డీఏ, జీవీఎంసీలకు చెందిన ఉన్నతాధికారులతో ఒక బృందాన్ని పంపించి అధ్యయనం చేసి రావాలని ఆదేశించింది.

మధురవాడలోనే అధికం

మధురవాడ-రుషికొండలను కలుపుతూ ఉన్న నాలుగు కొండలను ఏపీఐఐసీ ఐటీ ఆర్థిక మండళ్లుగా ప్రకటించింది. వాటిపై ఐటీ సంస్థలకు రెండు దశాబ్దాల క్రితం నుంచి భూములు కేటాయిస్తూ వస్తోంది.

- హిల్ నంబరు 1లో రెండు కంపెనీలకు స్థలాలు కేటాయించారు. మిరాకిల్ కంపెనీకి 5 ఎకరాలు ఇవ్వగా, మరో కంపెనీ ఫ్లూయెంట్ గ్రిడ్‌కు రెండు ఎకరాలు కేటాయించారు. రెండింటిలోను వేయి మంది పనిచేస్తున్నారు.
- హిల్ నంబరు 2లో 14 కంపెనీలకు 25 ఎకరాలు కేటాయించారు. సింబియోసిస్ టెక్నాలజీస్, కలర్ చిప్స్, సాఫ్ట్ సోల్, న్యూనెట్, సాంఖ్య టెక్నాలజీస్, మహతి సాఫ్ట్‌వేర్ (ఫిన్‌టెక్ వ్యాలీ), నవయుగ ఇన్ఫోటెక్, ఏసీ ఇన్ఫోటెక్, నోవిటాస్, క్లోవ్ టెక్నాలజీస్, సీఈఎస్, ఫైటెక్ తదితర కంపెనీలు ఉన్నాయి. వీటన్నింటిలో కలిపి 5,000 మంది ఉద్యోగులు ఉన్నారు.
- హిల్ నంబరు 3లో 90 ఎకరాల స్థలం ఉంది. అందులో కెనెక్సాకు 25 ఎకరాలు కేటాయించగా, ఆ సంస్థను ఐబీఎం టేకోవర్ చేసింది. కేవలం నాలుగు ఎకరాలు తమకు చాలని, మిగిలిన 21 ఎకరాలు వెనక్కి ఇచ్చేసింది. ఇది కాకుండా మరో 13 కంపెనీల (విప్రో, ఈ సెంట్రిక్, ఐఐసీ టెక్, వినో సాఫ్ట్, ఐఐసీ సిస్టమ్స్, వరల్డ్ టెక్,

... మిగతా 6వ పేజీలో

ఉక్కులో 16 మంది ఉన్నతాధికారులకు షోకాజ్ నోటీసులు

- సగం మంది అత్యుత్తమ పనితీరుతో నెహ్రూ అవార్డు పొందినవారు
- ఢిల్లీ నుంచి బకాయిదారుల వివరాలు అడిగినప్పుడు సరైన లెక్క చెప్పలేదని అభియోగం



విశాఖపట్నం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి):

విశాఖపట్నం స్టీల్‌ప్లాంటులో 16 మంది ఉన్నతాధికారులకు యాజమాన్యం షోకాజ్ నోటీసులు జారీచేసింది. ఇందులో వారు చేసిన తప్పు ఏమీ లేదనేది ఉద్యోగ వర్గాల వాదన. పైగా వారిలో సగం మంది అత్యుత్తమ పనితీరు ప్రదర్శించి ప్రతిష్ఠాత్మకమైన నెహ్రూ అవార్డు పొందినవారు కావడం గమనార్హం. సంస్థ చెల్లించిన బకాయిల జాబితా ఢిల్లీనుంచి ఉక్కు మంత్రిత్వ శాఖ అడిగినప్పుడు పూర్తిస్థాయిలో ఫైనాన్స్ డైరెక్టర్ ఆ వివరాలు ఇవ్వకపోవడం వల్ల 16 మందికి ఇప్పుడు తాఖీదులు ఇచ్చారు. ఇది అన్యాయమని ఉద్యోగ, కార్మిక వర్గాలు ఆందోళన వ్యక్తంచేస్తుంటే...విషయం బయటకు పొక్కనివ్వకూడదని యాజమాన్యం ఆంక్షలు పెట్టింది.

ఏమి జరిగిందంటే...?

ఆరు నెలల క్రితం అతుల్ భట్ సీఎండీగా ఉన్నప్పుడు కోక్ అత్యవసరమై బోర్డు సమావేశంలో నిర్ణయం తీసుకొని ఇండియా కోక్ అండ్ పవర్ ప్రైవేట్ లిమిటెడ్ (ఐసీపీపీఎల్) నుంచి రూ.220 కోట్ల విలువైన కోక్ కొనుగోలు చేశారు. వాస్తవానికి విశాఖపట్నం స్టీల్‌ప్లాంటు కోల్ కొనుగోలు చేసి దాని నుంచి కోక్‌ను సొంతంగా

... మిగతా 6వ పేజీలో

పూర్ణామార్కెట్ ప్రాంతంలో ఆక్రమణల తొలగింపు

- పోలీస్, జీవీఎంసీ ఆధ్వర్యంలో స్పెషల్‌డ్రైవ్
- పార్కింగ్ ఫీజు బోర్డులను ఏర్పాటుచేయించిన వన్‌టౌన్ సీఐ జీడీబాబు
- వ్యాపారులతోపాటు కొనుగోలుదారులు హర్షం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



ఆక్రమణలను దగ్గరుండి తొలగిస్తున్న పోలీస్, జీవీఎంసీ అధికారులు, సిబ్బంది

విశాఖపట్నం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి):


జీవీఎంసీ జోన్-4 పరిధిలోని పూర్ణామార్కెట్ మెయిన్‌రోడ్డులో ఆక్రమణలను ఎట్టకేలకు సోమవారం తొలగించారు. మెయిన్‌రోడ్డులో పార్కింగ్‌కు కేటాయించిన స్థలంలో కొందరు అనధికారికంగా దుకాణాలు ఏర్పాటు చేయించి, జేబులు నింపుకుంటున్నారు. రోడ్డుకు ఇరువైపులా దుకాణాలు ఏర్పాటుచేయడంతో మార్కెట్‌కు వెళ్లే కొనుగోలుదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యపై 'ఆంధ్రజ్యోతి' వరుసగా మూడు రోజులపాటు కథనాలు ప్రచురించడంతో జీవీఎంసీ, పోలీస్ అధికారులు స్పందించారు. సీపీ శంఖబ్రతబాగ్చి, ఇన్‌చార్జి జీవీఎంసీ కమిషనర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ ఆదేశాలతో వన్‌టౌన్ సీఐ జీడీబాబు, జోన్-4 కమిషనర్ ఎం.మల్లయ్యనాయుడులు సోమవారం ఉదయం సిబ్బందితో పూర్ణామార్కెట్ ప్రాంతానికి చేరుకున్నారు. రోడ్డు, ఫుట్‌పాత్‌లను ఆక్రమించి వ్యాపారాలు చేస్తున్నవారంతా తమ దుకాణాలను స్వచ్ఛందంగా తొలగించాలని మైక్ ద్వారా హెచ్చరించారు. రోడ్డుపక్కన, డ్రైనేజీలపై చిరుతిండ్లు, పండ్ల రసం, చెరకు రసం, సోడా బండ్లను తొలగించినప్పుడు అక్కడ మురుగు పేరుకుపోయి ఉండడం, పాత్రలు ఉంచినచోట తీవ్ర దుర్గంధం వెదజల్లేలా వ్యర్థాలు, చెత్త ఉండడం చూసి సీఐ జీడీబాబు తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారంటూ వారిపై ఏపీ ఎపిడమిక్ యాక్ట్ కింద కేసులు నమోదుచేయనున్నట్టు ప్రకటించారు. కొందరు తమ దుకాణం ఎదురుగా రోడ్డుపై తోపుడుబండ్లు పెట్టుకునేందుకు అవకాశం కల్పించి, వారి వద్ద అద్దె వసూలు చేస్తున్నట్టు తెలుసుకుని సీఐ, జోనల్ కమిషనర్ అవాక్కయ్యారు. రోడ్డుమధ్యలో దుకాణాలను పెట్టించి ప్రజల రాకపోకలకు ఇబ్బంది కలిగించడంతోపాటు కల్తీ ఆహారం విక్రయించేందుకు పరోక్షంగా ప్రోత్సహించడం, దోమలు వ్యాప్తికి కారణం

... మిగతా 6వ పేజీలో

జాడ లేని చిరుతలు!

కంబాలకొండ అభయారణ్యంలో ఐదేళ్లుగా కనిపించని ఆనవాళ్లు

- ఇతర ప్రాంతాలకు వలస?
- వాహన శబ్దాలు, జనావాసాలు పెరుగుదల ప్రభావమేనా..
- అంతరించి ఉండవచ్చునని కూడా అనుమానాలు



కంబాలకొండ అభయారణ్యం

విశాఖపట్నం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి):

కంబాలకొండ అభయారణ్యంలో రమారమి పదేళ్ల నుంచి చిరుత పులుల జాడ కనిపించడం లేదు. వాహన శబ్దాలు, పెద్దఎత్తున జనావాసాల పెరుగుదల కారణంగా చిరుతలు ఇతర ప్రాంతాలకు వలస పోయి ఉంటాయని అటవీ, పర్యావరణ నిపుణులు అంచనా వేస్తున్నారు. చిరుతలు ఉంటే...కంబాలకొండలో జింకలు, అడవి మేకలు/గొర్రెలు, కుందేళ్లు వంటి చిన్న జంతువులను వేటాడేవి. అయితే కొద్ది సంవత్సరాలుగా కంబాలకొండ, పరిసరాల్లో అటువంటి ఆనవాళ్లు లేవని చెబుతున్నారు.

కంబాలకొండ అభయారణ్యం 7,139 హెక్టార్ల విస్తీర్ణంలో ఉంది. విశాఖ వ్యాలీ స్కూల్ జంక్షన్, ముడసర్లోవ, అడవివరం, శొంఠ్యాం, గంభీరం, కొమ్మాది, ఎండాడ పరిసర ప్రాంతాల్లో విస్తరించి ఉన్న కంబాలకొండ అభయారణ్యంలో రెండు దశాబ్దాల క్రితం పది, ఆపైగా ఎక్కువ చిరుత పులులు ఉండేవి. సింహాచలం నుంచి కైలాసగిరి వరకూ ఉన్న కొండలు, సీతకొండ, రుషికొండ, కాపులుప్పాడ కొండల్లో సంచరిస్తుండేవి. కొన్ని పర్యాయాలు ఆనందపురం మండలంలో గల కొండల్లో కూడా తిరిగేవి. పదిహేనేళ్ల కిందట నగరంలోని నందిగిరి నగర్, ఎంవీపీ కాలనీ, కైలాసపురం, ఎన్ఎస్‌టీఎల్ ప్రాంతాల్లో చిరుతలు కనిపించడంతో ప్రజలు భయాందోళనలకు గురయ్యారు. వాటిని అటవీ శాఖ పట్టుకుని జంతుప్రదర్శనశాలకు తరలించింది. అలాగే పీఎం పాలెం చివరి బస్టాప్ సమీపాన గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒక చిరుత మృతిచెందింది. అయితే రానురాను విశాఖ నగరం విస్తరించడం, కొండల చుట్టూ కూడా జనావాసాలు పెరగడం, కంబాలకొండ

... మిగతా 6వ పేజీలో

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి పది మంది నామినేషన్

విశాఖపట్నం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి):

- నేడు నామినేషన్ల పరిశీలన
- ఉపసంహరణకు 13 వరకూ గడువు
- 27న పోలింగ్

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి సోమవారం గడువు ముగిసే సమయానికి మొత్తం పది మంది నామినేషన్ వేశారు. చివరిరోజు ఇద్దరు (పెదపెంకి శివప్రసాద్, సుంకర శ్రీనివాసరావు) మూడు సెట్ల వంతున నామినేషన్లు దాఖలు చేశారు. నామినేషన్ల దాఖలు అనంతరం అభ్యర్థులతో ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ ప్రమాణం చేయించారు. ఈనెల 27వ తేదీన జరగనున్న ఎన్నికలకు ఈ నెల మూడో తేదీన నోటిఫికేషన్ విడుదలైంది. అదేరోజు నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రారంభమైంది. మొత్తం పది మంది అభ్యర్థులు...సిట్టింగ్ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ, కోసూరు రాధాకృష్ణ, సత్తలూరి శ్రీరంగ పద్మావతి, కోరెడ్ల విజయగౌరి, నూకల సూర్యప్రకాష్, రాయల సత్యనారాయణ, గాదె శ్రీనివాసులనాయుడు, పోతల దుర్గారావు నామినేషన్లు దాఖలు చేశారు. మంగళవారం నామినేషన్ల పరిశీలన చేస్తారు. నామినేషన్ల ఉపసంహరణకు ఈనెల 13వ తేదీ వరకూ గడువు ఉంది. కాగా ఈ ఎన్నిక పార్టీ రహితంగా జరుగుతుంది. అందుకే బరిలో ఉన్న అభ్యర్థులకు గుర్తులు కేటాయించరు. బ్యాలెట్‌పై పేరు, ఫొటో మాత్రమే ఉంటాయి.

గాజువాకలో ఇనాం భూముల క్రమబద్ధీకరణకు గ్రీన్‌సిగ్నల్

ఉత్తర్వులు విడుదల చేసిన ప్రభుత్వం

- 2023 డిసెంబరు 31వ తేదీ నాటికి ఉన్న నిర్మాణాలకే వర్తింపు
- 100 గజాల వరకూ ఉచితం...
- నివాసాలకు 101-200 గజాల వరకూ రూ.50 చొప్పున, 201-400కు రూ.120, ఆపై రూ.1000 చొప్పున ఫీజు
- డిసెంబరు నెలాఖరు వరకూ దరఖాస్తుల స్వీకరణ
- ఖాళీగా ఉన్న స్థలాలకు క్రమబద్ధీకరణ ఉండదు



గాజువాక ప్రాంతం

విశాఖపట్నం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి):

గాజువాకలో అభ్యంతరం లేని ఇనాం భూముల్లో గల ఆక్రమణల క్రమబద్ధీకరణకు అనుమతి ఇస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీచేసింది. క్రమబద్ధీకరణకు ఈనెల ఆరో తేదీన రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపిన విషయం తెలిసిందే. ఈనేపథ్యంలో విడుదలైన ఉత్తర్వుల ప్రకారం.. ఇనాం భూముల్లో 2023 డిసెంబరు 31వ తేదీ నాటికి ఉన్న నిర్మాణాలను మాత్రమే క్రమబద్ధీకరిస్తారు. వెయ్యి గజాలలోపు భూముల్లో నిర్మాణాల క్రమబద్ధీకరణకు స్లాబ్‌లు నిర్ణయించారు. వంద గజాల వరకైతే నివాస/వాణిజ్య భవనాలను ఉచితంగా క్రమబద్ధీకరించి, తరువాత కూడా ఉచితంగానే కన్వేయన్స్ డీడ్ జారీచేస్తారు. ఇక, నివాసాలకు సంబంధించి 101 నుంచి 200 గజాల వరకూ గజానికి రూ.50, 201 నుంచి 400 వరకు రూ.120, 401 నుంచి 1000 గజాల వరకు రూ.1000 ఫీజు చెల్లించాలి. అదే వాణిజ్య భవనాలు ఉన్నట్టయితే

... మిగతా 6వ పేజీలో

ఊటగడ్డలో రౌడీల బీభత్సం

- దంపతులను అడ్డగించి అసభ్యకరంగా ప్రవర్తన
- ఇంటికి వెళ్లినా బయటకు లాక్కొచ్చి భర్తపై దాడి
- నిందితుల్లో ఒకరు రౌడీషీటర్‌గా గుర్తింపు

మహారాణిపేట, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి):

అర్ధరాత్రి సమయంలో దంపతులను అడ్డగించిన ముగ్గురు అసభ్యకరంగా ప్రవర్తించి వేధించారు. వారి నుంచి తప్పించుకుని ఇంటికి చేరుకున్నా వెంటపడ్డారు. బయటకు ఈడ్చుకువచ్చి దాడికి పాల్పడ్డారు. ఈ ఘటన మహారాణిపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని ఊటగడ్డ ప్రాంతంలో ఆదివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మండంగి వంశీ (24), అతడి భార్య నాలుగు నెలలుగా ఊటగడ్డ ప్రాంతంలో అద్దెఇంటిలో ఉంటున్నారు. వారు ఆదివారం సీతంపేటలో ఉన్న అతని బావ ఇంటికి వెళ్లి రాత్రి 11.30 ప్రాంతంలో తిరిగి వచ్చారు.ఆటోదిగి నడుచుకుంటూ ఇంటికి వెళుతుండగా సమీపంలోని బ్రిడ్జి దగ్గరఉన్న ముగ్గురు అడ్డగించారు. మహిళ పట్ల అభ్యంతరకరంగా ప్రవర్తించారు. అక్కడ నుంచి దంపతులు పరుగున ఇంటికి చేరుకున్నారు. ఇంటి యజమాని వద్దకు వెళ్లి తలదాచుకున్నారు.దంపతులను ఆ ముగ్గురూ వెంబడించి ఇంటి తలుపులపై ఇటుక బెడ్డలు, రాళ్లు విసిరారు. తలుపులు విరగ్గొట్టి లోపలకు వెళ్లి...అతడిని బయటకు ఈడ్చుకువచ్చి తీవ్రంగా కొట్టారు. వారిని అడ్డగించిన ఇంటి యజమానిపై కూడా దాడికి పాల్పడ్డారు. ఈ క్రమంలో దంపతులు స్థానికుల సహాయంతో పోలీసులను ఆశ్రయించారు. దాడికి పాల్పడిన వారిలో రౌడీషీటర్ ఉన్నట్టు చెబుతున్నారు. మహారాణిపేట కేసు నమోదుచేసి దర్యాప్తు జరుపుతున్నారు.

మాన్సాస్ స్థలాలను ఆక్రమించిన సర్పంచి

- నిర్మాణాలు తొలగించిన అధికారులు



అధికారులు ఆక్రమణ నిర్మాణం

ఆనందపురం ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బోని గ్రామం సమీపంలో నిర్మించిన అక్రమ కట్టడాలను సోమవారం తెల్లవారు జామున రెవెన్యూ అధికారులు కూల్చివేశారు. స్థానిక సర్పంచ్ బోని అప్పల కొండమ్మ, ఆమె భర్త సన్యాసినాయుడు మాన్సాస్ భూములను ఆక్రమించి ఆరు షాపులను నిర్మించారు. అయితే, ఈ విషయంపై మాన్సస్ అధికారులు పలుమార్లు హెచ్చరించినా పట్టించుకోలేదు. దీంతో మాన్సస్ అధికారులు కలెక్టరు హరేంధిర ప్రసాద్‌కు ఫిర్యాదు చేశారు. ఆయన ఆదేశాలపై సోమవారం తెల్లవారు జామున 3 గంటల ప్రాంతంలో తహసీల్దార్ శ్యామ్‌ప్రసాద్, సీఐ చింతా వాసునాయుడు సిబ్బంది ఆ ప్రదేశానికి చేరుకుని ఎక్స్‌కవేటర్ సహాయంతో నిర్మాణాలను నేలమట్టం చేసి హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. సర్పంచ్ చేపట్టిన నిర్మాణాలు తొలగించడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

బాధితురాలికి సాయం

భీమునిపట్నం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక నేరేళ్లవలస కాలనీకి చెందిన కాయల ప్రభాకరరావు కుమార్తె ప్రమాదవశాత్తు జరిగిన సంఘటనలో తీవ్రగాయాలకు గురై నాలుగు నెలలుగా మంచానికే పరిమితమైంది. దీంతో పట్టణంలోని కాపునాడు సంక్షేమ సంఘం ప్రతినిధులు సోమవారం ఆ కుటుంబానికి రూ. 31,500 లు ఆర్థిక సహాయాన్ని అతనికి అందించారు. సంఘం అధ్యక్షుడు చెల్లూరి గౌరినాయుడు, కోశాధికారి నాగిరెడ్డి వెంకటస్వామి, నాయకులు గొరపల్లి సన్యాసిరావు, అడపా లాల్‌బాబు తదితరులుపాల్గొన్నారు.

శ్రీరాముడు ధీశాలి

కొమ్మాది, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): రాముడు అతి పరాక్రమవంతుడు, ధీశాలి అని ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనకర్త బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు అన్నారు. కొమ్మాది గాయత్రి ఇంజనీరింగ్ మహిళా కళాశాల ఆవరణలో నిర్వహిస్తున్న సంపూర్ణ రామాయణం ప్రవచనాల్లో భాగంగా అయోధ్యకాండలో రాముడి పరాక్రమం గురించి వివరించారు. రాముడు యుద్ధం చేస్తుంటే భుజాలు తాండవం చేస్తాయని, గంట పన్నెండు నిమిషాల్లో పద్నాలుగు వేలమంది ఖరదూషణాది రాక్షసులను సంహరించిన ధీశాలి రాముడు అని తెలిపారు. శూర్పణఖ ప్రేరేపణతో ఖరుడు పద్నాలుగు వేలమంది రాక్షసులను రాముడిపైకి పంపడం, సీతా, లక్ష్మణులను రాముడు గుహలోకి పంపి తాను ఒక్కడే యుద్ధం చేసి రాక్షసులను మట్టుపెట్టడం, అనంతరం త్రిశురుడు, ధూషనుడు, ఖరుడు అనే ముగ్గురు రాక్షసులను సంహరించడం, చివరికి దేవతలు సంతసించడం వంటి ఘట్టాలను చాగంటి వివరించారు. ఈ కార్యక్రమంలో గాయత్రి విద్యాపరిషత్ కార్యదర్శి ఆచార్య సోమరాజు, అష్టలక్ష్మి దేవాలయం ధర్మకర్త అన్నంరాజు సత్యనారాయణ పాల్గొన్నారు.

సిస్టమ్ డిజైన్‌పై అవగాహన

సాగర్‌నగర్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ఈఈసీఈ విభాగం ఆధ్వర్యంలో 'వీఎల్ఎస్ఐ సిస్టమ్ డిజైన్ యూజింగ్ ఓపెన్ సోర్సు టూల్స్' అనే అంశంపై రెండు వారాలు నిర్వహించే ఫ్యాకల్టీ డవలప్‌మెంట్ ప్రోగ్రామ్ సోమవారం ప్రారంభమైంది. భారత ప్రభుత్వ ఎలక్ట్రానిక్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ సహకారంతో ఐఐటీ గౌహతి, జబల్‌పూర్, రూర్కెలా, ఎన్ఐటీ పాట్నాలతో కలసి గీతం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని ఈఈసీఈ విభాగం అధిపతి ప్రొఫెసర్ పి.భరణీ చంద్ర కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ఐఐటీ గౌహతి ప్రొఫెసర్ గౌరవ త్రివేది ప్రారంభించారు. అధ్యాపకులు నూతన అంశాలపై అవగాహన పెంచుకోవాల్సిన ఆవశ్యకతను గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డైరక్టర్ ప్రొఫెసర్ కె.నాగేంద్రప్రసాద్ వివరించారు. కోఆర్డినేటర్ డాక్టర్ సి.హెచ్.ఆర్.ఫణికుమార్, డాక్టర్ చుక్కా రాజశేఖర్ పాల్గొన్నారు.

మెరిసిన క్రీడా రత్నాలు

కొమ్మాది, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో మధురవాడ ఆనంద్ తైక్వాండో క్లబ్ విద్యార్థులు ప్రతిభ కనబరచి 6 బంగారు, 4 కాంస్య, 4 రజత పతకాలు సాధించినట్లు కోచ్ ఆనంద్ సోమవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. జనవరి 31 నుంచి ఫిబ్రవరి 2 వరకు కాకినాడలో జరిగిన ఎన్.టి.ఆర్ మెమోరియల్ పోటీల్లో ఈ ఘనత సాధించారని తెలిపారు. విజేతలకు తైక్వాండో గ్రాండ్ మాస్టర్ కె.వి.బాబూరావు ప్రశంసాపత్రాలు అందించారు. కోచ్ ఎ.పవన్, బి.హేమంత్ టీం మేనేజర్ వేదవతి, సీత పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల ప్రకటన హర్షణీయం

కొమ్మాది, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఎన్నికలలో ఇచ్చిన హామీ మేరకు ఇళ్లులేని పేదలకు ఇళ్లు సమకూర్చుతామని ప్రకటించడం హర్షనీయమని సీపీఐ జిల్లా కార్యదర్శి మురుపిల్లి పైడిరాజు అన్నారు. సోమవారం మారికవలస రాజీవ్‌గృహకల్ప సముదాయంలో సీపీఐ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇళ్ల స్థలాల దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నేతలు సత్యనారాయణ, కేశవయ్య, పాల్గొన్నారు.

నిరంతర తాగునీటి సరఫరాకు ప్రణాళికలు

- ఆక్రమణలపై కఠినంగా ఉండాలి
- సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే గంటా ఆదేశం



జీవీఎంసీ అధికారులతో మాట్లాడుతున్న గంటా శ్రీనివాసరావు

భీమునిపట్నం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గం పరిధిలో ఉన్న భీమిలి, జీవీఎంసీ ఇతర వార్డుల్లోని ప్రజలకు ప్రతిరోజూ తాగునీటిని సరఫరా చేసేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని జీవీఎంసీ అధికారులను ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఆదేశించారు. సోమవారం ఆయన ఎంవీపీ కాలనీలో తన స్వగృహంలో వార్డులలో జరుగుతున్న అభివృద్ధి పనులు, సమస్యలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా, 2వ వార్డు కార్పొరేటర్ గాడు చిన్నికుమారిలక్ష్మి భీమిలి జోన్‌లో రోజు విడిచి రోజు ప్రజలకు కుళాయిల ద్వారా మంచినీటిని అందిస్తున్నట్టు ఈ సందర్భంగా ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఈ నేపథ్యంలో రూ. 25 కోట్లతో ట్రీట్‌మెంట్ ప్లాంట్ తదితర వసతులు కల్పిస్తే భీమిలి ప్రాంతవాసుల తాగునీటి సమస్య తీరుతుందన్నారు.దీనిపై ప్రణాళికలు రూపొందించాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. భీమిలి, మదురవాడ ప్రాంతాలలో భూకబ్జాలు, ఆక్రమణలు జోరుగా సాగుతున్నాయని, వీటినిపై కార్పొరేటర్లు, అధికారులు అప్రమత్తతతో ఉండాలన్నారు. ఆక్రమణకు అడ్డుకట్ట వేయకపోతే భవిష్యత్తులో నగర అభివృద్ధి అస్తవ్యస్తంగా మారుతుందన్నారు. పెండింగ్ అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తికి చర్యలు తీసుకోవాలని జీవీఎంసీ సీఈ శివప్రసాద్‌ను ఆదేశించారు. బిళ్లలమెట్ట కాలనీలో ఇళ్ల కేటాయింపులో అవకతవకలపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. భీమిలిలో రహదారుల విస్తరణపై ప్రజలతో చర్చించి తుది నిర్ణయం తీసుకుంటామన్నారు. భీమిలి, మదురవాడ ప్రాంతాలలో ఇంజనీరింగ్, పట్టణ ప్రణాళిక సమస్యలను కార్పొరేటర్లు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. టిడ్కో ఇళ్ల కేటాయింపును త్వరితగతిన పూర్తి చేస్తామన్నారు. సింహాచలం టివి టవర్ కాలనీలో జీవీఎంసీ రోడ్డు నిర్మాణాన్ని దేవస్థానం అడ్డుకోవడంపై ఎమ్మెల్యే గంటా అసంతృప్తి వ్యక్తం చేశారు కార్పొరేటర్లు గాడు చిన్నికుమారిలక్ష్మి, మొల్లి హేమలత, పిల్లా మంగమ్మ, లొడగల అప్పారావు, పి.వి.నరసింహం, దాడి రమేశ్‌నాయుడు, నాయకులు గంటా నూకరాజు, గాడు అప్పలనాయుడు, మొల్లి లక్ష్మణరావు, పిల్లా వెంకటరావు తదితర అధికారులు పాల్గొన్నారు.

స్టెమి వైద్య విధానంపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న మెడికల్ ఆఫీసరు ఫణికుమార్

భీమునిపట్నం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): నూతనంగా అందుబాటులోనికి వచ్చిన స్టెమి వైద్య సదుపాయాన్ని ప్రజలు సద్వినియోగపరచుకోవాలని స్థానిక సీహెచ్‌సీ మెడికల్ ఆఫీసరు ఫణి కుమార్ కోరారు. సోమవారం ఆస్పత్రిలో ఆశ కార్యకర్తలకు, ఎఎన్ఎంలకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఎవరైనా గుండెపోటుకు లోనైతే వెంటనే 108 ఫోన్ ద్వారా సమాచారం అందిస్తే ఆ బాధితులను వెంటనే ఆస్పత్రులకు తీసుకువెళతారన్నారు. కాగా, భీమిలి సీహెచ్‌సీ హార్ట్ ఎటాక్‌కు గురైన వారికి తగిన ట్రీట్‌మెంట్‌ను అందించడానికి అవసరమైన ఈసీజీ పరీక్షలు, టెనెక్టెప్లస్ ఇంజక్షన్ కూడా అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ విషయమై ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. వైద్యులు కళ్యాణి, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థినులకు స్పోర్ట్సు కిట్‌లు పంపిణీ

భీమునిపట్నం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): భీమిలి పండిట్ నెహ్రూ జీవీఎంసీ హైస్కూల్‌లో విద్యార్థినులకు నాంది ఫౌండేషన్ వారు స్పోర్ట్సు కిట్లను అందజేశారు.టీ షర్టు, నోట్ పుస్తకాలు, శానిటరీ నాప్కిన్స్, పెన్సిళ్లు, షూస్ ఈ కిట్లలో ఉన్నాయి. ఈ కార్యక్రమంలో ఆ పాఠశాల హెచ్‌ఎం శ్రీదేవి, ఫౌండేషన్ సభ్యులు లీల, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పంట నమోదు తప్పనిసరి: జేసీ



గంధవరంలో పంట నమోదు పరిశీలిస్తున్న జేసీ మయూర్ అశోక్

పద్మనాభం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ సహాయకులు తప్పనిసరిగా పంట నమోదు చేపట్టాలని జిల్లా జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ ఆదేశించారు. మండలంలోని అనంతవరం, గంధవరం గ్రామాల్లో ఆయన పంట నమోదు కార్యక్రమాన్ని సోమవారం ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పంట నమోదుతో రైతులకు ప్రభుత్వ రాయితీలు, ఎరువులు, పంట రుణాలు పొందడానికి వీలవుతుందన్నారు. ఈసందర్భంగా అనంతవరంలో రాగిపంటను, గంధవరంలో మినుము పంటను సూపర్ చెక్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి కె.అప్పలస్వామి, భీమిలి ఆర్డీఓ సంగీత్‌మాధుర్, తహసీల్దారు ఆనందరావు తదితరులు పాల్గొన్నారు. గంధవరంలో చేపడుతున్న రీసర్వేను జేసీ పరిశీలించారు. త్వరిత గతిన సర్వే పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు.

పరీక్షా పే చర్చ విజయవంతం



భీమిలి డైట్ కళాశాలలో పరీక్ష పే చర్చ వీక్షిస్తున్న ఉపాధ్యాయులు

భీమునిపట్నం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సోమవారం ప్రధాన మంత్రి నరేంద్రమోదీ నిర్వహించిన పరీక్షా పే చర్చా ప్రత్యక్ష ప్రసార కార్యక్రమం విజయవంతమైనట్టు స్థానిక ప్రభుత్వ జిల్లా విద్యా శిక్షణ సంస్థ డైట్ ప్రిన్సిపాల్, జాయింట్ డైరెక్టర్ ఎం.జ్యోతికుమారి ఒక ప్రకటనలో తెలిపారు.. డైట్‌లో 150 మంది ఛాత్రోపాధ్యాయులు, జిల్లాలోని అన్ని పాఠశాలల్లోను విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు మొత్తం 92,607 మంది ఈ కార్యక్రమాన్ని తగిన ఏర్పాట్లు చేసి వీక్షించారన్నారు. పట్టణంలో అన్ని పాఠశాలల్లోను వీక్షించినట్టు చెప్పారు.

రాములోరి సన్నిధిలో సంక్షిప్త రామాయణ హవనం



హవనం చేస్తున్న రుత్విక్‌లు



ప్రధాన కలశంతో ప్రదక్షిణ

సింహాచలం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానం అనుబంధంగా సింహగిరిపై ఈశాన్యదిక్కున గంగధారకు సమీపంలో కొలువుదీరిన సీతారామస్వామి సన్నిధిలో షడక్షరీ మంత్రపూర్వక సంక్షిప్త రామాయణ హవనం సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ప్రతిమాసంలో రాముని జన్మనక్షత్రం పునర్వసును పురస్కరించుకుని రామాలయంలో సంక్షిప్త రామాయణ హవనం చేయటం ఆచారంగా వస్తోంది. అదే క్రమంలో సోమవారం వేకువన సుప్రభాతసేవ, ప్రభాతారాధనలు యధావిధిగా పూర్తిచేశారు. హనుమ, లక్ష్మణ, సీతారాముల ఉత్సవమూర్తులను శోభాయమానంగా అలంకరించిన వేదికపై అధిష్ఠింపజేశారు. యాగకర్తగా సుదర్శన పెరుమాళ్‌ను వేదికపై ఉంచారు. లోకకల్యాణార్థం అనే సంకల్పంతో రుత్విక్‌స్వాములు విష్వక్సేనారాధన, పుణ్యాహవచనాలు చేసి షోడశోపచారాలు సమర్పించారు. పాంచరాత్రాగమశాస్త్ర విధానంలో కలశారాధన, బింబారాధన, మండపారాధన, యాగశాలార్చనలు చేశారు. ముందుగా సిద్ధం చేసిన హోమకుండంలో అగ్నిప్రతిష్టాపనం కావించి శ్రీరామ షడక్షరీ జపంతో, శ్రీమద్రామాయణంలోని బాలకాండ (సంక్షిప్త రామాయణం)ను పఠిస్తూ ప్రత్యేక హవనం జరిపారు. మహాపూర్ణాహుతి చేసి ప్రధాన కలశాన్ని శిరస్సున దాల్చి ఆలయ ప్రదక్షిణలు చేసి మూలవిరాట్ వద్ద పూజలు చేసి తరువాత దానిలోని పవిత్ర జలాలతో భక్తులను ప్రోక్షణ కావించారు. మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చి భక్తులకు హవన భస్మాన్ని, ప్రసాదాలను అందజేశారు. హవనం ఏర్పాట్లను దేవాలయ ఏఈఓ నక్కాన ఆనందకుమార్ సమీక్షించారు.

'మోదీ చరిష్మాతోనే ఢిల్లీలో విజయం'



ఆనందంతో భాజపా నాయకులు

సింహాచలం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): సుదీర్ఘ విరామం తరువాత హస్తినలో రాజ్యాధికారం ప్రధాని నరేంద్ర మోదీ చరిష్మాతో సాధ్యపడిందని మహావిశాఖ 98వ వార్డు భారతీయ జనతా పార్టీ అధ్యక్షుడు రచ్చా ఆనంద శ్రీనివాసవర్మ అన్నారు. వార్డు కార్యాలయంలో భాజపా విజయాన్ని పురస్కరించుకుని కార్యకర్తలు సంబరాలు చేసుకుని సంతోషాన్ని పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో వార్డు భాజపా అధ్యక్షుడు వేమూరి మహేష్, బసన అప్పలనాయుడు, తాళూరి శరత్, కె.రామకృష్ణ, ధనియాల అప్పలరాజు, పురుషోత్తమ్‌రెడ్డి పాల్గొన్నారు.

స్థలాలు వచ్చేవరకు పేదలకు అండగా ఉంటాం: సీపీఐ

కొమ్మాది, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఎన్నికలలో ఇచ్చిన హామీ ప్రకారం ఇళ్లు లేని అర్హులైన వారికి పట్టణాల్లో 2 సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్ల స్థలం, రూ.4 లక్షలు మంజూరు చేస్తామనడం ఆనందదాయకమని సీపీఐ జిల్లా కార్యదర్శి మురుపిల్లి పైడిరాజు అన్నారు. సోమవారం మారికవలస రాజీవ్ గృహకల్ప సముదాయంలో సీపీఐ ఆధ్వర్యంలో పేదల ఇళ్ల స్థలాల కోసం దరఖాస్తులు చేసుకునే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.ఫిబ్రవరి 16 వరకు దరఖాస్తులు చేయించి, 17న ప్రజలతో కలిసి తహసీల్దార్లకు అందజేస్తామన్నారు. పేదలకు స్థలాలు వచ్చేవరకు సీపీఐ అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మధురవాడ ఏరియా కార్యదర్శి వాండ్రాసి సత్యనారాయణ, బి.కేశవయ్య, ఎం.ఎస్.పాత్రుడు, అప్పలరాజు పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీ



భీమిలి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బాలికకు నులిపురుగుల నివారణ మాత్రలు వేస్తున్న వైద్యాధికారి

భీమునిపట్నం/ మధురవాడ, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): నులిపురుగుల నివారణతో ఆరోగ్యకరంగా ఉండవచ్చని వైద్యాధికారులు చెప్పారు. విద్యార్థులకు ఆరోగ్యకర అంశాలను ఉపాధ్యాయులు నేర్పాలని సూచించారు. జాతీయ నులిపురుగుల నివారణ దినం సందర్భంగా సోమవారం భీమిలి, మధరవాడలలో పాఠశాలల విద్యార్థులు, అంగన్‌వాడీ పిల్లలకు మాత్రలు పంపిణీ చేసి ఆరోగ్య సలహాలిచ్చారు. భీమిలిలో ప్రభుత్వ యూపీహెచ్‌సీ మెడికల్ ఆఫీసరు డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి ఆధ్వర్యంలో 7,700 మందికి మాత్రలు పంపిణీ చేశారు. మధురవాడ పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ ఎస్.ప్రశాంతి ఆధ్వర్యంలో సిబ్బంది 3,580 మంది పిల్లలకు నులిపురుగుల నివారణ మాత్రలు అందించారు. ప్రతీ ఆరు నెలలకు ప్రభుత్వం ఈ మాత్రలను ఉచితంగా పంపిణీ చేస్తుందన్నారు. రెండేళ్ల వయసు నుంచి 19 ఏళ్ల వరకు ఏడాదికి రెండుమార్లు వేసుకోవాలని డాక్టర్ ప్రశాంతి సూచించారు.

మహా నిర్లిప్తత!

... 5వ పేజీ తరువాయి

అందజేస్తుంటారు. వీటిపై తగు చర్యలు తీసుకోవాలంటూ సంబంధిత అధికారులకు కమిషనర్‌ను సూచిస్తారు. అయితే గత 20 రోజులుగా పూర్తిస్థాయిలో కమిషనర్ లేకపోవడంతో అన్నీ నిలిచిపోయాయి. దీనివల్ల అధికారుల్లో కూడా నిర్లిప్తత పెరిగిపోయింది. విధులను తూతూమంత్రంగా నిర్వర్తిస్తున్నారు. మొక్కుబడిగా కార్యాలయానికి వచ్చి వెళ్లిపోతున్నారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో కిందిస్థాయి సిబ్బందిలో కూడా నిర్లక్ష్యం పెరిగిపోతోంది.

మరోవైపు వేసవి సీజన్ ప్రారంభం అవుతుండడంతో తాగునీటి సరఫరాలో ఇబ్బందులు మొదలవుతున్నాయి. జోన్-6 పరిధిలో కొండవాలు ప్రాంతాలకు నీటి సరఫరాలో అవాంతరాలు ఏర్పడుతున్నాయి. వేసవి ప్రభావం పెరిగేకొద్దీ నీటిసమస్యలు కూడా పెరుగుతాయి. పూర్తిస్థాయి కమిషనర్ ఉంటే ఇప్పటికే వేసవి యాక్షన్ ప్లాన్‌ను తయారుచేసి, అందుకోసం అవసరమయ్యే నిధులను కేటాయించేందుకు అవకాశం ఉండేది. అంతేకాకుండా 2025-26 ఆర్థిక సంవత్సరానికి జీవీఎంసీ బడ్జెట్‌ను స్టాండింగ్ కమిటీ ఆమోదించింది. కౌన్సిల్ ఆమోదించాల్సిన తరుణంలో కమిషనర్ సంపత్‌కుమార్‌కు బదిలీ అయ్యింది. ఇప్పుడు ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో బడ్జెట్ సమావేశం నిర్వహణకు ఎన్నికల కమిషన్ ప్రత్యేక అనుమతి పొందాల్సిన అవసరం ఏర్పడింది. పూర్తిస్థాయి కమిషనర్ ఉంటేనే గానీ దీనికోసం లేఖ రాసే పరిస్థితి కనిపించడం లేదు. నగర ప్రాముఖ్యత దృష్ట్యా రాష్ట్ర ప్రభుత్వం వీలైనంత త్వరగా కమిషనర్‌ను నియమించాల్సి ఉంది.

ఉక్కులో 16 మంది ఉన్నతాధికారులకు షోకాజ్ నోటీసులు

... 5వ పేజీ తరువాయి

తయారు చేసుకుంటుంది. కానీ ఇక్కడ ఎమర్జెన్సీ పేరుతో నేరుగా కోక్‌నే కొన్నారు. సరఫరా చేసిన కోక్ నుంచి నమూనాలు తీసి, వాటిని ప్రయోగశాలకు పంపించి, అక్కడ నుంచి వచ్చిన నాణ్యత నివేదిక ప్రకారం బిల్లు రూపొందించి ఆర్థిక విభాగానికి పంపుతారు. అయితే ఈ కేసులో ఐసీపీపీఎల్ నమూనాలు సకాలంలో సమర్పించలేదు. ఆ తరువాత పంపిన వాటిలో నాణ్యత తక్కువగా ఉండడంతో మరోసారి నమూనాలు కోరారు. ఈ ప్రక్రియ నడుస్తుండగా ఢిల్లీ నుంచి ఉక్కు మంత్రిత్వ శాఖ అధికారులు...ముడి పదార్థాల సరఫరాదారులకు ఎంత బకాయిలు ఉన్నాయో నివేదిక ఇవ్వాలని ఇక్కడి అధికారులను కోరారు. అప్పటికి ఐసీపీపీఎల్ నమూనాలు ఇవ్వకపోవడం వల్ల బిల్లు జనరేట్ కాలేదు. దాంతో ఢిల్లీకి పంపిన నివేదికలో ఆ సంస్థకు ఇవ్వాల్సిన రూ.220 కోట్లు బకాయిగా చూపించలేదు. ఆ తరువాత వచ్చిన నమూనాలు, నాణ్యత నివేదిక ప్రకారం ఆ సంస్థకు ఇవ్వాల్సిన మొత్తం చెల్లించేశారు. అయితే తాము బకాయిల వివరాలు పంపాల్సిందిగా కోరితే...ఆ రూ.220 కోట్ల బిల్లు విషయం ప్రస్తావించలేదంటూ ఢిల్లీ అధికారులు విజిలెన్స్‌కు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో రా మెటీరియల్ డిపార్ట్‌మెంట్, మెటీరియల్ మేనేజ్‌మెంట్, క్వాలిటీ అండ్ ఎనాలసిస్ లేబరేటరీ, ఫైనాన్స్ విభాగాల్లో పనిచేస్తున్న 16 మందికి షోకాజ్ నోటీసులు అందాయి. వీరిలో సీనియర్ మేనేజర్ నుంచి జనరల్ మేనేజర్ స్థాయి వరకు అధికారులు ఉన్నారు. వీరిలో ఎనిమిది మందికి నెగ్రహా అవార్డులు కూడా వచ్చాయి. ఏ తప్పు చేయకపోయినా షోకాజ్‌లు ఇచ్చారని, కొద్దికాలంలో పదవీ విరమణ చేసే వారిని ఇలా ఇబ్బంది పెట్టడం ఏమిటని ఉద్యోగ వర్గాలు ఆవేదన వ్యక్తంచేస్తున్నాయి. తక్షణమే వాటిని ఉపసంహరించుకోవాలని, లేదంటే ఉద్యోగ వర్గాల్లో అశాంతి రేగుతుందని హెచ్చరిస్తున్నాయి.

కొండలపై భూమి నూరుశాతం వినియోగం

... 5వ పేజీ తరువాయి

మెటామైండ్, సిఫీ, జెనోసాఫ్ట్)కు ఎకరా నుంచి తొమ్మిది ఎకరాల వరకు కేటాయించారు. ఈ కొండపైనే స్టార్టప్ విలేజ్, మిలీనియం టవర్-1, టవర్-2లు ఉన్నాయి. ఈ కొండపై ప్రైవేటు కంపెనీల్లో నాలుగు వేల మంది వరకు పనిచేస్తున్నారు.

- హిల్ నంబరు 4 మొత్తం 276.77 ఎకరాలు అదానీ డేటా సెంటర్‌కు కేటాయించారు.
- కాపులుప్పాడలో గతంలో లోకేశ్ ఐటీ మంత్రిగా పనిచేసినప్పుడే 170 ఎకరాల్లో లేఅవుట్ వేశారు. ఇప్పటికీ ఎవరికీ కేటాయించలేదు.

...ఇవి కాకుండా మంగమారిపేటలో చినజీయరు స్వామికి, వైసీపీ ప్రభుత్వం భీమిలి సమీపాన శారదా పీఠానికి భూములు కేటాయించాయి. వీటికి ప్రభుత్వం ఎటువంటి మార్గదర్శకాలు ఇవ్వలేదు. రహదారి ఎక్కడి నుంచి వేయాలి?, భూమిని ఎలా ఉపయోగించాలనే దానిపై స్పష్టత లేదు. వీటిపై కూడా ప్రస్తుత ప్రభుత్వం దృష్టిపెట్టింది.

పాలసీలో మంచి రాయితీలు

- ఓ.నరేశ్‌కుమార్, ఉపాధ్యక్షులు, రుషికొండ ఐటీ పార్క్ అసోసియేషన్

కూటమి ప్రభుత్వం కొత్త ఐటీ పాలసీలో ఐటీ కంపెనీలకు రాయితీలు ప్రకటించింది. గతంలో నిర్దేశించిన విస్తీర్ణం కంటే ఎక్కువ నిర్మిస్తే చదరపు అడుగుకు రూ.2 వేలు రాయితీ వస్తుంది. ఇది పూర్తిగా ఆర్థిక మండలి. అయినా సరే ఉద్యోగులకు ఇళ్లు, వ్యాపార కార్యకలాపాలకు కమర్షియల్ కాంప్లెక్స్‌ల నిర్మాణానికి అనుమతి ఇస్తామని చెప్పింది. అయితే వాటికి రాయితీలు ఉండవు. ఎకరాల కొద్దీ భూమిని తీసుకున్నవారు ఇంకా రెట్టింపు సంఖ్యలో ఉద్యోగులకు అవకాశం కల్పించాలనేదే ప్రభుత్వ ధ్యేయం.

జాడలేని చిరుతలు!

... 5వ పేజీ తరువాయి

చుట్టూ ఉన్న రహదారులపై నిరంతరం వాహనాలు తిరగడంతో చిరుతల జీవనానికి అనువైన వాతావరణం కరవైంది.

గడచిన ఐదారు సంవత్సరాల నుంచి కంబాలకొండ, పరిసరాల్లో చిరుతలు సంచరించినట్టు పాదముద్రలు (పగ్ మార్క్స్) కనిపించలేదని సిబ్బంది చెబుతున్నారు. కొన్నిచోట్ల ఏర్పాటుచేసిన ట్రాప్ కెమెరాల్లో కూడా చిరుతల ఆనవాళ్లు లభించలేదు. ఇటీవల కాలంలో చిరుతల గాండ్రింపు శబ్దం వినిపించలేదంటున్నారు. సుమారు నాలుగేళ్ల క్రితం చేపట్టిన జంతువుల సర్వేలో చిరుతల సంఖ్య ప్రస్తావించలేదు. కంబాలకొండ పరిసరాల్లో ప్రస్తుతం వందల సంఖ్యలో జింకలు, కొండ గొర్రెలు, మేకలు ఉన్నాయి. జింకలు భారీగా పెరగడానికి చిరుతలు లేకపోవడమే కారణమని అంటున్నారు.

వాహన శబ్దాలు, జనావాసాలు పెరగడం, తదితర కారణాలతో చిరుతలు మరో ప్రాంతానికి వలస పోయి ఉంటాయని అటవీ శాఖ సిబ్బంది అనుమానిస్తున్నారు. చిరుతలు ఉంటే...ఏదో ఒక సమయంలో వాటి ఉనికి తెలిసేదని, అనేక కారణాలతో బహుశా వలస పోవడం లేదా అంతరించిపోయి ఉండవచ్చునని చెబుతున్నారు. ఇదిలావుండగా విశాఖ పరిసరాల్లో తూర్పు కనుముల్లోని చిరుతలు ఎంతో అందమైనవని, ప్రపంచంలో ఆఫ్రికా అడవుల్లో తప్ప మరెక్కడా ఇటువంటి జంతువులు లేవని ఏయూ జంతుశాస్త్రం విభాగం రిటైర్డు ఆచార్యుడు డీఈ బాబు అన్నారు.

పూర్ణామార్కెట్ ప్రాంతంలో ఆక్రమణల తొలగింపు

... 5వ పేజీ తరువాయి

అవుతున్నందుకు జరిమానా విధిస్తామని హెచ్చరించారు. వారి చేతనే ఆయా దుకాణాల వద్ద పేరుకుపోయిన వ్యర్థాలను తొలగింపజేశారు. మధ్యాహ్నం మూడు గంటలకల్లా మెయిన్‌రోడ్డులో ఆక్రమణలను పూర్తిగా తొలగించారు. అనంతరం దుర్గాలమ్మగుడి జంక్షన్ నుంచి అగ్నిమాపక శాఖ కార్యాలయం వరకూ బస్టాపుల్లో ఉన్న దుకాణాలను తొలగించారు. అనంతరం పూర్ణామార్కెట్‌లో వాహనాల పార్కింగ్‌కు వసూలు చేసే ఫీజు వివరాలు ప్రజలకు తెలిసేలా ఎక్కడికక్కడ బోర్డులను ఏర్పాటుచేశారు. ప్రధాన రహదారిలో ఆక్రమణలను తొలగించడంతోపాటు పార్కింగ్ ఫీజుల దందాకు అడ్డుకట్ట వేయడంపై కొనుగోలుదారులు, వ్యాపారులు ఆనందం వ్యక్తంచేశారు. పోలీస్, జీవీఎంసీ అధికారుల వద్దకు వెళ్లి అభినందించారు.

గాజువాకలో ఇనాం భూముల క్రమబద్ధీరణకు గ్రీన్‌సిగ్నల్

... 5వ పేజీ తరువాయి

101 నుంచి 200 వరకూ రూ.100, 201 నుంచి 400 వరకూ రూ.240, 401 నుంచి వెయ్యి గజాల వరకూ గజానికి రూ.రెండు వేలు చెల్లించాలి. రెండేళ్ల తరువాత సాధారణ రిజిస్ట్రేషన్ ఫీజు తీసుకుని నివాసాలు, వాణిజ్య భవనాలను రిజిస్టర్ చేస్తారు.

ఆక్రమణదారులు తమ దరఖాస్తులను మీ-సేవా కేంద్రాల్లో అందజేయాలి. స్థలం కొనుగోలు చేసిన వ్యక్తులతో జరిపిన లావాదేవీలకు సంబంధించి రిజిస్ట్రేషన్ డాక్యుమెంటు, ఇంటి పన్ను, నీటి పన్ను రశీదులు, కరెంటు బిల్లు, ఇంకా ఆక్రమణలు ధ్రువీకరించే ఆధారాలతో కూడిన డాక్యుమెంట్లను దరఖాస్తుతో పాటు ఈ ఏడాది డిసెంబరు 31లోగా సమర్పించాలి. దరఖాస్తులను రెవెన్యూ, జీవీఎంసీ అధికారులతో కూడిన కమిటీ పరిశీలిస్తుంది. ఆమోదం తెలిపిన తేదీ నుంచి ఏడాదిలోపు నాలుగు వాయిదాల్లో చలానా ద్వారా ఫీజు చెల్లించాలి. అప్పుడే తహసీల్దారు సదరు ఆక్రమణదారుడికి కన్వేయన్స్ డీడ్ జారీచేస్తారు. ఇదే సమయంలో 101 గజాల దాటిన ఆక్రమణదారులు స్టాంపు డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. ఆక్రమణలో ఉన్న ఖాళీ స్థలాలను క్రమబద్ధీకరించరు. ఒక్క నిర్మాణాలకు మాత్రమే తాజా ఉత్తర్వులు వర్తిస్తాయి.

మూర్ఛ వ్యాధిపై అవగాహన

తగరపువలస, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక బంగ్లామెట్టలో వున్న జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎం రెడ్డిపల్లి అప్పలరాజు ఆధ్వర్యంలో అంతర్జాతీయ మూర్ఛ నియంత్రన రోజును నిర్వహించారు. ఈ సందర్భంగా, మూర్ఛ వ్యాధి ఎలా వస్తుంది, లక్షణాలను విద్యార్థులతో నాటక రూపంలో ప్రదర్శించారు. స్పృహ కోల్పోవడం, అనియంత్రిక కదలికలు, ఆకస్మిక గందరగోళం ప్రతిస్పందనలు లేకపోవడం తదితర అంశాలు ఉంటాయన్నారు.

కరాటే టోర్నీలో నగర క్రీడాకారులకు స్వర్ణ పతకాలు

విశాఖపట్నం స్పోర్ట్సు, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్ టోర్నీలో నగరానికి చెందిన జపాన్ కరాటే అసోసియేషన్ ఆఫ్ ఇండియా క్రీడాకారులు స్వర్ణ, రజత, కాంస్య పతకాలు కైవసం చేసుకున్నారు. జేకేఏఐ ఏపీ చీఫ్ కోచ్ మోహన్ వంశీ వద్ద శిక్షణ పొందుతున్న ఆరుగురు క్రీడాకారులు అద్భుతమైన ప్రతిభ చూపి పతకాలు సొంతం చేసుకున్నారు. కటాస్ స్టైల్ ఈవెంట్ బాలికల విభాగంలో కె.మేఘన, ఎం.నిఖిలశ్రీ, ఎస్.సంజన, ఆర్.శాన్వి, బాలుర విభాగంలో ప్రియాన్షు రౌట్, బి.త్రిలోకేష్ బంగారు పతకాలు సాధించారు. కుమిటి ఈవెంట్ బాలికల విభాగంలో ఎం.నిఖిలశ్రీ రజతం, ఎస్.సంజన కాంస్య పతకం సాధించగా, బాలుర విభాగంలో ప్రియాన్షు రౌట్ రజతం, బి.త్రిలోకేష్ కాంస్య పతకం దక్కించుకున్నారు. ఈ సందర్భంగా చీఫ్ కోచ్ షిహాన్ ఆనందరత్న, సుదర్శన్, సీనియర్ కోచ్ ఆర్.బాలరాజు, కోచ్ కృష్ణవేణి క్రీడాకారులను అభినందించారు.

అడుగడుగునా ఆక్రమణలు

» పట్టించుకోని జీవీఎంసీ పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు

» స్థానికుల రాకపోకలకు ఇబ్బందులు

ఆరిలోవ, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): నగరంలో ఎక్కడ స్థలం కనిపించినా ఆక్రమణలు చోటుచేసుకుంటున్నాయి. ప్రభుత్వ స్థలాలను కొంతమంది దర్జాగా కబ్జా చేస్తుండగా, మరికొంతమంది రహదారులు, ఫుట్‌పాత్‌లను ఆక్రమించి, దుకాణాలు ఏర్పాటు చేసుకుంటున్నారు. మరికొందరు ఫుట్‌పాత్‌లను వాహనాల పార్కింగ్‌గా వినియోగిస్తున్నారు. జీవీఎంసీ పదో వార్డు ఆదర్శనగర్‌లో గల సెమెన్ బ్యాంకు కూడలి సమీపంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు ఆనుకొని బడ్డీలను ఏర్పాటుచేశారు. ఇది ప్రమాదకరమని తెలిసినా అధికారులు పట్టించుకోవడం లేదు. ఎక్కడో ఓ చోట వ్యాపారానికి స్థలం దొరికిందనే ఉద్దేశంతో చిరు వ్యాపారులు ఇలా ట్రాన్స్‌ఫార్మర్లకు సమీపంలో దుకాణాలను ఏర్పాటు చేస్తున్నారు. కొన్నిసార్లు ఈ ప్రాంతంలో ట్రాన్స్‌ఫార్మర్ల నుంచి శబ్దాలు, నిప్పురవ్వలు పడుతుంటాయని స్థానికులు చెబుతున్నారు. ఇలా బడ్డీలను ఏర్పాటు చేయడం మరింత ప్రమాదకరమని అంటున్నారు. జీవీఎంసీ అధికారులు, ట్రాఫిక్ పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతోనే నిబంధనలకు విరుద్ధంగా, ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగేలా దుకాణాలు వెలుస్తున్నాయని మండిపడుతున్నారు. ఏదైనా ప్రమాదం జరగకముందే ట్రాన్స్‌ఫార్మర్ల ముందు ఏర్పాటు చేసిన దుకాణాల తొలగింపునకు అధికారులు చర్యలు తీసుకోవాలంటున్నారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఏర్పాటు చేసిన బండ్లు

ఫుట్‌పాత్‌లపై వాహనాల పార్కింగ్

జీవీఎంసీ 12వ వార్డు పెదగదిలి శివాలయం పక్కన ఫుట్‌పాత్ ఆక్రమణకు గురయింది. దీనిని కార్లు పార్క్ చేసుకునేందుకు దర్జాగా వినియోగిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ఇక్కడ ఒక లాడ్జీ ఉంది. అక్కడకు వచ్చే వినియోగదారులు తమ వాహనాలను ఫుట్‌పాత్‌పైనే నిలిపివేస్తుండడంతో పాదచారులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీనిపై ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. సాధారణంలో లాడ్జిలు నిర్మించే సమయంలో వినియోగదారుల వాహనాలను పార్క్ చేసేందుకు ఏర్పాట్లు చేసుకోవాల్సి ఉంటుంది. అయితే ఇక్కడి లాడ్జి యాజమాన్యం ఫుట్‌పాత్‌ను పార్కింగ్ ప్రదేశంగా మార్చేసింది. కాసుల కక్కుర్తితో అధికారులు దీనిని పట్టించుకోవడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు. పార్కింగ్ లేకుండానే లాడ్జి నిర్వహణకు అనుమతులు ఇవ్వడంపైనా అనుమానాలున్నాయంటున్నారు.



ఫుట్‌పాత్‌పై పార్క్ చేసిన కార్లు

మూట్ కోర్టు పోటీల పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వీసీ

వెంకోజీపాలెం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): జాతీయ మూట్ కోర్టు పోటీలు 2025 పోస్టర్‌ను సోమవారం ఏయూ వీసీ ఆచార్య జి.శశిభూషణరావు, రెక్టార్ ఆచార్య ఎన్.కిషోర్‌బాబు, రిజిస్ట్రార్ ఆచార్య ఈఎన్ ధనుంజయరావుల ఆవిష్కరించారు. మార్చి 21 నుంచి 23 వరకు అంబేడ్కర్ న్యాయ కళాశాలలో పోటీలను నిర్వహించనున్నారు. న్యాయ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.సీతామాణిక్యం, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎంవీఆర్ రాజు, ఐఏఎస్ఈ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డి.నాగరాజకుమారి, డాక్టర్ ఎల్.వి.కే.ప్రసాద్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా నిత్యానంద త్రయోదశి ఉత్సవాలు



పూజలందుకుంటున్న నిత్యానంద

ఎంవీపీ కాలనీ, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక టీటీడీ కల్యాణ మండపంలో సోమవారం సాయంత్రం నిత్యానంద త్రయోదశి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. నిత్యానంద భగవంతుని దివ్య ఆవిర్భావదినోత్సవం సందర్భంగా హరే కృష్ణ మూవ్‌మెంట్ భక్తులు స్వామి వారికి గంగా, యమున, గోదావరి, సరస్వతి, నర్మద, సింధు, కావేరి వంటి సప్త నదీ జలాలు, పండ్ల రసాలు, పూలు, 108 కలశాలతో మహాభిషేకం నిర్వహించారు. 58 రకాల పిండి వంటలను నివేదించిన అనంతరం మహా ప్రసాద వితరణ చేశారు. హరేకృష్ణ మూవ్‌మెంట్ అధ్యక్షులునిష్క్రించిన భక్తదాస నిత్యానంద ప్రభు ప్రాముఖ్యతను తెలియజేశారు.

రైల్వేస్టేషన్‌లో గంజాయి పట్టివేత

విశాఖపట్నం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): రైల్లో గంజాయి రవాణా చేస్తున్న వ్యక్తులను పట్టుకుని కేసులు నమోదు చేశామని పోలీసులు తెలిపారు. జీఆర్పీ ఎస్ఐ కేటీఆర్ లక్ష్మి, ఆర్పీఎఫ్ ఎస్ఐ మిస్త్రీ తనిఖీ చేస్తుండగా ఒడిశాకు చెందిన మిట్టుఖేముండ్, బసంత ఖేముండ్, నీలకంట బండ వద్ద 18 కిలోల గంజాయి బ్యాగ్‌లు లభించాయన్నారు. జీఆర్పీ ఎస్ఐ కె.శాంతారామ్, ఆర్పీఎఫ్ ఎస్ఐ ఎస్‌కె.బారిక్ తనిఖీల్లో ఉత్తరాఖండ్‌కు చెందిన మోహన్‌సింగ్ వద్ద ఏడు కిలోల గంజాయి లభించిందన్నారు. నిందితులు నలుగురిపై కేసులు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచామన్నారు.

సినిమా గైడ్

● **తండేల్:** జగదాంబ, సంగం, కామేశ్వరి, శ్రీరామ, శ్రీవెంకటేశ్వర, శ్రీలీలామహల్, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), మోహిని (గాజువాక), అన్నపూర్ణ(కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ),

● **భవానీ వార్డ్:** జగదాంబ, రమాదేవి

● **మదగజరాజా:** జగదాంబ, వెంకటేశ్వర-1, సౌజన్య (గోపాలపట్నం), శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా),

● **సంక్రాంతికి వస్తున్నాం:** శారద, మెలోడి, జగదాంబ, కిన్నెర, కాంతి, శ్రీలక్ష్మీనరసింహ-1,2 (104 ఏరియా), శ్రీనరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), తాతా, రాములమ్మ (తగరపువలస)

● **డాకు మహారాజ్:** శరత్, శ్రీకన్య, కిన్నెర, సుకన్య, మోహిని కాంప్లెక్స్, శ్రీకన్య హెవెన్ (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), గణేష్, సప్తగిరి (తగరపువలస)

● **గేమ్ ఛేంజర్:** మెలోడి, సంగం, కామేశ్వరి, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), కన్యకాంప్లెక్స్, మోహిని కాంప్లెక్స్ (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-2 (పెందుర్తి) రాములమ్మ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 32, టమాటా 12, వంకాయలు (తెలుపు) 16, వంకాయలు (నలుపు) 18, బెండకాయలు 40, పచ్చిమిర్చి 32, కాకరకాయలు 40, బీరకాయలు 46, ఆనపకాయ12, కాలీఫ్లవర్ 12, క్యాబేజి 12, క్యారెట్ 26 దొండకాయలు 32, బంగాళదుంపలు 16, అరటికాయ 7, మునక్కాడలు (కిలో) 80, అల్లం 40, బరబాటి 30, ముల్లంగి 20, నిమ్మకాయలు (కిలో) 62, బద్ధచిక్కుడు 26, దోసకాయలు 22, వెల్లుల్లి 170, కొబ్బరికాయ 25, బీన్స్ (పెన్సిల్) 40, కీరదోస 26, కాప్సికమ్ 40, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 36 చిలగడదుంపలు 38, కంద 68, దేముడుచిక్కుడు 28, గోరుచిక్కుడు 28, కూర పెండలం 26, బ్రకోలి 55, నూల్‌కోల్ 30, పనసపొట్టు 200, కొండఉసిరి 70, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్దకట్ట) 25, పుదీన (కట్ట) 4, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 120, బూడిదగుమ్మడికాయ 30, కర్రపెండలం 20, మామిడి అల్లం 46, బొప్పాయి 38, జామకాయలు (కిలో) 60.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	465
విజయనగరం	469
శ్రీకాకుళం	469

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	93
లైవ్ ధర	113
విత్ స్కిన్	196
స్కిన్‌లెస్	206

సీపీ కార్యాలయంలో పార్కింగ్ ప్రారంభం



టూవీలర్ పార్కింగ్‌ను ప్రారంభిస్తున్న సీపీ శంఖబ్రతబాగ్చి, అధికారులు

విశాఖపట్నం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): నగర పోలీస్ కమిషనరేట్‌లో ద్విచక్రవాహనాల పార్కింగ్ షెడ్‌ను సీపీ శంఖబ్రతబాగ్చి సోమవారం ప్రారంభించారు. సిబ్బందితోపాటు సమస్యల పరిష్కారం కోసం వచ్చేవారు తమ వాహనాలను పార్క్ చేసుకునేందుకు స్థలం లేకపోవడంతో ఇబ్బంది పడుతుండడంతో పాత స్పెషల్‌బ్రాంచి భవనం ఉన్న చోట 120 ద్విచక్రవాహనాలు నిలిపేందుకు వీలుగా షెడ్‌లను నిర్మించారు. కార్యక్రమంలో పోలీస్ ఉన్నతాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

గుండెపోటుతో జ్యూ క్యూరేటర్ కారు డ్రైవర్ మృతి

ఆరిలోవ, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): ఇందిరాగాంధీ జంతు ప్రదర్శనశాల క్యూరేటర్ కారు డ్రైవర్ రవికుమార్ ఆదివారం గుండెపోటుతో మృతి చెందినట్టు జూ క్యూరేటర్ మంగమ్మ తెలిపారు. సాయంత్రం తనను కారులో ఎండాడలోని ఇంటివద్ద దింపి, తన ఇంటికి వెళ్లిన వెంటనే కళ్లు తిరిగి పడిపోయాడన్నారు. వెంటనే గీతం వైద్యశాలకు తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడన్నారు. మృతుడికి భార్య అరుణ, ఇద్దరు కుమారులున్నారు. అరుణ జూ క్యాంటీన్‌లో పనిచేస్తోందని, రవి గత 15 ఏళ్లుగా అవుట్‌సోర్సింగ్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడన్నారు.

హ్యాకథాన్‌లో కృష్ణా కళాశాల విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల యాజమాన్య ప్రతినిధులు

మద్దిలపాలెం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): సిద్ధార్థ అకాడమీ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ మెడికల్ అండ్ ఇంజనీరింగ్ రీసెర్చర్స్ నిర్వహించిన మెగా ఏ1 అటానమస్ హ్యాకథాన్-25లో డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచారు. బీఎస్సీ కంప్యూటర్ సైన్స్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న నరవ ఉమామహేష్, పల్లి దానవేంద్ర గేమ్స్ విభాగంలో 'మేజ్‌గేమ్ మాస్టరీ' ప్రాజెక్టును ప్రదర్శించి ప్రథమ బహుమతి సాధించారు. ఈ సందర్భంగా కళాశాలలో సోమవారం వారిని ప్రిన్సిపాల్ విజయబాబు అభినందించారు. కార్యక్రమంలో అధ్యాపకులు శివప్రసాద్, ఎస్.సాంబమూర్తి, పి.రామచంద్ర పాల్గొన్నారు.

నేత్రపర్వంగా అప్పన్న నిత్య కల్యాణం

సింహాచలం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆర్జిత నిత్యకల్యాణం సోమవారంనేత్రపర్వంగా సాగింది. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించి మాంగల్యధారణ, అక్షతారోపణ చేశారు. మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చి భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

కలుషిత ఆహారానికి దూరంగా ఉండాలి



విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలు వేస్తున్న ప్రిన్సిపాల్ విజయబాబు

మద్దిలపాలెం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): కలుషిత ఆహారానికి దూరంగా ఉంటే నులి పురుగుల సమస్యలు తలెతదని డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ విజయబాబు సూచించారు. కళాశాలలో సోమవారం నిర్వహించిన నులి పురుగుల దినోత్సవంలో ఆయన విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలను వేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నులి పురుగులు పేగుల నుంచి పోషకాలు గ్రహిస్తాయన్నారు. వీటి ద్వారా రక్తహీనత, పోషకాహారలోపం, వికారం, విరోచనాలు వంటి ఇబ్బందులు వస్తాయన్నారు. అల్బెండజోల్ మాత్రలు వేసుకోవడం ద్వారా నులిపురుగులను నియంత్రించవచ్చన్నారు. 19 సంవత్సరాలలోపు వయసు వారంతా ఈ మాత్రలు వేసుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులకు మాత్రలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ పి.జయ, అధ్యాపకులు పి.ఉమామహేశ్వరరావు, బి.నాగేశ్వరరావు, కె.రవిబాబు, రాజేశ్వరరావు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషిచేయండి



వర్క్‌షాప్ పాల్గొన్న ఏయూ పర్యావరణ విభాగం విశ్రాంత ఆచార్యులు రెడ్డి

మద్దిలపాలెం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణకు యువత కృషి చేయాలని ఏయూ పర్యావరణ విభాగం విశ్రాంత ఆచార్యులు ఈయూబీ రెడ్డి పిలుపునిచ్చారు. మద్దిలపాలెం భావన స్కూల్లో సోమవారం వ్యాస్ సంస్థ నిర్వహించిన క్లైమేట్ ఫర్ యూత్ యాక్షన్ వర్క్‌షాప్ ఆయన మాట్లాడారు. భూమి వేడెక్కకుండా యువత పూర్తిస్థాయిలో కృషి చేయాలన్నారు. నదులు, వాగులు, సముద్రాల లోపలికి హానికరమైన రసాయనాలు, లోహాలు, హాని కలిగించే ప్లాస్టిక్ వస్తువులు వెళ్లకుండా చూడాలన్నారు. భారత ప్రజారోగ్యసంస్థ కేంద్ర కార్యవర్గ సభ్యుడు ఎంవీవీ మురళీమోహన్ మాట్లాడుతూ విద్యుత్ వినియోగం తగ్గించకుంటే వేడి ఉండదన్నారు. పుస్తకాలు, కాగితాలు దుర్వినియోగం చేయకూడదన్నారు. చెత్తను మనమే నిర్మూలించి పర్యావరణహితంగా జీవించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఆర్‌యూ జీవీఎంసీ ప్రతినిధి దివ్య, స్కూల్ ప్రిన్సిపాల్ షణ్ముఖం, ఎకో వారియర్ జేవీ రత్నం, గ్రీన్ వలంటీర్స్ జె.రవితేజ, ఐ.కృష్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.

'ఆప్కాస్‌ను రద్దు చేస్తే రాష్ట్ర వ్యాప్త ఉద్యమం'

సిరిపురం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్‌లోని గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఆప్కాస్‌ను రద్దుచేస్తే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమిస్తామని జీవీఎంసీ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షులు ఎం.ఆనందరావు హెచ్చరించారు. అవుట్‌సోర్సింగ్ కార్మికులను ఆప్కాస్ ద్వారా జీతం, పీఎఫ్, ఈఎస్ఐ సదుపాయం కల్పించి గత ప్రభుత్వం భరోసాగా నిలిచిందని కూటమి ప్రభుత్వం దీనిని రద్దు చేసి శాఖాపరంగా ఏజెన్సీలకు అప్పగిస్తామని చెప్పడాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. ఈ మేరకు సోమవారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయం ద్వారం వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆప్కాస్ రద్దు చేస్తే అంతకంటే మంచి వ్యవస్థను తీసుకురావాలని, లేనిపక్షంలో ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేస్తున్న అవుట్‌సోర్సింగ్ ఆప్కాస్ ఉద్యోగులకు మినీమం టైమ్ స్కేల్ అమలుచేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆప్కాస్ ఉద్యోగుల ఆందోళన కార్యక్రమాన్ని, నిరవధిక సమ్మెను చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కార్మికులు సత్యం, సతీష్, రామకృష్ణ, ఈశ్వరరావు, ప్రసాద్, శ్రీను, కనకరాజు, జీవన్, శేఖర్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న జీవీఎంసీ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు

వైసీపీ అధ్యక్షుడు అమర్‌నాథ్‌కు సత్కారం

వెంకోజీపాలెం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్‌ను సోమవారం ఆయన నివాసంలో పార్టీ వివిధ విభాగాల అధ్యక్షులు కలిసి సత్కరించారు. పార్టీ అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా వలంటీరు, సోషల్ మీడియా అధ్యక్షులు పీలా ప్రేమ్‌కిరణ్, బొండా ఉమామహేశ్వరరావు, యువజన విభాగం ఉపాధ్యక్షుడు బింగి హరికిరణ్‌రెడ్డి, కొట్యాడ సూర్య, ప్రభాకర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.



అమర్‌నాథ్‌ను సత్కరిస్తున్న వైసీపీ విభాగాల అధ్యక్షులు

ఘనంగా కన్యకాపరమేశ్వరి ఆలయ వార్షికోత్సవం



కన్యకాపరమేశ్వరి ఆలయంలో మండపారాధన పూజలు

పద్మనాభం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయ ఎనిమిదో వార్షికోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం పంచామృతాభిషేకాలు, విశేష అర్చనలు చేశారు. గణపతి పూజ అనంతరం పుణ్యాహావచనం మండపారాధన చేశారు. మహన్యాస పూర్వక రుద్రాభిషేకం, 108 కలశాలతో ఊరేగింపు చేసి ఆ జలాలతో అమ్మవారిని అభిషేకించారు. పురోహితులు యేచూరి రామజోగారావుశర్మ ఆధ్వర్యంలో గంగవరపు రోహిణీ కుమార్ శ్రీసూక్త, పురుష సూక్త సహిత అభిషేకాలు, కుంకుమార్చనలు చేశారు. అనంతరం అన్నసమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ గౌరవాధ్యక్షుడు ఎ.శ్రీనివాసరావు, అధ్యక్షులు కె.వి.నారాయణమూర్తి, సభ్యులు సత్యకృష్ణ, శ్రీను, సుందరరావు పాల్గొన్నారు.

డాక్టర్ అబ్దుల్‌ఖాన్‌కు సిల్వర్ జూబ్లీ ఎక్సలెన్స్ అవార్డు

ఆరిలోవ, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) సీనియర్ ఆర్థోపెడిక్ కన్సల్టెంట్ డాక్టర్ అబ్దుల్‌ఖాన్‌కు ఇటీవల నగరంలో జరిగిన ఆర్థోపెడిక్ సర్జన్ సొసైటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్(ఓఎస్ఎస్ఏపీ) వార్షిక సదస్సులో సిల్వర్ జూబ్లీ ఎక్సలెన్స్ అవార్డు లభించింది. సదస్సులో ఉత్తమ ఒరిజనల్ రీసెర్చ్ పేపర్ సమర్పించినందుకు గాను ఆయనకు ఈ అవార్డును అందించారు. దీర్ఘకాలిక సైనోవైటిస్‌కు చీలమండ ఆర్థో స్కోపీ ఫలితాలపై రెండు సంవత్సరాల పాటు ఆయన తీవ్రంగా కృషిచేశారు. కోయంబత్తూరులోని గంగా హాస్పిటల్ చైర్మన్ డాక్టర్ రజశేఖరన్ ఆయనకు ఈ అవార్డును అందించారు. ఓఎస్ఎస్ అధ్యక్షుడు డాక్టర్ సునందకుమార్‌రెడ్డి నుంచి పతకాన్ని అందుకున్నారు.



ఇటీవల జరిగిన ఆర్థో సదస్సులో అవార్డు అందుకుంటున్న డాక్టర్ అబ్దుల్‌ఖాన్

గ్రామీణాభివృద్ధితోనే దేశ ప్రగతి సాధ్యం

» సదస్సులు నూతన విజ్ఞానాన్ని అందిస్తాయి

» ఆంధ్ర విశ్వవిద్యాలయం వీసీ ఆచార్య జి.శశిభూషణరావు

వెంకోజీపాలెం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): గ్రామీణాభివృద్ధితోనే దేశాభివృద్ధి సాధ్యమని ఏయూ వీసీ ఆచార్య జి.శశిభూషణరావు పేర్కొన్నారు. అంబేడ్కర్ అసెంబ్లీ హాల్లో సోమవారం రాజనీతి-ప్రభుత్వ పాలనా శాస్త్రం విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రెండు రోజుల జాతీయ సదస్సు రోల్ అండ్ రిలవెన్స్ ఆఫ్ ది పేదర్ బాడీస్ ఇన్ రూరల్ లోకల్ గవర్నమెంట్ జాతీయ సదస్సును ఆయన ప్రారంభించారు. ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ సోషల్ సైన్స్ రీసెర్చ్ సహకారంతో ఈ సదస్సును నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా వీసీ శశిభూషణరావు మాట్లాడుతూ సదస్సులు నూతన జ్ఞానాన్ని, శక్తిని అందిస్తాయన్నారు. మేధో చర్చలు, విలువైన సూచనలు ప్రణాళికల రూపకల్పనకు ఉపకరిస్తాయన్నారు. ఐసీఎస్ఎస్ఆర్ఎస్ఆర్‌సీ హైదరాబాద్ గౌరవ డైరెక్టర్ ప్రొఫెసర్ బి.సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ స్థానిక సంస్థలలో జవాబుదారీతనం, పారదర్శకత పెరగాలన్నారు. సోషల్ సైన్సెస్ రంగంలో పరిశోధనలు అంతర్జాతీయ ప్రమాణాలకు దీటుగా జరగాల్సిన అవసరం ఉందని చెప్పారు. జాతీయ, అంతర్జాతీయ సదస్సులు, వర్క్‌షాప్‌లు, ఎఫ్‌డీపీ నిర్వహించడానికి ఐసీఎస్ఎస్ఆర్ సహకరిస్తుదన్నారు. మేజర్, మైనర్ రీసెర్చ్ ప్రాజెక్టులకు ఏయూ నుంచి ఆచార్యులు దరఖాస్తు చేయాలని సూచించారు. సదస్సు కన్వీనర్ ఆచార్య పేటేటి ప్రమాదం వర్తమాన ప్రాధాన్యత కలిగిన అంశంపై సదస్సును నిర్వహిస్తున్నట్టు చెప్పారు. రెండు రోజుల సదస్సు నిర్వహణ, ప్రాముఖ్యత తదితర అంశాలను వివరించారు. ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.నరసింహారావు మాట్లాడుతూ ప్రతి విభాగంలో ఇలాంటి సదస్సులు నిర్వహించాలన్నారు. ఈ సందర్భంగా సదస్సు ప్రత్యేక సంచికను వీసీ ఆచార్య శశిభూషణరావు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పూర్వ రెక్టార్ ఆచార్య ఈఏ నారాయణ కీలకోపన్యాసం చేశారు. రీజనల్ ఎంప్లాయిమెంట్ అధికారి టి.అనిల్‌కుమార్, మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ డైరెక్టరేట్ ఆఫ్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ ఆచార్యులు ఎస్.ఆర్.సుభాని ప్రసంగించారు. పరిశోధకులు, నిపుణులు పరిశోధన పత్రాలను సమర్పించారు. సదస్సు కో డైరెక్టర్ టి.నాగరాజు, అధ్యాపకులు డాక్టర్ జి.వీర్రాజు, డాక్టర్ వి.హరీష్, డాక్టర్ షేక్ సులేమాన్, డాక్టర్ కె.దేముడు, డాక్టర్ కె.సత్యనారాయణ, డాక్టర్ కె.రత్నరాజు, డాక్టర్ ప్రసాద్ పాల్గొన్నారు.



సావనీర్‌ను విడుదల చేస్తున్న వీసీ ఆచార్య శశిభూషణరావు, అధికారులు

రహదారిపైనే వాహనాల మరమ్మతులు!



మాధవధార 48ఎ బస్ రూట్‌లో దారి ఆక్రమించిన వాహనాలు

మాధవధార, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): మాధవధార వుడాకాలనీ మెయిన్ రోడ్డులో నిత్యం వాహనాలు ఆగిపోతున్నాయి. రోడ్లను ఆక్రమించి వాహనాలను నీటితో శుభ్రం చేస్తూ కొందరు వ్యాపారం చేసుకుంటుంటే, రాకపోకలకు వెళ్లే దారి లేక వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాలల ఎదుటనే ఉన్న ఈ కార్ వాషింగ్ స్టేషన్‌కు పదుల సంఖ్యలో నిత్యం వస్తున్న వాహనాలను రోడ్డుకు ఇరువైపులా ఉంచి శుభ్రం చేస్తున్నారు. దీంతో పాటు పక్కనే మెకానిక్ షెడ్ కూడా ఏర్పాటు చేసి, మరమ్మతుల కోసం వచ్చే వాహనాలను అడ్డదిడ్డంగా పార్కింగ్ చేస్తున్నారు. ప్రధాన రహదారిలో 48ఎ ఆర్టీసీ బస్సులు, ప్రయాణికుల వాహనాలు, విద్యార్థులు, తల్లిదండ్రులు ఇబ్బందులు పడుతున్నారు. దీనికి తోడు మెకానిక్‌లు దురుసుగా వాహనాలు నడుపుతూ గుబులు పుట్టిస్తున్నారు. హారన్ల శబ్దం చేస్తూ, వేగంగా దూసుకొస్తున్న డ్రైవింగ్ లైసెన్సు లేని మెకానిక్‌లపై చర్యలు తీసుకోవాలని పలుమార్లు మొరపెట్టుకున్నా, చర్యలు లేవని స్థానికులు వాపోతున్నారు. ట్రాఫిక్ పోలీసులు, జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ వర్గాలు ఈ దుకాణాల నిర్వహణను కట్టడి చేయాలని కోరుతున్నారు.

ఘనంగా మాఘమాసం వేడుకలు



అలంకరణలో లీలా మాధవస్వామి

మాధవధార, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): పురాతన మాధవధార ఆలయాల పుణ్యక్షేత్రంలో మాఘ మాసం వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. ఈ నెల 7న ఆరంభమైన అయిదు రోజుల వేణుగోపాల స్వామి కల్యాణ ఉత్సవాల్లో సోమవారం సదస్యం ప్రత్యేక పూజలు చేపట్టారు. మంగళవారంతో కల్యాణ వేడుకలు పూర్తి కానున్నాయని అర్చకులు తెలిపారు. సాయంత్రం తిరువీధి ఊరేగింపు జరుగుతుందన్నారు. జనవరి 30న ప్రారంభమైన మాఘ మాసం వేడుకలు ఫిబ్రవరి 28 వరకు నిర్వహిస్తారు. నెలరోజులూ ఇక్కడి మాధవస్వామి ఆలయం, వేణుగోపాల స్వామి మందిరాల్లో ప్రత్యేక పూజాభిషేకాలు చేపడతారు. ఇక్కడి సహజసిద్ధ జలధారల్లో స్నానం ఆచరించి ఆలయాల సందర్శనకు పెద్దసంఖ్యలో ప్రజలు వస్తుంటారు. మాఘమాసంలో వచ్చే ఆదివారాల్లో మరింతగా వచ్చే జనం కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. సోమవారం నగరం సహా సుదూర ప్రాంతాల నుంచి భక్తులు లీలా మాధవస్వామి, వేణుగోపాల స్వామి వార్ల దర్శనానికి విచ్చేశారు. ముందుగా ఇక్కడి పవిత్ర జలధారల్లో స్నానం ఆచరించిన భక్తులు దేవతామూర్తుల్ని దర్శించుకున్నారు. ఈ నెల 28న మాఘ అమావాస్యతో ఉత్సవాలు ముగియనున్నాయి.



మాధవధార జలధారల వద్ద భక్తుల పుణ్యస్నానాలు

కాంస్య పతక విజేత సతీష్‌కుమార్‌కు సత్కారం

డాబాగార్డెన్స్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): న్యూఢిల్లీలో ఇటీవల జరిగిన 4వ ఓపెన్ ఇండియా ఇంటర్నేషనల్ కిక్ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో నగరానికి చెందిన వాసుపల్లి సతీష్‌కుమార్ కాంస్య పతకాన్ని సాధించి సత్తాచాటారు. సోమవారం డాబాగార్డెన్స్ వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఫౌండేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ కిక్ బాక్సింగ్ లీగ్ ప్రెసిడెంట్ ఆధ్వర్యంలో టెంకి దుర్గ సమక్షంలో సతీష్‌ను సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా సతీష్‌కుమార్ మాట్లాడుతూ కాంస్య పతకాన్ని సాధించేందుకు ఎంతో కృషి చేశానన్నారు. ఈ కార్యక్రమంలో క్రీడా సంఘాల ప్రతినిధులు జి.వి.రామచంద్రరావు, ఆనంద్‌బాలు, ఎం.నారాయణరావు పాల్గొన్నారు.

మెరిసిన క్రీడారత్నాలు

కొమ్మాది, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో మధురవాడ ఆనంద్ తైక్వాండో క్లబ్ విద్యార్థులు ప్రతిభ కనబరచి 6 బంగారు, 4 కాంస్య, 4 రజత పతకాలు సాధించినట్లు కోచ్ ఆనంద్ సోమవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. జనవరి 31 నుంచి ఫిబ్రవరి 2 వరకు కాకినాడలో జరిగిన ఎన్.టి.ఆర్ మెమోరియల్ పోటీల్లో ఈ ఘనత సాధించారని తెలిపారు. విజేతలకు తైక్వాండో గ్రాండ్ మాస్టర్ కె.వి.బాబూరావు ప్రశంసాపత్రాలు అందించారు.

ఉక్కులో 16 మంది ఉన్నతాధికారులకు షోకాజ్ నోటీసులు

... 5వ పేజీ తరువాయి

తయారు చేసుకుంటుంది. కానీ ఇక్కడ ఎమర్జెన్సీ పేరుతో నేరుగా కోక్‌నే కొన్నారు. సరఫరా చేసిన కోక్ నుంచి నమూనాలు తీసి, వాటిని ప్రయోగశాలకు పంపించి, అక్కడ నుంచి వచ్చిన నాణ్యత నివేదిక ప్రకారం బిల్లు రూపొందించి ఆర్థిక విభాగానికి పంపుతారు. అయితే ఈ కేసులో ఐసీపీపీఎల్ నమూనాలు సకాలంలో సమర్పించలేదు. ఆ తరువాత పంపిన వాటిలో నాణ్యత తక్కువగా ఉండడంతో మరోసారి నమూనాలు కోరారు. ఈ ప్రక్రియ నడుస్తుండగా ఢిల్లీ నుంచి ఉక్కు మంత్రిత్వ శాఖ అధికారులు...ముడి పదార్థాల సరఫరాదారులకు ఎంత బకాయిలు ఉన్నాయో నివేదిక ఇవ్వాలని ఇక్కడి అధికారులను కోరారు. అప్పటికి ఐసీపీపీఎల్ నమూనాలు ఇవ్వకపోవడం వల్ల బిల్లు జనరేట్ కాలేదు. దాంతో ఢిల్లీకి పంపిన నివేదికలో ఆ సంస్థకు ఇవ్వాల్సిన రూ.220 కోట్లు బకాయిగా చూపించలేదు. ఆ తరువాత వచ్చిన నమూనాలు, నాణ్యత నివేదిక ప్రకారం ఆ సంస్థకు ఇవ్వాల్సిన మొత్తం చెల్లించేశారు. అయితే తాము బకాయిల వివరాలు పంపాల్సిందిగా కోరితే...ఆ రూ.220 కోట్ల బిల్లు విషయం ప్రస్తావించలేదంటూ ఢిల్లీ అధికారులు విజిలెన్స్‌కు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో రా మెటీరియల్ డిపార్ట్‌మెంట్, మెటీరియల్ మేనేజ్‌మెంట్, క్వాలిటీ అండ్ ఎనాలసిస్ లేబరేటరీ, ఫైనాన్స్ విభాగాల్లో పనిచేస్తున్న 16 మందికి షోకాజ్ నోటీసులు అందాయి. వీరిలో సీనియర్ మేనేజర్ నుంచి జనరల్ మేనేజర్ స్థాయి వరకు అధికారులు ఉన్నారు. వీరిలో ఎనిమిది మందికి నెహ్రూ అవార్డులు కూడా వచ్చాయి. ఏ తప్పు చేయకపోయినా షోకాజ్‌లు ఇచ్చారని, కొద్దికాలంలో పదవీ విరమణ చేసే వారిని ఇలా ఇబ్బంది పెట్టడం ఏమిటని ఉద్యోగ వర్గాలు ఆవేదన వ్యక్తంచేస్తున్నాయి. తక్షణమే ఉపసంహరించుకోకుంటే ఉద్యోగ వర్గాల్లో అశాంతి రేగుతుందని హెచ్చరిస్తున్నాయి.

'దివ్యసాయి ప్రతిభ మాకు గర్వకారణం'



దివ్యసాయితో కేకు కోయిస్తున్న మర్రిపాలెం రైల్వే క్వార్టర్స్ యువకులు

మర్రిపాలెం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాఖండ్‌లో జరిగిన జాతీయ క్రీడల్లో బీచ్ వాలీబాల్ పోటీల్లో స్వర్ణ పతకం సాధించిన జట్టులో సభ్యుడైన మర్రిపాలెంకు చెందిన దివ్యసాయిని వాలీబాల్ ఆటగాళ్లు సోమవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మర్రిపాలెం రైల్వే క్వార్టర్స్ వద్ద కేకు కోసి అనంతరం దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. స్థానికుడైన దివ్యసాయి జాతీయ స్థాయి జట్టులో స్థానం సంపాదించడం, ఇప్పుడు స్వర్ణ పతకం సాధించడం తమకు గర్వకారణమని సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో చైతన్య, రాజేష్, అప్పారావు, మరికొందరు యువకులు పాల్గొన్నారు.

క్రీడా భారతి సమావేశంలో పలు తీర్మానాలు

విశాఖపట్నం స్పోర్ట్సు, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): క్రీడా భారతి ఆధ్వర్యంలో సోమవారం జరిగిన సమావేశంలో పలు తీర్మానాలు చేశామని అధ్యక్షుడు ఎం.వి.మాణిక్యాలు తెలిపారు. నగరంలో జరిగిన ఈ సమావేశంలో కృష్ణా, గోదావరి, ఉత్తరాంధ్ర జిల్లాల ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారని పేర్కొన్నారు. వచ్చే రెండు నెలల్లో చేపట్టాల్సిన కార్యక్రమాలతో చర్చించామన్నారు. క్రీడాభారతి వ్యవస్థాపక దినోత్సవంలో భాగంగా వివిధ జిల్లాల్లో శారీరక క్రీడా పోటీలు నిర్వహించడం, జాతీయ క్రీడా దినోత్సవం, క్రీడ జ్ఞాన పరిరక్షణ వంటి కార్యక్రమాలతోపాటు హనుమాన్ జయంతి, క్రీడాభారతిలో సభ్యత్వ నమోదు, అన్ని జిల్లాల్లో కమిటీలను బలోపేతం చేయడం వంటి అంశాలపై తీర్మానాలు చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మన్యాల (ఫారెస్ట్ రేంజర్) ఇన్‌చార్జి రామ్‌నరేష్, పి.వి.నారాయణరావు పాల్గొన్నారు.

నేడు ఘంటసాల గానసుధ

అక్కయ్యపాలెం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 42వ వార్డు రైల్వే ఎగ్జిబిషన్ మైదానం ఎదురుగా ఉన్న షిర్డీ సాయి ధ్యానమందిరం ఆవరణలో ప్రముఖ నేపథ్య గాయకుడు ఘంటసాల వేంకటేశ్వర రావు వర్ధంతి కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించనున్నట్లు ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు నూకల శేషగిరిరావు తెలిపారు. ఆలయ ఆవరణలో సోమవారం కరపత్రాలను ఆవిష్కరించారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు గానసుధ గల్లా చిట్టిబాబు బృందంతో మధుర భక్తి గీతాలాపన ఉంటుందని చెప్పారు.

ఇంటింటా దివ్యాంగుల గుర్తింపు సర్వే ప్రారంభం



గుర్తింపు సర్వే చేపట్టేందుకు ర్యాలీగా వెళ్తున్న సిబ్బంది

మహారాణిపేట, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి దివ్యాంగులను గుర్తించేందుకు సర్వే నిర్వహించారు. మహారాణిపేటలోని దండుబజారు ప్రాంతంలో సోమవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఇంటింటికీ వెళ్లి దివ్యాంగుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ నెల 24 వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు సంస్థ కార్యదర్శి ఎం.వెంకట శేషమ్మ తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు, కేజీహెచ్ పిల్లల వైద్యులు, న్యాయవాదులు సిబ్బంది పాల్గొన్నారు.

నులిపురుగులు ఉంటే పిల్లల్లో రక్తహీనత

అల్లిపురం/డాబాగార్డెన్స్, ఫిబ్రవరి10 (ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రతతోనే నులిపురుగుల నివారణ సాధ్యమని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం అన్నారు. నులిపురుగుల వల్ల పిల్లల్లో రక్తహీనత, వ్యాధి నిరోధక శక్తి తగ్గడం వంటివి కనిపిస్తాయని, వీటిని నిర్మూలిస్తే ఏకాగ్రత, జ్ఞాపకశక్తి పెరుగుతాయని అన్నారు. జాతీయ నులిపురుగుల నివారణ దినం సందర్భంగా జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సోమవారం అల్లిపురం మున్సిపాల్ ఎలిమెంటరీ పాఠశాల ప్రాంగణంలోని అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు నులిపురుగుల నివారణ మాత్రలు వేశారు. కొబ్బరితోట హెల్త్ సెంటర్ వైద్యాధికారిణి పర్వీనా, శ్రీలత, కె.కనక మహాలక్ష్మి, ఆశా, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు. డాబాగార్డెన్స్‌లోని జీవీఎంసీ ఆర్‌బీఎంయూపీ పాఠశాలలో ఒకటి నుంచి ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేశారు. పిల్లలను ఫాస్ట్‌ఫుడ్‌కు, నిల్వ ఆహార పదార్థాలకు దూరంగా ఉంచాలని ప్రధానోపాధ్యాయుడు ప్రభాకర్ తల్లిదండ్రులకు సూచించారు. ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.



చిన్నారులకు మాత్రలు వేస్తున్న గొండు సీతారాం

మార్చి 4, 5 తేదీల్లో ఉచితంగా కృత్రిమ చేతుల అమరిక



ఉచిత శిబిరం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న బాలసతీష్, అల్తాఫ్ బాబ్జాన్, లావణ్య తదితరులు

డాబాగార్డెన్స్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): చేతులు లేని నిరుపేదలకు ఉచితంగా కృత్రిమ చేతులను అందించేందుకు విశాఖలో మార్చి 4, 5 తేదీల్లో ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేస్తున్నట్టు కో-ఆర్డినేటర్ సి.బాలసతీష్ తెలిపారు. సోమవారం డాబాగార్డెన్స్ వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శారీరక వైకల్యంతో బాధపడేవారు సాధారణ జీవితాన్ని గడిపేందుకు సహాయపడటమే తమ లక్ష్యమన్నారు. ఆధునిక సాంకేతికతతో రూపొందించిన కృత్రిమ చేతులను ఉచితంగా అమరుస్తామన్నారు. రోటరీ క్లబ్ విశాఖపట్నం సెంట్రల్ అధ్యక్షురాలు ఎస్.లావణ్య మాట్లాడుతూ ఈ శిబిరం ద్వారా అనేక మందికి ప్రయోజనం చేకూరుతుందన్నారు. ప్రాజెక్టు చైర్మన్ అల్తాఫ్ బాబ్జాన్ మాట్లాడుతూ రోటరీ క్లబ్, విశాఖ నైట్స్ రౌండ్ టేబుల్ 225, సింధీ పంచాయతీ సంస్థలు సంయుక్తంగా పనిచేస్తున్నాయన్నారు. కో చైర్మన్ మనోహర్ నాగపాల్ మాట్లాడుతూ శిబిరానికి రావాలనుకున్నవారు రిజిస్ట్రేషన్ కోసం ఫోన్ 96529 86007, 77951 37999లను సంప్రదించాలని కోరారు.

పది వేల పెన్నులతో ఎర్నిమాంబకు అర్చన



అమ్మవారి ముందు అర్చనకు వినియోగించిన పెన్నులు

జ్ఞానాపురం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): రానున్న పోటీ పరీక్షలు, 10వ తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థినీ, విద్యార్థులు ఉన్నత శ్రేణిలో ఉత్తీర్ణత కావాలని ఆకాంక్షిస్తూ సోమవారం జ్ఞానాపురంలోని ఎర్నిమాంబ అమ్మవారికి పదివేల పెన్నులతో అర్చన, విశేష కుంకుమార్చన నిర్వహించారు. అనంతరం అర్చన చేసిన పెన్నులను విద్యార్థులకు అందజేశారు.

వైభవంగా నీలమాంబ అమ్మవారి పరస

పూర్ణామార్కెట్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): వన్‌టౌన్ రంగిరీజు వీధిలో వెలసిన నీలమాంబ అమ్మవారి దర్శనానికి భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. సోమవారం అమ్మవారి 46వ పరస మహోత్సవాలను పురస్కరించుకొని పూర్ణామార్కెట్ మెయిన్ రోడ్డు నుంచి ఏవీఎన్ కాలేజీ డౌన్ వరకు పరిసరాలన్నీ రంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. రంగిరీజు వీధి, ఏవీఎన్ కాలేజీ డౌన్ ఏరియాలో సాయంత్రం నుంచి అమ్మవారి జాతర ఘనంగా నిర్వహించారు. పరిసర ప్రాంతాల నుంచి జనం తరలివచ్చారు. పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశం



తాము సత్కరించిన అప్పటి ప్రధానోపాధ్యాయుడితో పూర్వ విద్యార్థుల బృంద చిత్రం

జ్ఞానాపురం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): నగరంలోని కె.కాలనీ జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో 2000-01లో పదో తరగతి చదివిన విద్యార్థులు పాఠశాలను వీడి 25 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా సోమవారం స్థానికంగా ఓ హోటల్‌లో ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేసి కలుసుకున్నారు. అలనాటి జ్ఞాపకాలు, అనుభవాలను చిన్ననాటి స్నేహితులతో పంచుకున్నారు. అప్పటి ప్రధానోపాధ్యాయుడు శాస్త్రిని ఘనంగా సత్కరించి, ఆయన ఆశీర్వాదం తీసుకున్నారు. అప్పటి విద్యార్థుల్లో ఉన్నత స్థానాలు పొందిన వారిని తోటి స్నేహితులు సత్కరించారు. అనంతరం ఆటపాటలతో సందడి చేశారు. అందరినీ కలిపేందుకు కృషి చేసిన బుద్ద గణేష్, మజ్జి నూకరాజు, బుద్ద తులసి, పి.బాలకృష్ణ, ఎ.వీణా, బి.ప్రసన్న, రేణుక, సుజాత, డి.వరలక్ష్మిలను స్నేహితులందరూ అభినందించారు.

ఈ నెల రేషన్‌లో కందిపప్పు కట్!

మురళీనగర్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): రేషను పంపిణీలో ఈ నెల కందిపప్పు కరువైంది. కేవలం బియ్యం, అరకిలో పంచదార మాత్రమే కార్డుదారులకు అందిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న డిపోల్లో ఈ నెల ఎక్కడా కందిపప్పు సరఫరా లేదని సివిల్ సప్లయిస్ అధికారులు తెలిపారు. దీంతో అధిక ధరలతో అల్లాడుతున్న ప్రజానీకానికి ఈ ఫిబ్రవరి నెల బయట బహిరంగ మార్కెట్‌లో కొనుగోలు చేయక తప్పడం లేదు. ప్రతి నెలా కందిపప్పు రాయితీ ధరపై దాదాపు 70 రూపాయలకే అందిస్తున్నారు. ఈ నెల ఎలాంటి ముందస్తు సూచనలు లేకుండా సరఫరా ఆపేయడంతో పేదలు ఇబ్బందులు పడుతున్నారు. కంచరపాలెం సర్కిల్ 1 పౌరసరఫరాల శాఖ ఏఎస్‌ఓ కార్యాలయ పరిధిలో మురళీనగర్, మాధవధార ప్రాంతాల్లో ఉన్న 12 డిపోల్లో ఇదే విధంగా ఈ నెలకు సరఫరా చేపడుతున్నారు. ఈ మేరకు ఎండీయూ వాహనాలను వీధుల్లో నిలిపి రేషను కార్డుదారులకు కేవలం బియ్యం (ఇంట్లో ఒక్కో సభ్యునికి 5 కిలోల చొప్పున), పంచదార అర కిలో చొప్పున డీలర్ల నుంచి పంపిణీ చేస్తున్నారు.

కరాటే టోర్నీలో నగర క్రీడాకారులకు స్వర్ణ పతకాలు



జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలతో క్రీడాకారులు

విశాఖపట్నం స్పోర్ట్సు, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్ టోర్నీలో నగరానికి చెందిన జపాన్ కరాటే అసోసియేషన్ ఆఫ్ ఇండియా క్రీడాకారులు స్వర్ణ, రజత, కాంస్య పతకాలు కైవసం చేసుకున్నారు. జేకేఏఐ ఏపీ చీఫ్ కోచ్ మోహన్ వంశీ వద్ద శిక్షణ పొందుతున్న ఆరుగురు క్రీడాకారులు అద్భుతమైన ప్రతిభ చూపి పతకాలు సొంతం చేసుకున్నారు. కటాస్ స్టైల్ ఈవెంట్ బాలికల విభాగంలో కె.మేఘన, ఎం.నిఖిలశ్రీ, ఎస్.సంజన, ఆర్.శాన్వి, బాలుర విభాగంలో ప్రియాన్షు రౌట్, బి.త్రిలోకేష్ బంగారు పతకాలు సాధించారు. కుమిటి ఈవెంట్ బాలికల విభాగంలో ఎం.నిఖిలశ్రీ రజతం, ఎస్.సంజన కాంస్య పతకం సాధించగా, బాలుర విభాగంలో ప్రియాన్షు రౌట్ రజతం, బి.త్రిలోకేష్ కాంస్య పతకం దక్కించుకున్నారు. ఈ సందర్భంగా చీఫ్ కోచ్ షిహన్ ఆనందరత్న, సుదర్శన్, సీనియర్ కోచ్ ఆర్.బాలరాజు, మహిళా కోచ్ కృష్ణవేణి క్రీడాకారులను అభినందించారు.

కొండలపై భూమి నూరుశాతం వినియోగం

... 5వ పేజీ తరువాయి

మెటామైండ్, సిఫీ, జెనోసాఫ్ట్)కు ఎకరా నుంచి తొమ్మిది ఎకరాల వరకు కేటాయించారు. ఈ కొండపైనే స్టార్టప్ విలేజ్, మిలీనియం టవర్-1, టవర్-2లు ఉన్నాయి. ఈ కొండపై ప్రైవేటు కంపెనీల్లో నాలుగు వేల మంది వరకు పనిచేస్తున్నారు.

- హిల్ నంబరు 4 మొత్తం 276.77 ఎకరాలు అదానీ డేటా సెంటర్‌కు కేటాయించారు.
- కాపులుప్పాడలో గతంలో లోకేశ్ ఐటీ మంత్రిగా పనిచేసినప్పుడే 170 ఎకరాల్లో లేఅవుట్ వేశారు. ఇప్పటికీ ఎవరికీ కేటాయించలేదు.

...ఇవి కాకుండా మంగమారిపేటలో చినజీయరు స్వామికి, వైసీపీ ప్రభుత్వం భీమిలి సమీపాన శారదా పీఠానికి భూములు కేటాయించాయి. వీటికి ప్రభుత్వం ఎటువంటి మార్గదర్శకాలు ఇవ్వలేదు. రహదారి ఎక్కడి నుంచి వేయాలి?, భూమిని ఎలా ఉపయోగించాలనే దానిపై స్పష్టత లేదు. వీటిపై కూడా ప్రస్తుత ప్రభుత్వం దృష్టిపెట్టింది.

పాలసీలో మంచి రాయితీలు

కూటమి ప్రభుత్వం కొత్త ఐటీ పాలసీలో ఐటీ కంపెనీలకు రాయితీలు ప్రకటించింది. గతంలో నిర్దేశించిన విస్తీర్ణం కంటే ఎక్కువ నిర్మిస్తే చదరపు అడుగుకు రూ.2 వేలు రాయితీ వస్తుంది. ఇది పూర్తిగా ఆర్థిక మండలి. అయినా సరే ఉద్యోగులకు ఇళ్లు, వ్యాపార కార్యకలాపాలకు కమర్షియల్ కాంప్లెక్స్‌ల నిర్మాణానికి అనుమతి ఇస్తామని చెప్పింది. అయితే వాటికి రాయితీలు ఉండవు. ఎకరాల కొద్దీ భూమిని తీసుకున్నవారు ఇంకా రెట్టింపు సంఖ్యలో ఉద్యోగులకు అవకాశం కల్పించాలనేదే ప్రభుత్వ ధ్యేయం.

- ఓ.నరేశ్‌కుమార్, ఉపాధ్యక్షులు రుషికొండ ఐటీ పార్క్ అసోసియేషన్

మహా నిర్లిప్తత!

... 5వ పేజీ తరువాయి

అందజేస్తుంటారు. వీటిపై తగు చర్యలు తీసుకోవాలంటూ సంబంధిత అధికారులకు కమిషనర్‌ను సూచిస్తారు. అయితే గత 20 రోజులుగా పూర్తిస్థాయిలో కమిషనర్ లేకపోవడంతో అన్నీ నిలిచిపోయాయి. దీనివల్ల అధికారుల్లో కూడా నిర్లిప్తత పెరిగిపోయింది. విధులను తూతూమంత్రంగా నిర్వర్తిస్తున్నారు. మొక్కుబడిగా కార్యాలయానికి వచ్చి వెళ్లిపోతున్నారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో కింది స్థాయి సిబ్బందిలో కూడా నిర్లక్ష్యం పెరిగిపోతోంది.

మరోవైపు వేసవి సీజన్ ప్రారంభం అవుతుండడంతో తాగునీటి సరఫరాలో ఇబ్బందులు మొదలవుతున్నాయి. జోన్-6 పరిధిలో కొండవాలు ప్రాంతాలకు నీటి సరఫరాలో అవాంతరాలు ఏర్పడుతున్నాయి. వేసవి ప్రభావం పెరిగేకొద్దీ నీటిసమస్యలు కూడా పెరుగుతాయి. పూర్తిస్థాయి కమిషనర్ ఉంటే ఇప్పటికే వేసవి యాక్షన్ ప్లాన్‌ను తయారుచేసి, అందుకోసం అవసరమయ్యే నిధులను కేటాయించేందుకు అవకాశం ఉండేది. అంతేకాకుండా 2025-26 ఆర్థిక సంవత్సరానికి జీవీఎంసీ బడ్జెట్‌ను స్టాండింగ్ కమిటీ ఆమోదించింది. కౌన్సిల్ ఆమోదించాల్సిన తరుణంలో కమిషనర్ సంపత్‌కుమార్‌కు బదిలీ అయ్యింది. ఇప్పుడు ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో బడ్జెట్ సమావేశం నిర్వహణకు ఎన్నికల కమిషన్ ప్రత్యేక అనుమతి పొందాల్సిన అవసరం ఏర్పడింది. పూర్తిస్థాయి కమిషనర్ ఉంటేనే గానీ దీనికోసం లేఖ రాసే పరిస్థితి కనిపించడం లేదు. నగర ప్రాముఖ్యత దృష్ట్యా రాష్ట్ర ప్రభుత్వం వీలైనంత త్వరగా కమిషనర్‌ను నియమించాల్సి ఉంది.

పూర్ణామార్కెట్ ప్రాంతంలో ఆక్రమణల తొలగింపు

... 5వ పేజీ తరువాయి

అవుతున్నందుకు జరిమానా విధిస్తామని హెచ్చరించారు. వారి చేతనే ఆయా దుకాణాల వద్ద పేరుకుపోయిన వ్యర్థాలను తొలగింపజేశారు. మధ్యాహ్నం మూడు గంటలకల్లా మెయిన్‌రోడ్డులో ఆక్రమణలను పూర్తిగా తొలగించారు. అనంతరం దుర్గాలమ్మగుడి జంక్షన్ నుంచి అగ్నిమాపక శాఖ కార్యాలయం వరకూ బస్టాపుల్లో ఉన్న దుకాణాలను తొలగించారు. అనంతరం పూర్ణామార్కెట్‌లో వాహనాల పార్కింగ్‌కు వసూలు చేసే ఫీజు వివరాలు ప్రజలకు తెలిసేలా ఎక్కడికక్కడ బోర్డులను ఏర్పాటుచేశారు. ప్రధాన రహదారిలో ఆక్రమణలను తొలగించడంతోపాటు పార్కింగ్ ఫీజుల దందాకు అడ్డుకట్ట వేయడంపై కొనుగోలుదారులు, వ్యాపారులు ఆనందం వ్యక్తంచేశారు. పోలీస్, జీవీఎంసీ అధికారుల వద్దకు వెళ్లి అభినందించారు.

జాడలేని చిరుతలు

... 5వ పేజీ తరువాయి

చుట్టూ ఉన్న రహదారులపై నిరంతరం వాహనాలు తిరగడంతో చిరుతల జీవనానికి అనువైన వాతావరణం కరవైంది.

గడచిన ఐదారు సంవత్సరాల నుంచి కంబాలకొండ, పరిసరాల్లో చిరుతలు సంచరించినట్టు పాద ముద్రలు (పగ్ మార్క్స్) కనిపించలేదని సిబ్బంది చెబుతున్నారు. కొన్నిచోట్ల ఏర్పాటుచేసిన ట్రాప్ కెమెరాల్లో కూడా చిరుతల ఆనవాళ్లు లభించలేదు. ఇటీవల కాలంలో చిరుతల గాండ్రింపు శబ్దం వినిపించలేదంటున్నారు. సుమారు నాలుగేళ్ల క్రితం చేపట్టిన జంతువుల సర్వేలో చిరుతల సంఖ్య ప్రస్తావించలేదు. కంబాలకొండ పరిసరాల్లో ప్రస్తుతం వందల సంఖ్యలో జింకలు, కొండ గొర్రెలు, మేకలు ఉన్నాయి. జింకలు భారీగా పెరగడానికి చిరుతలు లేకపోవడమే కారణమని అంటున్నారు.

వాహన శబ్దాలు, జనావాసాలు పెరగడం, తదితర కారణాలతో చిరుతలు మరో ప్రాంతానికి వలసపోయి ఉంటాయని అటవీ శాఖ సిబ్బంది అనుమానిస్తున్నారు. చిరుతలు ఉంటే...ఏదో ఒక సమయంలో వాటి ఉనికి తెలిసేదని, అనేక కారణాలతో బహుశా వలస పోవడం లేదా అంతరించిపోయి ఉండవచ్చునని చెబుతున్నారు. ఇదిలావుండగా విశాఖ పరిసరాల్లో తూర్పు కనుముల్లోని చిరుతలు ఎంతో అందమైనవని, ప్రపంచంలో ఆఫ్రికా అడవుల్లో తప్ప మరెక్కడా ఇటువంటి జంతువులు లేవని ఏయూ జంతుశాస్త్రం విభాగం రిటైర్డు ఆచార్యుడు డీఈ బాబు అన్నారు.

గాజువాకలో ఇనాం భూముల క్రమబద్ధీరణకు గ్రీన్‌సిగ్నల్

... 5వ పేజీ తరువాయి

101 నుంచి 200 వరకూ రూ.100, 201 నుంచి 400 వరకూ రూ.240, 401 నుంచి వెయ్యి గజాల వరకూ గజానికి రూ.రెండు వేలు చెల్లించాలి. రెండేళ్ల తరువాత సాధారణ రిజిస్ట్రేషన్ ఫీజు తీసుకుని నివాసాలు, వాణిజ్య భవనాలను రిజిస్టర్ చేస్తారు.

ఆక్రమణదారులు తమ దరఖాస్తులను మీ-సేవా కేంద్రాల్లో అందజేయాలి. స్థలం కొనుగోలు చేసిన వ్యక్తులతో జరిపిన లావాదేవీలకు సంబంధించి రిజిస్ట్రేషన్ డాక్యుమెంటు, ఇంటి పన్ను, నీటి పన్ను రశీదులు, కరెంటు బిల్లు, ఇంకా ఆక్రమణలు ధ్రువీకరించే ఆధారాలతో కూడిన డాక్యుమెంట్లను దరఖాస్తుతో పాటు ఈ ఏడాది డిసెంబరు 31లోగా సమర్పించాలి. దరఖాస్తులను రెవెన్యూ, జీవీఎంసీ అధికారులతో కూడిన కమిటీ పరిశీలిస్తుంది. ఆమోదం తెలిపిన తేదీ నుంచి ఏడాదిలోపు నాలుగు వాయిదాల్లో చలానా ద్వారా ఫీజు చెల్లించాలి. అప్పుడే తహసీల్దారు సదరు ఆక్రమణదారుడికి కన్వేయన్స్ డీడ్ జారీచేస్తారు. ఇదే సమయంలో 101 గజాల దాటిన ఆక్రమణదారులు స్టాంపు డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. ఆక్రమణలో ఉన్న ఖాళీ స్థలాలను క్రమబద్ధీకరించరు. ఒక్క నిర్మాణాలకు మాత్రమే తాజా ఉత్తర్వులు వర్తిస్తాయి.

మూట్ కోర్టు పోటీల పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వీసీ

వెంకోజీపాలెం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): జాతీయ మూట్ కోర్టు పోటీలు 2025 పోస్టర్‌ను సోమవారం ఏయూ వీసీ ఆచార్య జి.శశిభూషణరావు, రెక్టార్ ఆచార్య ఎన్.కిషోర్‌బాబు, రిజిస్ట్రార్ ఆచార్య ఈఎన్ ధనుంజయరావుల ఆవిష్కరించారు. మార్చి 21 నుంచి 23 వరకు అంబేడ్కర్ న్యాయ కళాశాలలో పోటీలను నిర్వహించనున్నారు. న్యాయ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.సీతామాణిక్యం, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎంవీఆర్ రాజు, ఐఏఎస్ఈ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డి.నాగరాజకుమారి, డాక్టర్ ఎల్.వి.కే.ప్రసాద్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా నిత్యానంద త్రయోదశి ఉత్సవాలు



పూజలందుకుంటున్న నిత్యానంద

ఎంవీపీ కాలనీ, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక టీటీడీ కల్యాణ మండపంలో సోమవారం సాయంత్రం నిత్యానంద త్రయోదశి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. నిత్యానంద భగవంతుని దివ్య ఆవిర్భావదినోత్సవం సందర్భంగా హరే కృష్ణ మూవ్‌మెంట్ భక్తులు స్వామి వారికి గంగా, యమున, గోదావరి, సరస్వతి, నర్మద, సింధు, కావేరి వంటి సప్త నదీ జలాలు, పండ్ల రసాలు, పూలు, 108 కలశాలతో మహాభిషేకం నిర్వహించారు. 58 రకాల పిండి వంటలను నివేదించిన అనంతరం మహా ప్రసాద వితరణ చేశారు. హరేకృష్ణ మూవ్‌మెంట్ అధ్యక్షులునిష్కించిన భక్తదాస నిత్యానంద ప్రభు ప్రాముఖ్యతను తెలియజేశారు.

రైల్వేస్టేషన్‌లో గంజాయి పట్టివేత

విశాఖపట్నం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): రైల్లో గంజాయి రవాణా చేస్తున్న వ్యక్తులను పట్టుకుని కేసులు నమోదు చేశామని పోలీసులు తెలిపారు. జీఆర్పీ ఎస్ఐ కేటీఆర్ లక్ష్మి, ఆర్పీఎఫ్ ఎస్ఐ మిశ్రీ తనిఖీ చేస్తుండగా ఒడిశాకు చెందిన మిట్టుఖేముండ్, బసంత ఖేముండ్, నీలకంట బండ వద్ద 18 కిలోల గంజాయి బ్యాగ్‌లు లభించాయన్నారు. జీఆర్పీ ఎస్ఐ కె.శాంతారామ్, ఆర్పీఎఫ్ ఎస్ఐ ఎస్‌కె.బారిక్ తనిఖీల్లో ఉత్తరాఖండ్‌కు చెందిన మోహన్‌సింగ్ వద్ద ఏడు కిలోల గంజాయి లభించిందన్నారు. నిందితులు నలుగురిపై కేసులు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచామన్నారు.

సినిమా గైడ్

- **తండేల్:** జగదాంబ, సంగం, కామేశ్వరి, శ్రీరామ, శ్రీవెంకటేశ్వర, శ్రీలీలామహల్, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), మోహిని (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ),
- **భవానీ వార్డ్:** జగదాంబ, రమాదేవి
- **మదగజరాజ:** జగదాంబ, వెంకటేశ్వర-1, సౌజన్య (గోపాలపట్నం), శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా),
- **సంక్రాంతికి వస్తున్నాం:** శారద, మెలోడి, జగదాంబ, కిన్నెర, కాంతి, శ్రీలక్ష్మీనరసింహ-1,2 (104 ఏరియా), శ్రీనరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), తాతా, రాములమ్మ (తగరపువలస)
- **డాకు మహారాజ్:** శరత్, శ్రీకన్య, కిన్నెర, సుకన్య, మోహిని కాంప్లెక్స్, శ్రీకన్య హెవెన్ (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), గణేష్, సప్తగిరి (తగరపువలస)
- **గేమ్ ఛేంజర్:** మెలోడి, సంగం, కామేశ్వరి, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), కన్యకాంప్లెక్స్, మోహిని కాంప్లెక్స్ (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-2 (పెందుర్తి) రాములమ్మ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 32, టమాటా 12, వంకాయలు (తెలుపు) 16, వంకాయలు (నలుపు) 18, బెండకాయలు 40, పచ్చిమిర్చి 32, కాకరకాయలు 40, బీరకాయలు 46, ఆనపకాయ12, కాలీఫ్లవర్ 12, క్యాబేజి 12, క్యారెట్ 26 దొండకాయలు 32, బంగాళదుంపలు 16, అరటికాయ 7, మునక్కాడలు (కిలో) 80, అల్లం 40, బరబాటి 30, ముల్లంగి 20, నిమ్మకాయలు (కిలో) 62, బద్దచిక్కుడు 26, దోసకాయలు 22, వెల్లుల్లి 170, కొబ్బరికాయ 25, బీన్స్ (పెన్సిల్) 40, కీరదోస 26, కాప్సికమ్ 40, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 36 చిలగడదుంపలు 38, కంద 68, దేముడుచిక్కుడు 28, గోరుచిక్కుడు 28, కూర పెండలం 26, బ్రకోలి 55, నూల్‌కోల్ 30, పనసపొట్టు 200, కొండఉసిరి 70, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్దకట్ట) 25, పుదీన (కట్ట) 4, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 120, బూడిదగుమ్మడికాయ 30, కర్రపెండలం 20, మామిడి అల్లం 46, బొప్పాయి 38, జామకాయలు (కిలో) 60.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)	
విశాఖపట్నం	465
విజయనగరం	469
శ్రీకాకుళం	469

చికెన్ ధరలు బ్రాయిలర్	
రైతు ధర	93
లైవ్ ధర	113
విత్ స్కిన్	196
స్కిన్‌లెస్	206

అడుగడుగునా ఆక్రమణలు

- పట్టించుకోని జీవీఎంసీ పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు
- స్థానికుల రాకపోకలకు ఇబ్బందులు

ఆరిలోవ, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): నగరంలో ఎక్కడ స్థలం కనిపించినా ఆక్రమణలు చోటుచేసుకుంటున్నాయి. ప్రభుత్వ స్థలాలను కొంతమంది దర్జాగా కబ్జా చేస్తుండగా, మరికొంతమంది రహదారులు, ఫుట్‌పాత్‌లను ఆక్రమించి, దుకాణాలు ఏర్పాటు చేసుకుంటున్నారు. మరికొందరు ఫుట్‌పాత్‌లను వాహనాల పార్కింగ్‌గా వినియోగిస్తున్నారు. జీవీఎంసీ పదో వార్డు ఆదర్శనగర్‌లో గల సెమెన్ బ్యాంకు కూడలి సమీపంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు ఆనుకొని బడ్డీలను ఏర్పాటుచేశారు. ఇది ప్రమాదకరమని తెలిసినా అధికారులు పట్టించుకోవడం లేదు. ఎక్కడో ఓ చోట వ్యాపారానికి స్థలం దొరికిందనే ఉద్దేశంతో చిరు వ్యాపారులు ఇలా ట్రాన్స్‌ఫార్మర్లకు సమీపంలో దుకాణాలను ఏర్పాటు చేస్తున్నారు. కొన్నిసార్లు ఈ ప్రాంతంలో ట్రాన్స్‌ఫార్మర్ల నుంచి శబ్దాలు, నిప్పురవ్వలు పడుతుంటాయని స్థానికులు చెబుతున్నారు. ఇలా బడ్డీలను ఏర్పాటు చేయడం మరింత ప్రమాదకరమని అంటున్నారు. జీవీఎంసీ అధికారులు, ట్రాఫిక్ పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతోనే నిబంధనలకు విరుద్ధంగా, ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగేలా దుకాణాలు వెలుస్తున్నాయని మండిపడుతున్నారు. ఏదైనా ప్రమాదం జరగకముందే ట్రాన్స్‌ఫార్మర్ల ముందు ఏర్పాటు చేసిన దుకాణాల తొలగింపునకు అధికారులు చర్యలు తీసుకోవాలంటున్నారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఏర్పాటు చేసిన బండ్లు



ఫుట్‌పాత్‌పై పార్క్ చేసిన కార్లు

ఫుట్‌పాత్‌లపై వాహనాల పార్కింగ్

జీవీఎంసీ 12వ వార్డు పెదగదిలి శివాలయం పక్కన ఫుట్‌పాత్ ఆక్రమణకు గురయింది. దీనిని కార్లు పార్క్ చేసుకునేందుకు దర్జాగా వినియోగిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ఇక్కడ ఒక లాడ్జీ ఉంది. అక్కడకు వచ్చే వినియోగదారులు తమ వాహనాలను ఫుట్‌పాత్‌పైనే నిలిపివేస్తుండడంతో పాదచారులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీనిపై ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. సాధారణంలో లాడ్జిలు నిర్మించే సమయంలో వినియోగదారుల వాహనాలను పార్క్ చేసేందుకు ఏర్పాట్లు చేసుకోవాల్సి ఉంటుంది. అయితే ఇక్కడి లాడ్జి యాజమాన్యం ఫుట్‌పాత్‌ను పార్కింగ్ ప్రదేశంగా మార్చేసింది. కాసుల కక్కుర్తితో అధికారులు దీనిని పట్టించుకోవడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు. పార్కింగ్ లేకుండానే లాడ్జి నిర్వహణకు అనుమతులు ఇవ్వడంపైనా అనుమానాలున్నాయంటున్నారు.

కలుషిత ఆహారానికి దూరంగా ఉండాలి



విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలు వేస్తున్న ప్రిన్సిపాల్ విజయబాబు

మద్దిలపాలెం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): కలుషిత ఆహారానికి దూరంగా ఉంటే నులి పురుగుల సమస్యలు తలెతదని డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ విజయబాబు సూచించారు. కళాశాలలో సోమవారం నిర్వహించిన నులి పురుగుల దినోత్సవంలో ఆయన విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలను వేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నులి పురుగులు పేగుల నుంచి పోషకాలు గ్రహిస్తాయన్నారు. వీటి ద్వారా రక్తహీనత, పోషకాహారలోపం, వికారం, విరోచనాలు వంటి ఇబ్బందులు వస్తాయన్నారు. అల్బెండజోల్ మాత్రలు వేసుకోవడం ద్వారా నులిపురుగులను నియంత్రించవచ్చన్నారు. 19 సంవత్సరాలలోపు వయసు వారంతా ఈ మాత్రలు వేసుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులకు మాత్రలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ పి.జయ, అధ్యాపకులు పి.ఉమామహేశ్వరరావు, బి.నాగేశ్వరరావు, కె.రవిబాబు, రాజేశ్వరరావు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషిచేయండి



వర్క్‌షాప్ పాల్గొన్న ఏయూ పర్యావరణ విభాగం విశ్రాంత ఆచార్యులు రెడ్డి

మద్దిలపాలెం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణకు యువత కృషి చేయాలని ఏయూ పర్యావరణ విభాగం విశ్రాంత ఆచార్యులు ఈయూబీ రెడ్డి పిలుపునిచ్చారు. మద్దిలపాలెం భావన స్కూల్లో సోమవారం వ్యాస్ సంస్థ నిర్వహించిన క్లైమేట్ ఫర్ యూత్ యాక్షన్ వర్క్‌షాప్ ఆయన మాట్లాడారు. భూమి వేడెక్కకుండా యువత పూర్తిస్థాయిలో కృషి చేయాలన్నారు. నదులు, వాగులు, సముద్రాల లోపలికి హానికరమైన రసాయనాలు, లోహాలు, హాని కలిగించే ప్లాస్టిక్ వస్తువులు వెళ్లకుండా చూడాలన్నారు. భారత ప్రజారోగ్యసంస్థ కేంద్ర కార్యవర్గ సభ్యుడు ఎంవీవీ మురళీమోహన్ మాట్లాడుతూ విద్యుత్ వినియోగం తగ్గించకుంటే వేడి ఉండదన్నారు. పుస్తకాలు, కాగితాలు దుర్వినియోగం చేయకూడదన్నారు. చెత్తను మనమే నిర్మూలించి పర్యావరణహితంగా జీవించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఆర్‌యూ జీవీఎంసీ ప్రతినిధి దివ్య, స్కూల్ ప్రిన్సిపాల్ షణ్ముఖం, ఎకో వారియర్ జేవీ రత్నం, గ్రీన్ వలంటీర్స్ జె.రవితేజ, ఐ.కృష్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.

సీపీ కార్యాలయంలో పార్కింగ్ ప్రారంభం



టూవీలర్ పార్కింగ్‌ను ప్రారంభిస్తున్న సీపీ శంఖబ్రతబాగ్చి, అధికారులు

విశాఖపట్నం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): నగర పోలీస్ కమిషనరేట్‌లో ద్విచక్రవాహనాల పార్కింగ్ షెడ్‌ను సీపీ శంఖబ్రతబాగ్చి సోమవారం ప్రారంభించారు. సిబ్బందితోపాటు సమస్యల పరిష్కారం కోసం వచ్చేవారు తమ వాహనాలను పార్క్ చేసుకునేందుకు స్థలం లేకపోవడంతో ఇబ్బంది పడుతుండడంతో పాత స్పెషల్‌బ్రాంచి భవనం ఉన్న చోట 120 ద్విచక్రవాహనాలు నిలిపేందుకు వీలుగా షెడ్‌లను నిర్మించారు. కార్యక్రమంలో పోలీస్ ఉన్నతాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

గుండెపోటుతో జ్యూ క్యూరేటర్ కారు డ్రైవర్ మృతి

ఆరిలోవ, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): ఇందిరాగాంధీ జంతు ప్రదర్శనశాల క్యూరేటర్ కారు డ్రైవర్ రవికుమార్ ఆదివారం గుండెపోటుతో మృతి చెందినట్టు జూ క్యూరేటర్ మంగమ్మ తెలిపారు. సాయంత్రం తనను కారులో ఎండాడలోని ఇంటివద్ద దింపి, తన ఇంటికి వెళ్లిన వెంటనే కళ్లు తిరిగి పడిపోయాడన్నారు. వెంటనే గీతం వైద్యశాలకు తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడన్నారు. మృతుడికి భార్య అరుణ. ఇద్దరు కుమారులున్నారు. అరుణ జూ క్యాంటీన్‌లో పనిచేస్తోందని, రవి గత 15 ఏళ్లుగా అవుట్‌సోర్సింగ్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడన్నారు.

హ్యాకథాన్‌లో కృష్ణా కళాశాల విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల యాజమాన్య ప్రతినిధులు

మద్దిలపాలెం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): సిద్ధార్థ అకాడమీ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ మెడికల్ అండ్ ఇంజనీరింగ్ రీసెర్చర్స్ నిర్వహించిన మెగా ఏ1 అటానమస్ హ్యాకథాన్-25లో డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచారు. బీఎస్సీ కంప్యూటర్ సైన్స్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న నరవ ఉమామహేష్, పల్లి దానవేంద్ర గేమ్స్ విభాగంలో 'మేజ్‌గేమ్ మాస్టరీ' ప్రాజెక్టును ప్రదర్శించి ప్రథమ బహుమతి సాధించారు. ఈ సందర్భంగా కళాశాలలో సోమవారం వారిని ప్రిన్సిపాల్ విజయబాబు అభినందించారు. కార్యక్రమంలో అధ్యాపకులు శివప్రసాద్, ఎస్.సాంబమూర్తి, పి.రామచంద్ర పాల్గొన్నారు.

నేత్రపర్వంగా అప్పన్న నిత్య కల్యాణం

సింహాచలం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆర్జిత నిత్యకల్యాణం సోమవారంనేత్రపర్వంగా సాగింది. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించి మాంగల్యధారణ, అక్షతారోపణ చేశారు. మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చి భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

'ఆప్కాస్‌ను రద్దు చేస్తే రాష్ట్ర వ్యాప్త ఉద్యమం'

సిరిపురం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్‌లోని గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఆప్కాస్‌ను రద్దుచేస్తే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమిస్తామని జీవీఎంసీ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షులు ఎం.ఆనందరావు హెచ్చరించారు. అవుట్‌సోర్సింగ్ కార్మికులను ఆప్కాస్ ద్వారా జీతం, పీఎఫ్, ఈఎస్ఐ సదుపాయం కల్పించి గత ప్రభుత్వం భరోసాగా నిలిచిందని కూటమి ప్రభుత్వం దీనిని రద్దు చేసి శాఖాపరంగా ఏజెన్సీలకు అప్పగిస్తామని చెప్పడాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. ఈ మేరకు సోమవారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయం ద్వారం వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆప్కాస్ రద్దు చేస్తే అంతకంటే మంచి వ్యవస్థను తీసుకురావాలని, లేనిపక్షంలో ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేస్తున్న అవుట్‌సోర్సింగ్ ఆప్కాస్ ఉద్యోగులకు మినీమం టైమ్ స్కేల్ అమలుచేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆప్కాస్ ఉద్యోగుల ఆందోళన కార్యక్రమాన్ని, నిరవధిక సమ్మెను చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కార్మికులు సత్యం, సతీష్, రామకృష్ణ, ఈశ్వరరావు, ప్రసాద్, శ్రీను, కనకరాజు, జీవన్, శేఖర్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న జీవీఎంసీ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు

వైసీపీ అధ్యక్షుడు అమర్‌నాథ్‌కు సత్కారం

వెంకోజీపాలెం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్‌ను సోమవారం ఆయన నివాసంలో పార్టీ వివిధ విభాగాల అధ్యక్షులు కలిసి సత్కరించారు. పార్టీ అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా వలంటీరు, సోషల్ మీడియా అధ్యక్షులు పీలా ప్రేమ్‌కిరణ్, బొండా ఉమామహేశ్వరరావు, యువజన విభాగం ఉపాధ్యక్షుడు బింగి హరికిరణ్‌రెడ్డి, కొట్యాడ సూర్య, ప్రభాకర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.



అమర్‌నాథ్‌ను సత్కరిస్తున్న వైసీపీ విభాగాల అధ్యక్షులు

ఘనంగా కన్యకాపరమేశ్వరి ఆలయ వార్షికోత్సవం



కన్యకాపరమేశ్వరి ఆలయంలో మండపారాధన పూజలు

పద్మనాభం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయ ఎనిమిదో వార్షికోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం పంచామృతాభిషేకాలు, విశేష అర్చనలు చేశారు. గణపతి పూజ అనంతరం పుణ్యాహవచనం మండపారాధన చేశారు. మహన్యాస పూర్వక రుద్రాభిషేకం, 108 కలశాలతో ఊరేగింపు చేసి ఆ జలాలతో అమ్మవారిని అభిషేకించారు. పురోహితులు యేచూరి రామజోగారావుశర్మ ఆధ్వర్యంలో గంగవరపు రోహిణీ కుమార్ శ్రీసూక్త, పురుష సూక్త సహిత అభిషేకాలు, కుంకుమార్చనలు చేశారు. అనంతరం అన్నసమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ గౌరవాధ్యక్షుడు ఎ.శ్రీనివాసరావు, అధ్యక్షులు కె.వి.నారాయణమూర్తి, సభ్యులు సత్యకృష్ణ, శ్రీను, సుందరరావు పాల్గొన్నారు.

డాక్టర్ అబ్దుల్‌ఖాన్‌కు సిల్వర్ జూబ్లీ ఎక్స్‌లెన్స్ అవార్డు

ఆరిలోవ, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) సీనియర్ ఆర్థోపెడిక్ కన్సల్టెంట్ డాక్టర్ అబ్దుల్‌ఖాన్‌కు ఇటీవల నగరంలో జరిగిన ఆర్థోపెడిక్ సర్జన్ సొసైటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్(ఓఎస్ఎస్ఏపీ) వార్షిక సదస్సులో సిల్వర్ జూబ్లీ ఎక్సలెన్ అవార్డు లభించింది. సదస్సులో ఉత్తమ ఒరిజనల్ రీసెర్చ్ పేపర్ సమర్పించినందుకు గాను ఆయనకు ఈ అవార్డును అందించారు. దీర్ఘకాలిక సైనోవైటిస్‌కు చీలమండ ఆర్థో స్కోపీ ఫలితాలపై రెండు సంవత్సరాల పాటు ఆయన తీవ్రంగా కృషిచేశారు. కోయంబత్తూరులోని గంగా హాస్పిటల్ చైర్మన్ డాక్టర్ రజశేఖరన్ ఆయనకు ఈ అవార్డును అందించారు. ఓఎస్ఎస్ అధ్యక్షుడు డాక్టర్ సునందకుమార్‌రెడ్డి నుంచి పతకాన్ని అందుకున్నారు.



ఇటీవల జరిగిన ఆర్థో సదస్సులో అవార్డు అందుకుంటున్న డాక్టర్ అబ్దుల్‌ఖాన్

గ్రామీణాభివృద్ధితోనే దేశ ప్రగతి సాధ్యం

- సదస్సులు నూతన విజ్ఞానాన్ని అందిస్తాయి
- ఆంధ్ర విశ్వవిద్యాలయం వీసీ ఆచార్య జి.శశిభూషణరావు

వెంకోజీపాలెం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): గ్రామీణాభివృద్ధితోనే దేశాభివృద్ధి సాధ్యమని ఏయూ వీసీ ఆచార్య జి.శశిభూషణరావు పేర్కొన్నారు. అంబేడ్కర్ అసెంబ్లీ హాల్లో సోమవారం రాజనీతి-ప్రభుత్వ పాలనా శాస్త్రం విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రెండు రోజుల జాతీయ సదస్సు రోల్ అండ్ రిలవెన్స్ ఆఫ్ ది పేర్లర్ బాడీస్ ఇన్ రూరల్ లోకల్ గవర్నమెంట్ జాతీయ సదస్సును ఆయన ప్రారంభించారు. ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ సోషల్ సైన్స్ రీసెర్చ్ సహకారంతో ఈ సదస్సును నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా వీసీ శశిభూషణరావు మాట్లాడుతూ సదస్సులు నూతన జ్ఞానాన్ని, శక్తిని అందిస్తాయన్నారు. మేధో చర్చలు, విలువైన సూచనలు ప్రణాళికల రూపకల్పనకు ఉపకరిస్తాయన్నారు. ఐసీఎస్ఎస్ఆర్ఎస్ఆర్‌సీ హైదరాబాద్ గౌరవ డైరెక్టర్ ప్రొఫెసర్ బి.సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ స్థానిక సంస్థలలో జవాబుదారీతనం, పారదర్శకత పెరగాలన్నారు. సోషల్ సైన్సెస్ రంగంలో పరిశోధనలు అంతర్జాతీయ ప్రమాణాలకు దీటుగా జరగాల్సిన అవసరం ఉందని చెప్పారు. జాతీయ, అంతర్జాతీయ సదస్సులు, వర్క్‌షాప్‌లు, ఎఫ్‌డీపీ నిర్వహించడానికి ఐసీఎస్ఎస్ఆర్ సహకరిస్తుదన్నారు. మేజర్, మైనర్ రీసెర్చ్ ప్రాజెక్టులకు ఏయూ నుంచి ఆచార్యులు దరఖాస్తు చేయాలని సూచించారు. సదస్సు కన్వీనర్ ఆచార్య పేటేటి ప్రేమానందం వర్తమాన ప్రాధాన్యత కలిగిన అంశంపై సదస్సును నిర్వహిస్తున్నట్టు చెప్పారు. రెండు రోజుల సదస్సు నిర్వహణ, ప్రాముఖ్యత తదితర అంశాలను వివరించారు. ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.నరసింహారావు మాట్లాడుతూ ప్రతి విభాగంలో ఇలాంటి సదస్సులు నిర్వహించాలన్నారు. ఈ సందర్భంగా సదస్సు ప్రత్యేక సంచికను వీసీ ఆచార్య శశిభూషణరావు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పూర్వ రెక్టార్ ఆచార్య ఈఏ నారాయణ కీలకోపన్యాసం చేశారు. రీజనల్ ఎంప్లాయిమెంట్ అధికారి టి.అనిల్‌కుమార్, మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ డైరెక్టరేట్ ఆఫ్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ ఆచార్యులు ఎస్.ఆర్.సుభాని ప్రసంగించారు. పరిశోధకులు, నిపుణులు పరిశోధన పత్రాలను సమర్పించారు. సదస్సు కో డైరెక్టర్ టి.నాగరాజు, అధ్యాపకులు డాక్టర్ జి.వీర్రాజు, డాక్టర్ వి.హరీష్, డాక్టర్ షేక్ సులేమాన్, డాక్టర్ కె.దేముడు, డాక్టర్ కె.సత్యనారాయణ, డాక్టర్ కె.రత్నరాజు, డాక్టర్ ప్రసాద్ పాల్గొన్నారు.



సావనీర్‌ను విడుదల చేస్తున్న వీసీ ఆచార్య శశిభూషణరావు, అధికారులు

రహదారిపైనే వాహనాల మరమ్మతులు!



మాధవధార 48ఎ బస్ రూట్‌లో దారి ఆక్రమించిన వాహనాలు

మాధవధార, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): మాధవధార వుడాకాలనీ మెయిన్ రోడ్డులో నిత్యం వాహనాలు ఆగిపోతున్నాయి. రోడ్లను ఆక్రమించి వాహనాలను నీటితో శుభ్రం చేస్తూ కొందరు వ్యాపారం చేసుకుంటుంటే, రాకపోకలకు వెళ్లే దారి లేక వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాలల ఎదుటనే ఉన్న ఈ కార్ వాషింగ్ స్టేషన్‌కు పదుల సంఖ్యలో నిత్యం వస్తున్న వాహనాలను రోడ్డుకు ఇరువైపులా ఉంచి శుభ్రం చేస్తున్నారు. దీంతో పాటు పక్కనే మెకానిక్ షెడ్ కూడా ఏర్పాటు చేసి, మరమ్మతుల కోసం వచ్చే వాహనాలను అడ్డదిడ్డంగా పార్కింగ్ చేస్తున్నారు. ప్రధాన రహదారిలో 48ఎ ఆర్టీసీ బస్సులు, ప్రయాణికుల వాహనాలు, విద్యార్థులు, తల్లిదండ్రులు ఇబ్బందులు పడుతున్నారు. దీనికి తోడు మెకానిక్‌లు దురుసుగా వాహనాలు నడుపుతూ గుబులు పుట్టిస్తున్నారు. హారన్ల శబ్దం చేస్తూ, వేగంగా దూసుకొస్తున్న డ్రైవింగ్ లైసెన్సు లేని మెకానిక్‌లపై చర్యలు తీసుకోవాలని పలుమార్లు మొరపెట్టుకున్నా, చర్యలు లేవని స్థానికులు వాపోతున్నారు. ట్రాఫిక్ పోలీసులు, జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ వర్గాలు ఈ దుకాణాల నిర్వహణను కట్టడి చేయాలని కోరుతున్నారు.

ఘనంగా మాఘమాసం వేడుకలు

మాధవధార, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): పురాతన మాధవధార ఆలయాల పుణ్యక్షేత్రంలో మాఘ మాసం వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. ఈ నెల 7న ఆరంభమైన అయిదు రోజుల వేణుగోపాల స్వామి కల్యాణ ఉత్సవాల్లో సోమవారం సదస్యం ప్రత్యేక పూజలు చేపట్టారు. మంగళవారంతో కల్యాణ వేడుకలు పూర్తి కానున్నాయని అర్చకులు తెలిపారు. సాయంత్రం తిరువీధి ఊరేగింపు జరుగుతుందన్నారు. జనవరి 30న ప్రారంభమైన మాఘ మాసం వేడుకలు ఫిబ్రవరి 28 వరకు నిర్వహిస్తారు. నెలరోజులూ ఇక్కడి మాధవస్వామి ఆలయం, వేణుగోపాల స్వామి మందిరాల్లో ప్రత్యేక పూజాభిషేకాలు చేపడతారు. ఇక్కడి సహజసిద్ధ జలధారల్లో స్నానం ఆచరించి ఆలయాల సందర్శనకు పెద్దసంఖ్యలో ప్రజలు వస్తుంటారు. మాఘమాసంలో వచ్చే ఆదివారాల్లో మరింతగా వచ్చే జనం కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. సోమవారం నగరం సహా సుదూర ప్రాంతాల నుంచి భక్తులు లీలా మాధవస్వామి, వేణుగోపాల స్వామి వార్ల దర్శనానికి విచ్చేశారు. ముందుగా ఇక్కడి పవిత్ర జలధారల్లో స్నానం ఆచరించిన భక్తులు దేవతామూర్తుల్ని దర్శించుకున్నారు. ఈ నెల 28న మాఘ అమావాస్యతో ఉత్సవాలు ముగియనున్నాయి.



అలంకరణలో లీలా మాధవస్వామి



మాధవధార జలధారల వద్ద భక్తుల పుణ్యస్నానాలు

కాంస్య పతక విజేత సతీష్‌కుమార్‌కు సత్కారం

డాబాగార్డెన్స్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): న్యూఢిల్లీలో ఇటీవల జరిగిన 4వ ఓపెన్ ఇండియా ఇంటర్నేషనల్ కిక్ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో నగరానికి చెందిన వాసుపల్లి సతీష్‌కుమార్ కాంస్య పతకాన్ని సాధించి సత్తాచాటారు. సోమవారం డాబాగార్డెన్స్ వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఫౌండేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ కిక్ బాక్సింగ్ లీగ్ ప్రెసిడెంట్ ఆధ్వర్యంలో టెంకి దుర్గ సమక్షంలో సతీష్‌ను సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా సతీష్‌కుమార్ మాట్లాడుతూ కాంస్య పతకాన్ని సాధించేందుకు ఎంతో కృషి చేశానన్నారు. ఈ కార్యక్రమంలో క్రీడా సంఘాల ప్రతినిధులు జి.వి.రామచంద్రరావు, ఆనంద్‌బాలు, ఎం.నారాయణరావు పాల్గొన్నారు.

మెరిసిన క్రీడారత్నాలు

కొమ్మాది, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో మధురవాడ ఆనంద్ తైక్వాండో క్లబ్ విద్యార్థులు ప్రతిభ కనబరచి 6 బంగారు, 4 కాంస్య, 4 రజత పతకాలు సాధించినట్లు కోచ్ ఆనంద్ సోమవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. జనవరి 31 నుంచి ఫిబ్రవరి 2 వరకు కాకినాడలో జరిగిన ఎన్.టి.ఆర్ మెమోరియల్ పోటీల్లో ఈ ఘనత సాధించారని తెలిపారు. విజేతలకు తైక్వాండో గ్రాండ్ మాస్టర్ కె.వి.బాబూరావు ప్రశంసాపత్రాలు అందించారు.

ఉక్కులో 16 మంది ఉన్నతాధికారులకు షోకాజ్ నోటీసులు

... 5వ పేజీ తరువాయి

తయారు చేసుకుంటుంది. కానీ ఇక్కడ ఎమర్జెన్సీ పేరుతో నేరుగా కోక్‌నే కొన్నారు. సరఫరా చేసిన కోక్ నుంచి నమూనాలు తీసి, వాటిని ప్రయోగశాలకు పంపించి, అక్కడ నుంచి వచ్చిన నాణ్యత నివేదిక ప్రకారం బిల్లు రూపొందించి ఆర్థిక విభాగానికి పంపుతారు. అయితే ఈ కేసులో ఐసీపీపీఎల్ నమూనాలు సకాలంలో సమర్పించలేదు. ఆ తరువాత పంపిన వాటిలో నాణ్యత తక్కువగా ఉండడంతో మరోసారి నమూనాలు కోరారు. ఈ ప్రక్రియ నడుస్తుండగా ఢిల్లీ నుంచి ఉక్కు మంత్రిత్వ శాఖ అధికారులు...ముడి పదార్థాల సరఫరాదారులకు ఎంత బకాయిలు ఉన్నాయో నివేదిక ఇవ్వాలని ఇక్కడి అధికారులను కోరారు. అప్పటికి ఐసీపీపీఎల్ నమూనాలు ఇవ్వకపోవడం వల్ల బిల్లు జనరేట్ కాలేదు. దాంతో ఢిల్లీకి పంపిన నివేదికలో ఆ సంస్థకు ఇవ్వాల్సిన రూ.220 కోట్లు బకాయిగా చూపించలేదు. ఆ తరువాత వచ్చిన నమూనాలు, నాణ్యత నివేదిక ప్రకారం ఆ సంస్థకు ఇవ్వాల్సిన మొత్తం చెల్లించేశారు. అయితే తాము బకాయిల వివరాలు పంపాల్సిందిగా కోరితే...ఆ రూ.220 కోట్ల బిల్లు విషయం ప్రస్తావించలేదంటూ ఢిల్లీ అధికారులు విజిలెన్స్‌కు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో రా మెటీరియల్ డిపార్ట్‌మెంట్, మెటీరియల్ మేనేజ్‌మెంట్, క్వాలిటీ అండ్ ఎనాలసిస్ లేబరేటరీ, ఫైనాన్స్ విభాగాల్లో పనిచేస్తున్న 16 మందికి షోకాజ్ నోటీసులు అందాయి. వీరిలో సీనియర్ మేనేజర్ నుంచి జనరల్ మేనేజర్ స్థాయి వరకు అధికారులు ఉన్నారు. వీరిలో ఎనిమిది మందికి నెహ్రూ అవార్డులు కూడా వచ్చాయి. ఏ తప్పు చేయకపోయినా షోకాజ్‌లు ఇచ్చారని, కొద్దికాలంలో పదవీ విరమణ చేసే వారిని ఇలా ఇబ్బంది పెట్టడం ఏమిటని ఉద్యోగ వర్గాలు ఆవేదన వ్యక్తంచేస్తున్నాయి. తక్షణమే ఉపసంహరించుకోకుంటే ఉద్యోగ వర్గాల్లో అశాంతి రేగుతుందని హెచ్చరిస్తున్నాయి.

‘దివ్యసాయి ప్రతిభ మాకు గర్వకారణం’



దివ్యసాయితో కేకు కోయిస్తున్న మర్రిపాలెం రైల్వే క్వార్టర్స్ యువకులు

మర్రిపాలెం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాఖండ్‌లో జరిగిన జాతీయ క్రీడల్లో బీచ్ వాలీబాల్ పోటీల్లో స్వర్ణ పతకం సాధించిన జట్టులో సభ్యుడైన మర్రిపాలెంకు చెందిన దివ్యసాయిని వాలీబాల్ ఆటగాళ్లు సోమవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మర్రిపాలెం రైల్వే క్వార్టర్స్ వద్ద కేకు కోసి అనంతరం దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. స్థానికుడైన దివ్యసాయి జాతీయ స్థాయి జట్టులో స్థానం సంపాదించడం, ఇప్పుడు స్వర్ణ పతకం సాధించడం తమకు గర్వకారణమని సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో చైతన్య, రాజేష్, అప్పారావు, మరికొందరు యువకులు పాల్గొన్నారు.

క్రీడా భారతి సమావేశంలో పలు తీర్మానాలు

విశాఖపట్నం స్పోర్ట్సు, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): క్రీడా భారతి ఆధ్వర్యంలో సోమవారం జరిగిన సమావేశంలో పలు తీర్మానాలు చేశామని అధ్యక్షుడు ఎం.వి.మాణిక్యాలు తెలిపారు. నగరంలో జరిగిన ఈ సమావేశంలో కృష్ణా, గోదావరి, ఉత్తరాంధ్ర జిల్లాల ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారని పేర్కొన్నారు. వచ్చే రెండు నెలల్లో చేపట్టాల్సిన కార్యక్రమాలతో చర్చించామన్నారు. క్రీడాభారతి వ్యవస్థాపక దినోత్సవంలో భాగంగా వివిధ జిల్లాల్లో శారీరక క్రీడా పోటీలు నిర్వహించడం, జాతీయ క్రీడా దినోత్సవం, క్రీడ జ్ఞాన పరిరక్షణ వంటి కార్యక్రమాలతోపాటు హనుమాన్ జయంతి, క్రీడాభారతిలో సభ్యత్వ నమోదు, అన్ని జిల్లాల్లో కమిటీలను బలోపేతం చేయడం వంటి అంశాలపై తీర్మానాలు చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మన్యాల (ఫారెస్ట్ రేంజర్) ఇన్‌చార్జి రామ్‌నరేష్, పి.వి.నారాయణరావు పాల్గొన్నారు.

నేడు ఘంటసాల గానసుధ

అక్కయ్యపాలెం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 42వ వార్డు రైల్వే ఎగ్జిబిషన్ మైదానం ఎదురుగా ఉన్న షిర్డీసాయి ధ్యానమందిరం ఆవరణలో ప్రముఖ నేపథ్య గాయకుడు ఘంటసాల వేంకటేశ్వరరావు వర్ధంతి కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించనున్నట్లు ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు నాకల శేషగిరిరావు తెలిపారు. ఆలయ ఆవరణలో సోమవారం కరపత్రాలను ఆవిష్కరించారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు గానసుధ గల్లా చిట్టిబాబు బృందంతో మధుర భక్తి గీతాలాపన ఉంటుందని చెప్పారు.

ఇంటింటా దివ్యాంగుల గుర్తింపు సర్వే ప్రారంభం



గుర్తింపు సర్వే చేపట్టేందుకు ర్యాలీగా వెళ్తున్న సిబ్బంది

మహారాణిపేట, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి దివ్యాంగులను గుర్తించేందుకు సర్వే నిర్వహించారు. మహారాణిపేటలోని దండుబజారు ప్రాంతంలో సోమవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఇంటింటికీ వెళ్లి దివ్యాంగుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ నెల 24 వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు సంస్థ కార్యదర్శి ఎం.వెంకట శేషమ్మ తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది, ఏఎన్ఎంలు, అంగన్‌వాడి, ఆశా కార్యకర్తలు, కేజీహెచ్ పిల్లల వైద్యులు, న్యాయవాదులు సిబ్బంది పాల్గొన్నారు.

నులిపురుగులు ఉంటే పిల్లల్లో రక్తహీనత

అల్లిపురం/డాబాగార్డెన్స్, ఫిబ్రవరి10 (ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రతతోనే నులిపురుగుల నివారణ సాధ్యమని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం అన్నారు. నులిపురుగుల వల్ల పిల్లల్లో రక్తహీనత, వ్యాధి నిరోధక శక్తి తగ్గడం వంటివి కనిపిస్తాయని, వీటిని నిర్మూలిస్తే ఏకాగ్రత, జ్ఞాపకశక్తి పెరుగుతాయని అన్నారు. జాతీయ నులిపురుగుల నివారణ దినం సందర్భంగా జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సోమవారం అల్లిపురం మున్సిపాల్ ఎలిమెంటరీ పాఠశాల ప్రాంగణంలోని అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు నులిపురుగుల నివారణ మాత్రలు వేశారు. కొబ్బరితోట హెల్త్ సెంటర్ వైద్యాధికారిణి పర్వీనా, శ్రీలత, కె.కనక మహాలక్ష్మి, ఆశా, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు. డాబాగార్డెన్స్‌లోని జీవీఎంసీ ఆర్‌బీఎంయూపీ పాఠశాలలో ఒకటి నుంచి ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేశారు. పిల్లలను ఫాస్ట్‌ఫుడ్‌కు, నిల్వ ఆహార పదార్థాలకు దూరంగా ఉంచాలని ప్రధానోపాధ్యాయుడు ప్రభాకర్ తల్లిదండ్రులకు సూచించారు. ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.



చిన్నారులకు మాత్రలు వేస్తున్న గొండు సీతారాం

మార్చి 4, 5 తేదీల్లో ఉచితంగా కృత్రిమ చేతుల అమరిక



ఉచిత శిబిరం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న బాలసతీష్, అల్తాఫ్ బాబ్జాన్, లావణ్య తదితరులు

డాబాగార్డెన్స్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): చేతులు లేని నిరుపేదలకు ఉచితంగా కృత్రిమ చేతులను అందించేందుకు విశాఖలో మార్చి 4, 5 తేదీల్లో ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేస్తున్నట్టు కో-ఆర్డినేటర్ సి.బాలసతీష్ తెలిపారు. సోమవారం డాబాగార్డెన్స్ వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శారీరక వైకల్యంతో బాధపడేవారు సాధారణ జీవితాన్ని గడిపేందుకు సహాయపడటమే తమ లక్ష్యమన్నారు. ఆధునిక సాంకేతికతతో రూపొందించిన కృత్రిమ చేతులను ఉచితంగా అమరుస్తామన్నారు. రోటరీ క్లబ్ విశాఖపట్నం సెంట్రల్ అధ్యక్షురాలు ఎస్.లావణ్య మాట్లాడుతూ ఈ శిబిరం ద్వారా అనేక మందికి ప్రయోజనం చేకూరుతుందన్నారు. ప్రాజెక్టు చైర్మన్ అల్తాఫ్ బాబ్జాన్ మాట్లాడుతూ రోటరీ క్లబ్, విశాఖ నైట్స్ రౌండ్ టేబుల్ 225, సింధీ పంచాయతీ సంస్థలు సంయుక్తంగా పనిచేస్తున్నాయన్నారు. కో చైర్మన్ మనోహర్ నాగపాల్ మాట్లాడుతూ శిబిరానికి రావాలనుకున్నవారు రిజిస్ట్రేషన్ కోసం ఫోన్ 96529 86007, 77951 37999లను సంప్రదించాలని కోరారు.

పది వేల పెన్నులతో ఎర్నిమాంబకు అర్చన



అమ్మవారి ముందు అర్చనకు వినియోగించిన పెన్నులు

జ్ఞానాపురం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): రానున్న పోటీ పరీక్షలు, 10వ తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థినీ, విద్యార్థులు ఉన్నత శ్రేణిలో ఉత్తీర్ణత కావాలని ఆకాంక్షిస్తూ సోమవారం జ్ఞానాపురంలోని ఎర్నిమాంబ అమ్మవారికి పదివేల పెన్నులతో అర్చన, విశేష కుంకుమార్చన నిర్వహించారు. అనంతరం అర్చన చేసిన పెన్నులను విద్యార్థులకు అందజేశారు.

వైభవంగా నీలమాంబ అమ్మవారి పరస

పూర్ణామార్కెట్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): వన్‌టౌన్ రంగిరీజు వీధిలో వెలసిన నీలమాంబ అమ్మవారి దర్శనానికి భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. సోమవారం అమ్మవారి 46వ పరస మహోత్సవాలను పురస్కరించుకొని పూర్ణామార్కెట్ మెయిన్ రోడ్డు నుంచి ఏవీఎన్ కాలేజీ డౌన్ వరకు పరిసరాలన్నీ రంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. రంగిరీజు వీధి, ఏవీఎన్ కాలేజీ డౌన్ ఏరియాలో సాయంత్రం నుంచి అమ్మవారి జాతర ఘనంగా నిర్వహించారు. పరిసర ప్రాంతాల నుంచి జనం తరలివచ్చారు. పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశం



తాము సత్కరించిన అప్పటి ప్రధానోపాధ్యాయుడితో పూర్వ విద్యార్థుల బృంద చిత్రం

జ్ఞానాపురం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): నగరంలోని కె.కాలనీ జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో 2000-01లో పదో తరగతి చదివిన విద్యార్థులు పాఠశాలను వీడి 25 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా సోమవారం స్థానికంగా ఓ హోటల్‌లో ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేసి కలుసుకున్నారు. అలనాటి జ్ఞాపకాలు, అనుభవాలను చిన్ననాటి స్నేహితులతో పంచుకున్నారు. అప్పటి ప్రధానోపాధ్యాయుడు శాస్త్రిని ఘనంగా సత్కరించి, ఆయన ఆశీర్వాదం తీసుకున్నారు. అప్పటి విద్యార్థుల్లో ఉన్నత స్థానాలు పొందిన వారిని తోటి స్నేహితులు సత్కరించారు. అనంతరం ఆటపాటలతో సందడి చేశారు. అందరినీ కలిపేందుకు కృషి చేసిన బుద్ద గణేష్, మజ్జి నూకరాజు, బుద్ద తులసి, పి.బాలకృష్ణ, ఎ.వీణా, బి.ప్రసన్న, రేణుక, సుజాత, డి.వరలక్ష్మిలను స్నేహితులందరూ అభినందించారు.

కొండలపై భూమి నూరుశాతం వినియోగం

... 5వ పేజీ తరువాయి

మెటామైండ్, సిఫీ, జెనోసాఫ్ట్)కు ఎకరా నుంచి తొమ్మిది ఎకరాల వరకు కేటాయించారు. ఈ కొండపైనే స్టార్టప్ విలేజ్, మిలీనియం టవర్-1, టవర్-2లు ఉన్నాయి. ఈ కొండపై ప్రైవేటు కంపెనీల్లో నాలుగు వేల మంది వరకు పనిచేస్తున్నారు.

- హిల్ నంబరు 4 మొత్తం 276.77 ఎకరాలు అదానీ డేటా సెంటర్‌కు కేటాయించారు.
- కాపులుప్పాడలో గతంలో లోకేశ్ ఐటీ మంత్రిగా పనిచేసినప్పుడే 170 ఎకరాల్లో లేఅవుట్ వేశారు. ఇప్పటికీ ఎవరికీ కేటాయించలేదు.

...ఇవి కాకుండా మంగమారిపేటలో చినజీయరు స్వామికి, వైసీపీ ప్రభుత్వం భీమిలి సమీపాన శారదా పీఠానికి భూములు కేటాయించాయి. వీటికి ప్రభుత్వం ఎటువంటి మార్గదర్శకాలు ఇవ్వలేదు. రహదారి ఎక్కడి నుంచి వేయాలి?, భూమిని ఎలా ఉపయోగించాలనే దానిపై స్పష్టత లేదు. వీటిపై కూడా ప్రస్తుత ప్రభుత్వం దృష్టిపెట్టింది.

పాలసీలో మంచి రాయితీలు

కూటమి ప్రభుత్వం కొత్త ఐటీ పాలసీలో ఐటీ కంపెనీలకు రాయితీలు ప్రకటించింది. గతంలో నిర్దేశించిన విస్తీర్ణం కంటే ఎక్కువ నిర్మిస్తే చదరపు అడుగుకు రూ.2 వేలు రాయితీ వస్తుంది. ఇది పూర్తిగా ఆర్థిక మండలి. అయినా సరే ఉద్యోగులకు ఇళ్లు, వ్యాపార కార్యకలాపాలకు కమర్షియల్ కాంప్లెక్స్‌ల నిర్మాణానికి అనుమతి ఇస్తామని చెప్పింది. అయితే వాటికి రాయితీలు ఉండవు. ఎకరాల కొద్దీ భూమిని తీసుకున్నవారు ఇంకా రెట్టింపు సంఖ్యలో ఉద్యోగులకు అవకాశం కల్పించాలనేదే ప్రభుత్వ ధ్యేయం.

- ఓ.నరేశ్‌కుమార్, ఉపాధ్యక్షులు రుషికొండ ఐటీ పార్క్ అసోసియేషన్

మహా నిర్లిప్తత!

... 5వ పేజీ తరువాయి

అందజేస్తుంటారు. వీటిపై తగు చర్యలు తీసుకోవాలంటూ సంబంధిత అధికారులకు కమిషనర్‌ను సూచిస్తారు. అయితే గత 20 రోజులుగా పూర్తిస్థాయిలో కమిషనర్ లేకపోవడంతో అన్నీ నిలిచిపోయాయి. దీనివల్ల అధికారుల్లో కూడా నిర్లిప్తత పెరిగిపోయింది. విధులను తూతూమంత్రంగా నిర్వర్తిస్తున్నారు. మొక్కుబడిగా కార్యాలయానికి వచ్చి వెళ్లిపోతున్నారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో కింది స్థాయి సిబ్బందిలో కూడా నిర్లక్ష్యం పెరిగిపోతోంది.

మరోవైపు వేసవి సీజన్ ప్రారంభం అవుతుండడంతో తాగునీటి సరఫరాలో ఇబ్బందులు మొదలవుతున్నాయి. జోన్-6 పరిధిలో కొండవాలు ప్రాంతాలకు నీటి సరఫరాలో అవాంతరాలు ఏర్పడుతున్నాయి. వేసవి ప్రభావం పెరిగేకొద్దీ నీటిసమస్యలు కూడా పెరుగుతాయి. పూర్తిస్థాయి కమిషనర్ ఉంటే ఇప్పటికే వేసవి యాక్షన్ ప్లాన్‌ను తయారుచేసి, అందుకోసం అవసరమయ్యే నిధులను కేటాయించేందుకు అవకాశం ఉండేది. అంతేకాకుండా 2025-26 ఆర్థిక సంవత్సరానికి జీవీఎంసీ బడ్జెట్‌ను స్టాండింగ్ కమిటీ ఆమోదించింది. కౌన్సిల్ ఆమోదించాల్సిన తరుణంలో కమిషనర్ సంపత్‌కుమార్‌కు బదిలీ అయ్యింది. ఇప్పుడు ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో బడ్జెట్ సమావేశం నిర్వహణకు ఎన్నికల కమిషన్ ప్రత్యేక అనుమతి పొందాల్సిన అవసరం ఏర్పడింది. పూర్తిస్థాయి కమిషనర్ ఉంటేనే గానీ దీనికోసం లేఖ రాసే పరిస్థితి కనిపించడం లేదు. నగర ప్రాముఖ్యత దృష్ట్యా రాష్ట్ర ప్రభుత్వం వీలైనంత త్వరగా కమిషనర్‌ను నియమించాల్సి ఉంది.

పూర్ణామార్కెట్ ప్రాంతంలో ఆక్రమణల తొలగింపు

... 5వ పేజీ తరువాయి

అవుతున్నందుకు జరిమానా విధిస్తామని హెచ్చరించారు. వారి చేతనే ఆయా దుకాణాల వద్ద పేరుకుపోయిన వ్యర్థాలను తొలగింపజేశారు. మధ్యాహ్నం మూడు గంటలకల్లా మెయిన్‌రోడ్డులో ఆక్రమణలను పూర్తిగా తొలగించారు. అనంతరం దుర్గాలమ్మగుడి జంక్షన్ నుంచి అగ్నిమాపక శాఖ కార్యాలయం వరకూ బస్టాపుల్లో ఉన్న దుకాణాలను తొలగించారు. అనంతరం పూర్ణామార్కెట్‌లో వాహనాల పార్కింగ్‌కు వసూలు చేసే ఫీజు వివరాలు ప్రజలకు తెలిసేలా ఎక్కడికక్కడ బోర్డులను ఏర్పాటుచేశారు. ప్రధాన రహదారిలో ఆక్రమణలను తొలగించడంతోపాటు పార్కింగ్ ఫీజుల దందాకు అడ్డుకట్ట వేయడంపై కొనుగోలుదారులు, వ్యాపారులు ఆనందం వ్యక్తంచేశారు. పోలీస్, జీవీఎంసీ అధికారుల వద్దకు వెళ్లి అభినందించారు.

జాడలేని చిరుతలు

... 5వ పేజీ తరువాయి

చుట్టూ ఉన్న రహదారులపై నిరంతరం వాహనాలు తిరగడంతో చిరుతల జీవనానికి అనువైన వాతావరణం కరవైంది.

గడచిన ఐదారు సంవత్సరాల నుంచి కంబాలకొండ, పరిసరాల్లో చిరుతలు సంచరించినట్టు పాద ముద్రలు (పగ్ మార్క్స్) కనిపించలేదని సిబ్బంది చెబుతున్నారు. కొన్నిచోట్ల ఏర్పాటుచేసిన ట్రాప్ కెమెరాల్లో కూడా చిరుతల ఆనవాళ్లు లభించలేదు. ఇటీవల కాలంలో చిరుతల గాండ్రింపు శబ్దం వినిపించలేదంటున్నారు. సుమారు నాలుగేళ్ల క్రితం చేపట్టిన జంతువుల సర్వేలో చిరుతల సంఖ్య ప్రస్తావించలేదు. కంబాలకొండ పరిసరాల్లో ప్రస్తుతం వందల సంఖ్యలో జింకలు, కొండ గొర్రెలు, మేకలు ఉన్నాయి. జింకలు భారీగా పెరగడానికి చిరుతలు లేకపోవడమే కారణమని అంటున్నారు.

వాహన శబ్దాలు, జనావాసాలు పెరగడం, తదితర కారణాలతో చిరుతలు మరో ప్రాంతానికి వలసపోయి ఉంటాయని అటవీ శాఖ సిబ్బంది అనుమానిస్తున్నారు. చిరుతలు ఉంటే...ఏదో ఒక సమయంలో వాటి ఉనికి తెలిసేదని, అనేక కారణాలతో బహుశా వలస పోవడం లేదా అంతరించిపోయి ఉండవచ్చునని చెబుతున్నారు. ఇదిలావుండగా విశాఖ పరిసరాల్లో తూర్పు కనుముల్లోని చిరుతలు ఎంతో అందమైనవని, ప్రపంచంలో ఆఫ్రికా అడవుల్లో తప్ప మరెక్కడా ఇటువంటి జంతువులు లేవని ఏయూ జంతుశాస్త్రం విభాగం రిటైర్డు ఆచార్యుడు డీఈ బాబు అన్నారు.

ఈ నెల రేషన్‌లో కందిపప్పు కట్!

మురళీనగర్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): రేషను పంపిణీలో ఈ నెల కందిపప్పు కరువైంది. కేవలం బియ్యం, అరకిలో పంచదార మాత్రమే కార్డుదారులకు అందిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న డిపోల్లో ఈ నెల ఎక్కడా కందిపప్పు సరఫరా లేదని సివిల్ సప్లయిస్ అధికారులు తెలిపారు. దీంతో అధిక ధరలతో అల్లాడుతున్న ప్రజానీకానికి ఈ ఫిబ్రవరి నెల బయట బహిరంగ మార్కెట్‌లో కొనుగోలు చేయక తప్పడం లేదు. ప్రతి నెలా కందిపప్పు రాయితీ ధరపై దాదాపు 70 రూపాయలకే అందిస్తున్నారు. ఈ నెల ఎలాంటి ముందస్తు సూచనలు లేకుండా సరఫరా ఆపేయడంతో పేదలు ఇబ్బందులు పడుతున్నారు. కంచరపాలెం సర్కిల్ 1 పౌరసరఫరాల శాఖ ఏఎస్ఓ కార్యాలయ పరిధిలో మురళీనగర్, మాధవధార ప్రాంతాల్లో ఉన్న 12 డిపోల్లో ఇదే విధంగా ఈ నెలకు సరఫరా చేపడుతున్నారు. ఈ మేరకు ఎండీయూ వాహనాలను వీధుల్లో నిలిపి రేషను కార్డుదారులకు కేవలం బియ్యం (ఇంట్లో ఒక్కో సభ్యునికి 5 కిలోల చొప్పున), పంచదార అర కిలో చొప్పున డీలర్ల నుంచి పంపిణీ చేస్తున్నారు.

కరాటే టోర్నీలో నగర క్రీడాకారులకు స్వర్ణ పతకాలు



జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలతో క్రీడాకారులు

విశాఖపట్నం స్పోర్ట్సు, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్ టోర్నీలో నగరానికి చెందిన జపాన్ కరాటే అసోసియేషన్ ఆఫ్ ఇండియా క్రీడాకారులు స్వర్ణ, రజత, కాంస్య పతకాలు కైవసం చేసుకున్నారు. జేకేఏఐ ఏపీ చీఫ్ కోచ్ మోహన్ వంశీ వద్ద శిక్షణ పొందుతున్న ఆరుగురు క్రీడాకారులు అద్భుతమైన ప్రతిభ చూపి పతకాలు సొంతం చేసుకున్నారు. కటాస్ స్టైల్ ఈవెంట్ బాలికల విభాగంలో కె.మేఘన, ఎం.నిఖిలశ్రీ, ఎస్.సంజన, ఆర్.శాన్వి, బాలుర విభాగంలో ప్రియాన్షు రౌట్, బి.త్రిలోకేష్ బంగారు పతకాలు సాధించారు. కుమిటి ఈవెంట్ బాలికల విభాగంలో ఎం.నిఖిలశ్రీ రజతం, ఎస్.సంజన కాంస్య పతకం సాధించగా, బాలుర విభాగంలో ప్రియాన్షు రౌట్ రజతం, బి.త్రిలోకేష్ కాంస్య పతకం దక్కించుకున్నారు. ఈ సందర్భంగా చీఫ్ కోచ్ షిహాన్ ఆనందరత్న, సుదర్శన్, సీనియర్ కోచ్ ఆర్.బాలరాజు, మహిళా కోచ్ కృష్ణవేణి క్రీడాకారులను అభినందించారు.

గాజువాకలో ఇనాం భూముల క్రమబద్ధీరణకు గ్రీన్‌సిగ్నల్

... 5వ పేజీ తరువాయి

101 నుంచి 200 వరకూ రూ.100, 201 నుంచి 400 వరకూ రూ.240, 401 నుంచి వెయ్యి గజాల వరకూ గజానికి రూ.రెండు వేలు చెల్లించాలి. రెండేళ్ల తరువాత సాధారణ రిజిస్ట్రేషన్ ఫీజు తీసుకుని నివాసాలు, వాణిజ్య భవనాలను రిజిస్టర్ చేస్తారు.

ఆక్రమణదారులు తమ దరఖాస్తులను మీ-సేవా కేంద్రాల్లో అందజేయాలి. స్థలం కొనుగోలు చేసిన వ్యక్తులతో జరిపిన లావాదేవీలకు సంబంధించి రిజిస్ట్రేషన్ డాక్యుమెంటు, ఇంటి పన్ను, నీటి పన్ను రశీదులు, కరెంటు బిల్లు, ఇంకా ఆక్రమణలు ధ్రువీకరించే ఆధారాలతో కూడిన డాక్యుమెంట్లను దరఖాస్తుతో పాటు ఈ ఏడాది డిసెంబరు 31లోగా సమర్పించాలి. దరఖాస్తులను రెవెన్యూ, జీవీఎంసీ అధికారులతో కూడిన కమిటీ పరిశీలిస్తుంది. ఆమోదం తెలిపిన తేదీ నుంచి ఏడాదిలోపు నాలుగు వాయిదాల్లో చలానా ద్వారా ఫీజు చెల్లించాలి. అప్పుడే తహసీల్దారు సదరు ఆక్రమణదారుడికి కన్వేయన్స్ డీడ్ జారీచేస్తారు. ఇదే సమయంలో 101 గజాల దాటిన ఆక్రమణదారులు స్టాంపు డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. ఆక్రమణలో ఉన్న ఖాళీ స్థలాలను క్రమబద్ధీకరించరు. ఒక్క నిర్మాణాలకు మాత్రమే తాజా ఉత్తర్వులు వర్తిస్తాయి.



..మాట్లాడుతున్న సీఐ సతీశ్‌కుమార్

ఫ్రెండ్లీ పోలీసింగ్‌తో సత్ఫలితాలు: సీఐ

పెందుర్తి, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): ఫ్రెండ్లీ పోలీసింగ్ నిర్వహణతో ప్రజల మన్ననలు పొంది సత్ఫలితాలు సాధించగలమని సీఐ కేవీ సతీశ్‌కుమార్ అన్నారు. చినముషిడివాడలో వార్డు, గ్రామ మహిళా పోలీసులతో సోమవారం శాంతిభద్రతలు, ఫ్రెండ్లీ పోలీసింగ్ అంశంపై జరిగిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఫిర్యాదు ఏ రూపంలో వచ్చినా పరిష్కరించాల్సిన బాధ్యత పోలీసులపై ఉందన్నారు. పోలీసులంటే ఎనిమీలు కాదు.. ఫ్రెండ్లీ భావనను ప్రజల్లో కలిగించాలని పేర్కొన్నారు. తమ పరిధిలోని ప్రజలతో పోలీసులు స్నేహపూర్వకంగా ఉంటూ అసాంఘిక, అరాచక వ్యక్తులను గుర్తించి వారు స్టేషన్‌కు సమాచారాన్ని అందించేలా చూడాలన్నారు. యాంటీ డ్రగ్స్, సైబర్ నేరాలపై అందరూ అవగాహన కలిగి ఉండాలని సీఐ కోరారు. ఇళ్ల వద్ద అందరూ సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సతీశ్‌కుమార్ సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ అనిరి తాత, తదితరులు పాల్గొన్నారు.

జోరుగా అండర్ గ్రౌండ్ విద్యుత్ కేబుళ్ల పనులు



విద్యుత్ కేబుళ్ల ఏర్పాటు కోసం తీసిన గొయ్యి

పెదగంట్యాడ, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): పెదగంట్యాడ పారిశ్రామికవాడలో అండర్ గ్రౌండ్ విద్యుత్ కేబుల్స్ వేసే పనులు జోరుగా సాగుతున్నాయి. పారిశ్రామికవాడలోని అన్ని ప్రధాన రోడ్లకు ఇరువైపులా విద్యుత్ కేబుల్స్ వేసేందుకు వీలుగా గోతులు తీశారు. ఇందుకోసం కార్మికులతో పాటు ఎక్స్‌కవేటర్లను వినియోగించారు. పెదగంట్యాడ ఏపీఈపీడీసీఎల్ సబ్ స్టేషన్ నుంచి అన్ని పరిశ్రమలను అనుసంధానం చేసే విధంగా అండర్‌గ్రౌండ్ కేబుల్స్ వేసేందుకు గోతులు తవ్వారు. సోమవారం నుంచి కేబుల్స్ వేసే పనులను ప్రారంభించారు. ఈ నెలాఖరు నాటిని కేబుల్స్ వేసే పనులు పనులు పూర్తి కావచ్చని పలు పరిశ్రమల యజమానులు అభిప్రాయ పడుతున్నారు.

సినిమా గైడ్

- **తండేల్ :** జగదాంబ, సంగం, కామేశ్వరి, శ్రీరామ, శ్రీవెంకటేశ్వర, శ్రీలీలామహల్, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), మోహిని (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ),
- **భవానీ వార్డ్ :** జగదాంబ, రమాదేవి
- **మదగజరాజ :** జగదాంబ, వెంకటేశ్వర-1, సౌజన్య (గోపాలపట్నం), శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా),
- **సంక్రాంతికి వస్తున్నాం :** శారద, మెలోడి, జగదాంబ, కిన్నెర, కాంతి, శ్రీలక్ష్మీనరసింహ-1,2 (104 ఏరియా), శ్రీనరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), తాతా, రాములమ్మ (తగరపువలస)
- **డాకు మహారాజ్ :** శరత్, శ్రీకన్య, కిన్నెర, సుకన్య, మోహిని కాంప్లెక్స్, శ్రీకన్య హెవెన్ (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), గణేష్, సప్తగిరి (తగరపువలస)
- **గేమ్ ఛేంజర్ :** మెలోడి, సంగం, కామేశ్వరి, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), కన్యకాంప్లెక్స్, మోహిని కాంప్లెక్స్ (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-2 (పెందుర్తి) రాములమ్మ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 32, టమాటా 12, వంకాయలు (తెలుపు) 16, వంకాయలు (నలుపు) 18, బెండకాయలు 40, పచ్చిమిర్చి 32, కాకరకాయలు 40, బీరకాయలు 46, ఆనపకాయ 12, కాలీఫ్లవర్ 12, క్యాబేజీ 12, క్యారెట్ 26 దొండకాయలు 32, బంగాళదుంపలు 16, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 80, అల్లం (పాతది)40, బరబాటి 30, ముల్లంగి 20, నిమ్మకాయలు (కిలో) 62, బద్దచిక్కుడు 26, దోసకాయలు 22, వెల్లుల్లి (పెద్దవి) 170, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 40, కీర దోస 26, క్యాప్సికమ్ 40, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 36 చిలగడదుంపలు 38, కంద 68, దేముడుచిక్కుడు 28, గోరుచిక్కుడు 28, కూర పెండలం 26, బ్రకోలి 55 , నూల్‌కోల్ 30, పనసపొట్టు 200, కొండఉసిరి 70, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్దకట్ట) 25, పుదీన (కట్ట) 4, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 120, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 20, మామిడి అల్లం 46, బొప్పాయి 38, జామకాయలు (కిలో) 60.

కోడిగుడ్లు (నెక్)
(వంద - రూ.లలో)

విశాఖపట్నం	465
విజయనగరం	469
శ్రీకాకుళం	469

చికెన్ ధరలు
బ్యాగ్

రైతు ధర	93
లైవ్ ధర	113
విత్ స్కిన్	196
స్కిన్‌లెస్	206



ములగాడలోని కంపెనీ నుంచి వెలువడుతున్న కాలుష్యం.. ఇంటి పరసరాల్లో చేరిన నల్లని బూడిదను చూపుతున్న స్థానికుడు

కాలుష్యంతో ఉక్కిరిబిక్కిరి

- నల్లని బూడిదతో అనారోగ్యాల బారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్న ములగాడ వాసులు
- కాలుష్య నియంత్రణ బోర్డు అధికారులు తగిన చర్యలు చేపట్టాలని వేడుకోలు

మల్కాపురం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): ములగాడలోని అల్లూ ఫ్లోరైడ్ కంపెనీ నుంచి నల్లని కాలుష్యం వెలువడుతుండడంతో స్థానికులు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. గత మూడు నెలలుగా ఈ కంపెనీ నుంచి విపరీతమైన నల్లని బూడిద కాలుష్యంగా విడుదలవుతుంది. ఈ కంపెనీని విస్తరించిన తర్వాత వెలువడుతున్న నల్లని కాలుష్యంతో అనారోగ్య సమస్యల బారినపడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇళ్లు, వాకళ్లతో పాటు ఊరంతా ప్రస్తుతం నల్లని బూడిదే కనిపిస్తుందని వాపోతున్నారు. ఈ విషయాన్ని అనేక సార్లు కంపెనీ అధికారుల దృష్టికి గ్రామ పెద్దలు తీసుకువెళ్లినప్పటికీ యజమాన్యం పట్టించుకోవడం లేదని ప్రజలు చెబుతున్నారు. కేవలం నల్లని బూడిదే కాకుండా కంపెనీ నుంచి వచ్చే వ్యర్థమైన నీటిని కూడా యాజమాన్యం భూగర్భంలో కలిపేస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. అంతేకాక రోజూ సుమారు 20 ట్యాంకుల వ్యర్థపు నీటిని రోడ్డుపైకి తెచ్చి వదిలేస్తున్నారని గ్రామస్థులు పేర్కొంటున్నారు. అందువల్ల కాలుష్య నియంత్రణ బోర్డు అధికారులు స్పందించి సదరు కంపెనీ యాజమాన్యంతో చర్చించి కాలుష్యం బారినుంచి తమను కాపాడాలని ములగాడ గ్రామస్థులు కోరుతున్నారు.

చురుగ్గా ఆటోనగర్ వంతెన పనులు

- మరో తొమ్మిది నెలల్లో అందుబాటులోకి వచ్చే అవకాశం
- నిరంతరం పర్యవేక్షిస్తున్న ఐలా కమిషనర్ ఎ.కిశోర్, ఇతర ప్రతినిధులు



ఆటోనగర్ డీ-బ్లాక్‌లో జరుగుతున్న ఫ్లైఓవర్ నిర్మాణ పనులు

ఆటోనగర్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): ఆటోనగర్ అభివృద్ధికి ఆటంకంగా మారిన డీ-బ్లాక్‌లోని చుక్కవానిపాలెం రైల్వే క్రాసింగ్ గేటు స్థానంలో ఫ్లైఓవర్ నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. ప్రతిరోజూ సుమారు వంద వరకు గూడ్స్ రైళ్లు ఈ ట్రాక్‌పై రాకపోకలు సాగిస్తున్న నేపథ్యంలో రైల్వే గేట్లను తరచూ మూసివేస్తుండడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. దీనివల్ల పరిసర గ్రామాల ప్రజలు, పలు ఇంజనీరింగ్ కళాశాలలు, పాఠశాలల విద్యార్థులు, వీఎస్ఈజడ్, ఆటోనగర్ కర్మాగారాల కార్మికులు, దువ్వాడ స్టేషన్ నుంచి రాకపోకలు సాగించే రైల్వే ప్రయాణికులు నానాపాట్లు పడుతున్నారు. ఈ నేపథ్యంలో ఆర్అండ్‌బీ విభాగం, నేషనల్ హైవేస్ అండ్ సీఆర్ఎఫ్ సేతుబంధన్ ప్రాజక్టులో భాగంగా ఆటోనగర్‌లో ఫ్లైఓవర్ పనులను చేపట్టారు. పదేళ్ల క్రితం రైల్వే అధికారులు, ఆర్‌వోబీ పనులు పూర్తి చేశారు. రైల్వే క్రాసింగ్‌కు ఇరుపక్కలా రోడ్డుకు అనుసంధానం చేయాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదే. అయితే నిధుల లేమితో ఆ పనులు అటకెక్కాయి. గత, ప్రస్తుత ఐలా పాలకవర్గాలు సమస్య తీవ్రతను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వానికి విన్నవించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం, అభివృద్ధి పనులు చకాచకా జరుగుతున్న నేపథ్యంలో ఎట్టకేలకు వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు. దీంతో ఇక్కడి విద్యుత్ స్తంభాలను తొలగించి, మరోపక్కన ఏర్పాటు చేసి నిర్మాణ పనులను వేగవంతం చేస్తున్నారు. ఇక్కడ జరుగుతున్న పనులను ఎప్పటికప్పుడు ఐలా కమిషనర్‌తో పాటు ఇతర ప్రతినిధులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. మరో తొమ్మిది నెలల్లో ఫ్లైఓవర్ అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందని ఐలా కమిషనర్ ఎ.కిశోర్ తెలిపారు. ఈ వంతెన అందుబాటులోకి వస్తే ప్రజల ఇబ్బందులు తీరినట్టవుతుంది.



ఆటోనగర్ రైల్వే గేటు వద్ద నిరీక్షిస్తున్న వాహనదారులు

టిడ్కో గృహ సముదాయాల్లో వసతులు కల్పించాలని నిరసన

- సీపీఐ ఆధ్వర్యంలో జోనల్ కార్యాలయం వద్ద ఆందోళన చేసిన ఇళ్ల యజమానులు



నిరసన తెలుపుతున్న గృహ యజమానులు, సీపీఐ నాయకులు

గాజువాక, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): టిడ్కో గృహ సముదాయాల్లో కనీస మౌలిక సదుపాయలు కల్పించాలని డిమాండ్ చేస్తూ సోమవారం గాజువాక జోనల్ కార్యాలయం ఎదుట ఇళ్ల యజమానులు సీపీఐ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి కసిరెడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ ఏళ్లు గడుస్తున్నా టిడ్కో గృహ సముదాయాల్లో కనీస వసతులు కల్పించలేదని, దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వసతులు కల్పిస్తామని అధికారులు హామీ ఇస్తున్నా అవి కార్యరూపం దాల్చడం లేదని మండి పడ్డారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు టిడ్కో గృహ సముదాయాల్లో వసతుల కల్పనకు కృషి చేయాలని కోరారు. అనంతరం జోనల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు జి.ఆనంద్, కె.అచ్యుతరావు, దుర్గారావు, విష్ణు, అప్పలరాజు, వనజాక్షి, పద్మ, తదితరులు పాల్గొన్నారు.

సరిపల్లిలో శివశివానీ విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలకు శ్రీకారం



పూజాది కార్యక్రమాలను నిర్వహిస్తున్న వేదపండితులు

పెందుర్తి, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సరిపల్లిలో గల స్వయంభు మల్లీశ్వరస్వామి ఆలయంలో సోమవారం శివశివానీ విగ్రహ ప్రతిష్ట ప్రారంభోత్సవాలకు వైభవంగా శ్రీకారం చుట్టారు. ఆలయ ప్రాంగణంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన యాగశాలలో వేదపండితులు రాపర్తి నరేంద్ర ఘనాపాఠి పర్యవేక్షణలో రుత్వికుల బృందం, యాగకర్తలు సర్పంచ్ గొర్లె రామకృష్ణ జగన్నాథం, ఎంపీటీసీ గొల్లవిల్లి రమణ దంపతులచే శాస్త్రోక్తంగా విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనం,గోపూజ, పంచగవ్యప్రాసన, మత్స్యంగ్రహణం, జలదివాసాలను నిర్వహించారు. సాయంత్రం యాగశాల ప్రవేశం, ద్వార స్తంభ తోరణ పూజ, అఖండ దీపారధన, అంకురార్పణ, వాస్తు మండపారాధన, అగ్ని ప్రతిష్ఠ, క్షీరాదివాసం, ధ్వజారోహణాన్ని నేత్రపర్వంగా జరపారు. అంతకుముందు శివశివానీ విగ్రహ ప్రతిష్ట స్థల దాత దివంగత ముక్కు తిరుపతయ్య కుటుంబం ఆధ్వర్యంలో కుంభమేళా త్రివేణి సంగమం, కాశీ, వారణాసి గంగానది నుంచి తెచ్చిన పవిత్ర జలాలతో ఆలయంలో స్వయంభు శివలింగానికి ప్రత్యేకంగా అభిషేకం చేశారు. అనంతరం శివశివానీ విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలకు అంకురార్పణ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ పీఎఫ్ ట్రస్టు ఛైర్మన్‌కు సత్కారం

ఉక్కుటౌన్‌షిప్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ ఉద్యోగుల ఈపీఎఫ్-95 సమస్యను పరిష్కరించేందుకు విశేష కృషి చేసిన ప్లాంట్ పీఎఫ్ ట్రస్టు ఛైర్మన్ హెచ్‌కే ఝా, కార్యదర్శి ఎస్.రాంప్రసాద్‌ను ఉక్కు అధికారుల సంఘం ప్రతినిధులు సోమవారం కర్మాగారంలో కలిసి అభినందనలు తెలుపుతూ సత్కరించారు. ప్లాంటులో అర్హులైన 5,500 మందికి పెన్షన్ వచ్చేలా కృషి చేయడం అభినందనీయమన్నారు. ఇంకా కొంతమంది ఉద్యోగులు చిన్న చిన్న ఇబ్బందులు పడుతున్నారని, వాటిని కూడా పరిష్కరించాలని కోరారు. అదేవిధంగా ఉక్కు యాజమాన్యం నుంచి రావాల్సిన పీఎఫ్ బకాయిలను వడ్డీతో సహా త్వరితగతిన ఉద్యోగుల ఖాతాల్లో జమ చేయాలని వేడుకున్నారు. కార్యక్రమంలో అధికారుల సంఘం ప్రతినిధులు చంద్రరావు, కేవీడీ ప్రసాద్, చంద్ర వెంకటేశ్వరరావు, లోకేశ్, తదితరులు పాల్గొన్నారు.

రూ.90 లక్షలతో శ్మశానవాటిక అభివృద్ధి



శ్మశానవాటిక ప్రహరీ ఎత్తు పెంచి ఫెన్సింగ్ ఏర్పాటు చేసిన దృశ్యం

గోపాలపట్నం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): గోపాలపట్నం ప్రధాన రహదారిలో ఉన్న శ్మశానవాటికకు రూ.90 లక్షలతో అభివృద్ధి చేస్తున్నారు. ఇందుకు సంబంధించిన పనులు ప్రస్తుతం చురుగ్గా జరుగుతున్నాయి. రెండు వార్డులకు చెందిన ప్రజలు ఈ శ్మశాన వాటికను వినియోగిస్తున్నారు. అందువల్ల ఇక్కడ పూర్తి స్థాయిలో మౌలిక వసతులను కల్పించడానికి ఇటీవల చర్యలు ప్రారంభించారు. ఇప్పటికే శ్మశానవాటికలో దహన సంస్కారం నిర్వహించే షెడ్లను ఆధునీకరించారు. అంత్యక్రియలు జరిపాక అస్థికలను భద్రపరచే గది, స్టోర్ రూమ్‌తో పాటు ప్రస్తుతం శ్మశానవాటిక చుట్టూ ఉన్న ప్రహరీ ఎత్తును పెంచి ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. శ్మశానవాటికలో అభివృద్ధి పనులు చేపట్టడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

డీ-మార్టులో విజ్ఞాన్ విద్యార్థులకు ఉద్యోగాలు



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్ సుధాకర్, తదితరులు

అగనంపూడి, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): అత్యుత్తమ విద్యా బోధనతో పాటు ఉపాధి, ఉద్యోగ అవకాశాలే లక్ష్యంగా విజ్ఞాన్ విద్యా సంస్థలు పనిచేస్తున్నాయని ప్రిన్సిపాల్ జె.సుధాకర్ అన్నారు. ఇటీవల కళాశాలలో నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూలో ఎంబీఏ ద్వితీయ సంవత్సరం చదువుతున్న 19 మంది విద్యార్థులు డీ-మార్టులో రూ 3.5 లక్షల వార్షిక వేతనంతో కూడిన ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా సోమవారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను ప్రిన్సిపాల్‌తో పాటు రెక్టార్ మధుసూదనరావు అభినందించారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థికి మొదటి ఏడాది నుంచే విలువలతో కూడిన విద్యతో పాటు క్యాంపస్ ఇంటర్వ్యూల్లో రాణించేలా కోడింగ్ స్కిల్స్, వాల్యూస్, సాఫ్ట్, టెక్నికల్ స్కిల్స్‌పై తర్ఫీదు ఇవ్వడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ప్లేస్‌మెంట్ అధికారి బి.ప్రసాద్, హరీశ్, మనోజ్ఞ, చంద్ర, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి కోసం పాదయాత్ర

కూర్మన్నపాలెం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి):ఎంవీవీ అండ్ ఎంకే పార్కు గృహ సముదాయానికి ఉన్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ నివాసితులందరూ సోమవారం పాదయాత్ర చేసి తమ నిరసనను వ్యక్తం చేశారు. ఇక్కడి శ్మశానవాటికకు ఎదురుగా ఉన్న ప్రధాన గేటు నుంచి గృహ సముదాయాల కార్యాలయం వరకు నిరసన ప్రదర్శన చేపట్టారు. గృహసముదాయ అవసరాలకు అవసరమయ్యే నీటి సరఫరాకు డబ్బులు వసూలు చేసే నిర్మాణ సంస్థ యాజమాన్యం ఆ మేరకు సరఫరా చేయడం లేదని గృహ సముదాయ సంక్షేమ సంఘం ప్రతినిధులు ఆరోపించారు. నీటి సమస్యను పరిష్కరించపోతే రానున్న ఆదివారం పెద్దఎత్తున ఆందోళనలకు దిగుతామని హెచ్చరించారు.

లిక్విడ్ గంజాయి తరలిస్తున్న ఇద్దరి అరెస్టు

కూర్మన్నపాలెం (విశాఖపట్నం), ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): లిక్విడ్ గంజాయిని తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను టాస్క్‌ఫోర్స్ దువ్వాడ పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరుకు చెందిన చిన్ని ధనలక్ష్మి (34) ఒడిశా నుంచి లిక్విడ్ గంజాయి తెచ్చి హుకుంపేటకు చెందిన బి.సునీల్‌కుమార్ (22) అనే వ్యక్తితో కలిసి దువ్వాడ రైల్వే స్టేషన్ సమీపాన వినియోగదారులకు అందించే ప్రయత్నం చేసింది. సమాచారం అందుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు ధనలక్ష్మిని, సునీల్‌కుమార్‌లను అరెస్టు చేసి వారి వద్దనుంచి 1,550 గ్రాముల లిక్విడ్ గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. దువ్వాడ సీఐ మల్లేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ

అక్కిరెడ్డిపాలెం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): చిన్నారుల్లో శక్తిని హరించే నులి పురుగులను నిర్మూలించి సంపూర్ణ ఆరోగ్యవంతులను చేసేందుకు ప్రభుత్వం పంపిణీ చేస్తున్న ఆల్బెండజోల్ మాత్రలను విద్యార్థులందరూ తప్పనిసరిగా వేసుకోవాలని అక్కిరెడ్డిపాలెం హైస్కూల్ ఇన్‌చార్జి హెచ్ఎం జి.కుమారస్వామి అన్నారు. జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా సోమవారం ఆరోగ్యశాఖ సిబ్బంది హైస్కూల్‌లో మూడు నుంచి పదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థులతో ఈ మాత్రలను వేయించారు. కార్యక్రమంలో వార్డు ఆరోగ్య కార్యదర్శి మహాలక్ష్మి, కొత్తర అప్పలరాజు, ఉపాధ్యాయుడు మహ్మద్ ఇస్మాయిల్, తదితరులు పాల్గొన్నారు.

జనసేన కార్యకర్త అంటే గౌరవంగా భావించాలి

ఎమ్మెల్యే పంచకర్ల



కార్యకర్త అభిప్రాయాన్ని నోట్ చేస్తున్న పంచకర్ల రమేశ్‌బాబు

పెందుర్తి, ఫిబ్రవరి (ఆంధ్రజ్యోతి) 10: జనసేన కార్యకర్త అంటే గౌరవంగా భావించాలని ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు అన్నారు. సుజాతనగర్‌లో సోమవారం జనసేన పార్టీ మండల కార్యకర్తల ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ ఆశయాలకు అనుగుణంగా జనసైనికులంతా పార్టీని క్షేత్ర స్థాయిలో బలోపేతం చేయాలన్నారు. భవిష్యత్తులో దేశ,రాష్ట్ర రాజకీయాల్లో జనసేన కీలకంగా మారి మహా శక్తివంతమైన పార్టీగా ఆవిర్భవించనున్నదన్నారు. తొలుత కార్యకర్తల అభిప్రాయాలు, సమస్యలను ఎమ్మెల్యే అడిగి తెలుసుకుని నోట్ చేసుకున్నారు. సమావేశంలో నాయకులు అయితి సింహాచలం, గొర్లె అప్పారావు, శేనాపతి సోమశేఖర్. కె.మధు, డీబీఎల్ నాయుడు, పి.పార్వతి, జి.అప్పారావు, కె.ఎర్రిబాబు, రాముడునాయుడు, తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాల పట్ల తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలి

వేపగుంట: మత్తు పదార్థాల వినియోగం పట్ల విద్యార్థుల తల్లిదండ్రులందరూ అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు అన్నారు. లేకుంటు యువత బంగారంలాంటి జీవితాలు నాశనమయ్యే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. ఆర్ఆర్‌వీ పురంలోని ఆళ్వార్స్ క్యాంపస్‌లో మాదక ద్రవ్యాల వినియోగం వల్ల జరిగే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పంచకర్ల మాట్లాడుతూ యువత మద్యం, గంజాయి వంటి మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా పిల్లలు ముందుకు సాగాలని హితవు పలికారు. విశ్రాంత న్యాయమూర్తి ఫైలా సన్నిబాబు మాట్లాడుతూ మాదకద్రవ్యాల వాడకం చట్టరీత్యా నేరమని, మత్తులో ఎవరైనా నేరాలు చేయడానికి కూడా వెనకాడరన్నారు. మరో విశ్రాంత న్యాయమూర్తి ఎస్.నాయుడు మాట్లాడుతూ సమాజంలో మాదకద్రవ్యాల వినియోగం లేకుండా చేసేందుకు అందరూ ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్ బొంగు శ్రీనివాస్, హిమ హ్యుమనేటేరియన్ వ్యవస్థాపకులు టీవీడీ దాస్, ఒడిశా స్టీల్ జోర్స్ ఉపాధ్యక్షుడు జేకే నాయక్, ఎన్.ఫరూక్, ఆళ్వార్స్ కళాశాల కో-ఆర్డినేటర్ జీవీఎస్ భగవాన్, మాజీ కార్పొరేటర్ రాపర్తి శైలజ, తదితరులు పాల్గొన్నారు.

కన్వెన్షన్ హాల్‌ను పరిశీలించిన వీఎంఆర్డీఏ కమిషనర్

వేపగుంట, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): వేపగుంట నుంచి చీమలాపల్లి వెళ్లే రోడ్డులో వీఎంఆర్డీఏ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న కన్వెన్షన్ సెంటర్ పనులను కమిషనర్ కేఎస్ విశ్వనాథన్ సోమవారం పరిశీలించారు. పనులు పురోగతిపై కాంట్రాక్టర్, ఇతర అధికారులను అడిగి తెలుసుకున్నారు. విద్యుదీకరణ, శీతలీకరణ పనులను వేగవంతం చేయాలని, త్వరలోనే ప్రారంభోత్సవ ఏర్పాట్లు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ప్రధాన ఇంజనీర్ భవానీశంకర్, పర్యవేక్షక ఇంజనీర్ బలరామ, ఎల్.ఎ.ఓ.వేణుగోపాల్, కార్యనిర్వాహక ఇంజనీర్లు రామరాజు, సుధీర్, ప్లానింగ్ అధికారులు అరుణ వల్లీ, చామంతి, తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు ఉజ్వల భవిత

ఉక్కుటౌన్‌షిప్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): క్రీడాకారులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఇస్లాంపేట ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ప్రమీల అన్నారు. నాంది ఫౌండేషన్ ఆధ్వర్యంలో పాఠశాలలోని 204 మంది విద్యార్థినులకు సోమవారం క్రీడా కిట్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేటి ప్రపంచంలో బాలురతో పాటు బాలికలు కూడా అన్ని రంగాల్లో రాణించాలన్నారు. ప్రతి బాలిక క్రీడల్లో రాణించేలా శిక్షణ పొందాలని, తాము క్రీడలకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని ప్రమీల పేర్కొన్నారు.

అప్పన్న నిత్యాన్న ప్రసాదానికి సేంద్రీయ కూరగాయలు

కృష్ణాపురంలో గల నృసింహవనంలో సాగు

- 2014లో శ్రీకారం
- ఈ ఆర్థిక సంవత్సరం తొమ్మిది నెలల్లో 22వేల టన్నులకుపైగా ఉత్పత్తి

(సింహాచలం, ఆంధ్రజ్యోతి)

వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానానికి చెందిన వ్యవసాయ క్షేత్రం (నృసింహవనం)లో సేంద్రీయ ఎరువులను ఉపయోగించి కూరగాయలు పండిస్తున్నారు. 2014లో దేవస్థానం ఈఓగా ఉన్న కోడూరి అచ్యుత రామచంద్రమోహన్ కేంద్ర కారాగారం సమీపాన గల కృష్ణాపురంలో ఆరు ఎకరాల విస్తీర్ణంలో కూరగాయల సాగుకు శ్రీకారం చుట్టారు. నాటి నుంచి దానిని కొనసాగిస్తున్నారు.



నృసింహవనంలో పచ్చిమిరప తోట



దొండ పాదులు

రసాయనిక ఎరువులను కాకుండా సేంద్రీయ ఎరువులనే వినియోగిస్తూ గణనీయమైన దిగుబడులను సాధిస్తున్నారు. దేవస్థానం డిప్యూటీ ఈఈ డీవీఎస్ రామరాజు (హరి) వ్యవసాయ క్షేత్రాన్ని పర్యవేక్షిస్తున్నారు. నీటి కోసం బోరు తవ్వించారు. ఇక్కడ పండించిన కూరగాయలను సింహగిరిపై దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యాన్న ప్రసాద విభాగంలో వినియోగిస్తున్నారు. ఈ ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి డిసెంబరు వరకూ తొమ్మిది నెలల్లో టన్నుల కొద్దీ కూరగాయలను దేవస్థానానికి పంపారు. అత్యధికంగా ఆనపకాయలు 8,953 కిలోలు, దొండకాయలు 5,000 కిలోలు, ముల్లంగి 4,000 కిలోలు, బెండకాయలు 3,000 కిలోలు, టమాటా 300 కిలోలు, వేలాది ములంకాడలు, చుక్కకూర 180 కిలోలు, పాలకూర 400 కిలోలు, గోంగూర 2,000 కిలోలు, దోసకాయలు 1,300 కిలోలు, మిర్చి 200 కిలోలు, కొత్తిమీర 150 కిలోలు, కరివేపాకు 650 కిలోలు నిత్యాన్న ప్రసాద పథకంలో వినియోగించినట్టు ఆలయ రికార్డులు చెబుతున్నాయి. తాజాగా క్యాబేజీ, మిర్చి, తదితర రకాలు పండించేందుకు నారును సిద్ధం చేశారు. వీటితో పాటు పొలం గట్ల మీద మామిడి, బొప్పాయి, నారింజ వంటి చెట్లను కూడా నాటారు. అప్పన్న ఆలయ అవసరాలకు సరిపడా కూరగాయలను పండించడమే లక్ష్యంగా భవిష్యత్తు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్టు దేవస్థానం ఈఓ వేంద్ర త్రినాథరావు తెలిపారు.



ఆనపకాయలు



బెండకాయలు

కిరండూల్ రైళ్లు దంతెవాడ వరకే

విశాఖపట్నం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): బచేలి, కిరండూల్ స్టేషన్ల యార్డులలో ప్రీ నాన్ ఇంటర్ లాకింగ్ పనుల నేపథ్యంలో విశాఖ, కిరండూల్ మధ్య రైళ్ల గమ్యాలను దంతెవాడ మధ్య కుదించామని సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు విశాఖ-కిరండూల్ పాసింజర్ ఈ నెల 13 నుంచి మార్చి 6 వరకు దంతెవాడ, తిరుగు ప్రయాణంలో 14 నుంచి మార్చి 7 వరకు విశాఖకు నడుస్తాయన్నారు. విశాఖ-కిరండూల్ నైట్ ఎక్స్‌ప్రెస్ 13 నుంచి మార్చి 6 వరకు దంతెవాడ, తిరుగు ప్రయాణంలో 14 నుంచి మార్చి 7 వరకు దంతెవాడ నుంచి విశాఖకు నడుస్తాయని తెలిపారు.

అప్పన్న ఆలయ లీకుల నివారణ ప్రాజెక్టుకు ఒప్పందం

- రూ.4 కోట్ల ఖర్చుతో పనులకు ఆమోదం
- ఇకపై భక్తులకు ఉపశమనం



ఎంఓయూ పత్రాలు చూపిస్తున్న మంత్రులు ఆనం, అనిత, జనార్దన్‌రెడ్డి, సంస్థ నిర్వాహకులు

సింహాచలం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో వర్షపు నీటి లీకేజీల నివారణ ప్రాజెక్టుకు అవగాహన ఒప్పందం (ఎంఓయూ) జరిగింది. దశాబ్దాలుగా కొద్దిపాటి వర్షానికి అప్పన్న దేవాలయం లోపలి భాగం తడిసి ముద్దవడంతో భక్తులు, సిబ్బంది అవస్థలు పడుతున్నారు. ఇప్పటికే రూ.లక్షలు వెచ్చించి మరమ్మతులు జరిపించినప్పటికీ నిష్ఫలమైంది. ఎట్టకేలకు భారత ఎపిగ్రఫీ విభాగం డైరెక్టర్ మునిరత్నంరెడ్డి సారథ్యంలో పుణెకు చెందిన లార్డు వెంకటేశ్వర చారిటబుల్, రెలిజియస్ ట్రస్టు సంస్థ లీకుల నివారణను సహజ పద్ధతిలో చేసేందుకు ముందుకు వచ్చింది. దీంతో తిరుపతి ఐఐటీ నిపుణుల బృందం సింహాద్రినాథుని ఆలయాన్ని సందర్శించి నివేదికను, ట్రస్టు ప్రతిపాదనలను అందజేసింది. రాష్ట్ర ప్రభుత్వం స్పందిస్తూ చారిటీ సంస్థకు అనుమతులు మంజూరు చేయడంతో సోమవారం శ్రీశైలంలో దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, హోం మంత్రి వంగలపూడి అనిత, రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్, రోడ్లు భవనాల శాఖ మంత్రి బి.సి.జనార్దన్ రెడ్డి లార్డు వెంకటేశ్వర చారిటబుల్ అండ్ రెలిజియస్ సంస్థతో ఎంఓయూ చేసుకున్నారు. ఈ ఒప్పందంపై మునిరత్నం రెడ్డి స్పందిస్తూ సంస్థ ఆధ్వర్యంలో తిరుమల, శ్రీనివాస మంగాపురం, శ్రీకాళహస్తి ఆలయాల పైకప్పు నుంచి వర్షపు నీరు నివారించే ప్రక్రియను విజయవంతంగా పూర్తిచేశామన్నారు. అప్పన్న దేవాలయంతో పాటు శ్రీశైల మల్లికార్జునస్వామి ఆలయాల్లో ఇదే తరహా ప్రాజెక్టులకు అనుమతులు లభించగా ఎంఓయూ జరిగిందన్నారు. ఇందుకోసం రూ.4 కోట్లు ఖర్చవుతుందన్నారు. త్వరలోనే పనులు ప్రారంభించేలా ప్రణాళికలు సిద్ధం చేసినట్టు చెప్పారు.

నిర్దేశిత సమయంలోగా పనులు పూర్తిచేయాలి

- వీఎంఆర్‌డీఏ కమిషనర్ కేఎస్ విశ్వనాథన్



పనుల వివరాలు తెలుసుకుంటున్న కమిషనర్

విశాఖపట్నం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): నిర్మాణాలు, మౌలిక వసతుల పనులన్నీ నిర్దేశిత సమయంలోగా పూర్తిచేయాలని వీఎంఆర్‌డీఏ కమిషనర్ విశ్వనాథన్ ఆదేశించారు. ఇంజనీరింగ్ అధికారులు, సిబ్బందితో కలిసిఆయన సోమవారం పలు ప్రాంతాల్లో పర్యటించారు. చీమలాపల్లిలో నిర్మిస్తున్న కన్వెన్షన్ సెంటర్ నిర్మాణం పరిశీలించారు. ఎలక్ట్రికల్ వర్కులతో పాటు ఏసీల ఏర్పాటు త్వరగా పూర్తిచేయాలని కాంట్రాక్టర్‌ని ఆదేశించారు. చిన ముషిడివాడలో అభివృద్ధి చేస్తున్న లేఅవుట్‌ని సందర్శించి జంగిల్ క్లియరెన్స్, రహదారి నిర్మాణ పనులు నెలాఖరుకు పూర్తి చేయాలన్నారు. దబ్బంద, గండిగుండం, ఎన్‌జీఆర్ పురం, బాందేవపురంలో రైతులకు ప్రత్యామ్నాయంగా అభివృద్ధి చేసి ఇస్తున్న లేఅవుట్లలో మౌలిక వసతుల పనులపై ఆరా తీశారు. ఈ పర్యటనలో సీఈ భవానీశంకర్, ఎస్ఈ బలరామ్, ఎల్ఏఓ వేణుగోపాల్, ఈఈలు రామరాజు, సుధీర్, జేసీపీ సింగ్, ప్లానింగ్ అధికారులు అరుణవల్లి, చామంతి తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరకుల ధరలు నియంత్రించాలి: ఐద్వా



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న ఐద్వా సభ్యులు

మహారాణిపేట, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): నిత్యావసర సరకుల ధరలను నియంత్రించాలని ఐద్వా విశాఖ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈమేరకు సోమవారం కలెక్టరేట్ వద్ద ఆలిండియా డెమొక్రటిక్ విమెన్ అసోసియేషన్ సభ్యులు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా అధ్యక్ష, కార్యదర్శులు బి.పద్మ, వై.సత్యవతి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్రాల్లో కూటమి ప్రభుత్వం పాలన వచ్చినప్పటి నుంచి నిత్యావసరాల ధరలు గణనీయంగా పెంచారని, ప్రజలు ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. కేరళ తరహాలో 14 రకాల సరకులను రేషన్‌లో ఉచితంగా అందించాలని, అర్హులందరికీ తెల్ల రేషన్‌కార్డు, ఇళ్ల మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.





ముద్ద అన్నం, ఉడకని గుడ్డు, మీల్ మేకర్‌లో పురుగులు

ముద్దగా అన్నం...కూరలో పురుగులు

- వాడపాలెం హైస్కూల్‌లో మధ్యాహ్న భోజనం
- కలెక్టరేట్ వద్ద ఆందోళన చేసిన విద్యార్థులు
- డిప్యూటీ డీఈవో ఆధ్వర్యంలో విచారణ

సాగర్‌నగర్/మహారాణిపేట, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ముద్ద అన్నం, పురుగులతో నిండిన మీల్‌మేకర్ కూర వడ్డించడంతో వారంతా కలెక్టరేట్‌కు చేరుకుని ఆందోళన చేపట్టారు. దీంతో కలెక్టర్ ఆదేశాల మేరకు డిప్యూటీ సోమేశ్వరరావు, ఎండీఎం జిల్లా కోఆర్డినేటర్ శాస్త్రి, ఎంఈవోలు విచారణ చేపట్టారు. జీవీఎంసీ 8వ వార్డు చిన రుషికొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం మధ్యాహ్న భోజనం మరీ దారుణంగా తయారుచేశారు. అన్నం ముద్దగా మారిపోవడంతో పాటు మీల్‌మేకర్ కూరలో పురుగులు వచ్చాయి. దీంతో విద్యార్థులు కలెక్టరేట్‌కు చేరుకుని గేటు ఎదుట ఆందోళనకు దిగారు. స్పందించిన కలెక్టర్ హరేంధిర ప్రసాద్ తక్షణ విచారణకు ఆదేశించారు. పాఠశాలలో గత కొద్ది కాలంగా నాసిరకంగా భోజనం వండి వడ్డిస్తున్నారని విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేయడంతో ప్రధానోపాధ్యాయుడు ఎం.త్రినాథరావు నిర్వాహకులను అప్రమత్తం చేశారు. అయితే వారు హెచ్‌ఎం హెచ్చరికలను పట్టించుకోవడం లేదు. స్థానికులు కావడంతో ఏమీ చేయలేని నిస్సహాయస్థితిలో ఉండిపోయారు. కాగా సోమవారం ముద్దలా మారిన అన్నం, ఉడకని కోడిగుడ్లతో పాటు పురుగులు వచ్చిన మీల్‌మేకర్ కూరను వడ్డించారు. దీంతో విద్యార్థులు కలెక్టరేట్‌కు చేరుకుని ఆందోళన చేశారు. కాగా ఎండీఎం నిర్వాహకులు సమయానికి రాకుండా హడావుడిగా వంట చేయడం దీనికి కారణంగా అధికారులు గుర్తించారు. దీనిపై హెచ్‌ఎంను ప్రశ్నించగా తాను పలుమార్లు హెచ్చరించినా పరిస్థితిలో మార్పు రాలేదున్నారు. వంట వండే ధనలక్ష్మిని విచారించగా అప్పటికప్పుడే సరకులు ఇచ్చి వంటచేయమంటున్నారని సమాధానం ఇచ్చింది. ఎంఈవో 1 రవీంద్ర బాబు, ఎంఈవో 2 అనూరాధ పాల్గొన్నారు. విచారణ అనంతరం నివేదికను డీఈవోకు సమర్పించారు.



పాఠశాలలో విచారణ చేపట్టిన అధికారుల బృందం



కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తున్న వాడపాలెం విద్యార్థులు

పురుగులు వస్తున్నాయి



అన్నం ముద్దగా ఉండడంతో పాటు మీల్ మేకర్ కూరలో పురుగులు వచ్చాయి. కోడిగుడ్లు ఉడకలేదు. అడిగితే సరైన సమాధానం లేదు. భోజనం బాగా లేకపోవడంతో ఖాళీ కడుపులతో ఉంటున్నాం.

- మంజిత్, విద్యార్థి

క్రైం... crime news

ఆటోనగర్‌లో సెక్యూరిటీ గార్డు మృతి

కూర్మన్నపాలెం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): ఆటోనగర్ ఈ-బ్లాక్‌లోని ఓ ప్రైవేటు సంస్థలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్న ఓ వ్యక్తి రక్తం కక్కుకుంటూ కుప్పకూలి మృతి చెందారు. దువ్వాడ పోలీసులు తెలిపిన వివరాలిలాఉన్నాయి. గవర జగ్గయ్యపాలేనికి చెందిన బుదిరెడ్డి దుర్గారావు (47) ఆటోనగర్‌లో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నారు. ఆదివారం రాత్రి విధులకు వచ్చి సోమవారం ఉదయం ఇంటికి వెళ్లే సమయంలో బ్రష్ చేసుకున్నారు. అప్పుడు నోటి నుంచి రక్తం కక్కుకుని కుప్పకూలి మృతి చెందారు. సహచరులు ఈ సమాచారాన్ని సంస్థ యాజమాన్యం దృష్టికి తీసుకువెళ్లడంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువతి దుర్మరణం

- మృతురాలి స్వస్థలం శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం

గాజువాక, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): శ్రీనగర్ జంక్షన్‌లో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువతి మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురానికి చెందిన కొణతాల ఉషారాణి (22) విశాఖ రైల్వే స్టేషన్‌లో ట్రైన్ దిగింది. అక్కడ నుంచి కుటుంబ సభ్యునితో కలిసి ద్విచక్ర వాహనంపై శ్రీనగర్ బయలుదేరింది. శ్రీనగర్ కూడలి వద్దకు వచ్చేసరికి వెనుకనుంచి వచ్చిన ఓ లారీ బలంగా వీరి ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో లారీ చక్రాల కింద ఉషారాణి పడిపోవడంతో అక్కడికక్కడే మృతి చెందింది. ద్విచక్ర వాహనం నడుపుతున్న వ్యక్తికి గాయాలవడంతో చికిత్స నిమి త్తం గాజువాకలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'ఉక్కు'లో కాంట్రాక్టు కార్మికుడికి గాయాలు



గాయపడిన నాగ శ్రీనివాసరావు

ఉక్కుటౌన్‌షిప్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ కోక్-ఓవెన్ విభాగంలో సోమవారం రాత్రి సుమారు పది గంటల సమయంలో జరిగిన ప్రమాదంలో ఓ కాంట్రాక్టు కార్మికుడికి గాయాలయ్యాయి. గాజువాకకి చెందిన నాగ శ్రీనివాసరావు (40) కోక్ ఓవెన్ విభాగంలో కాంట్రాక్టు కార్మికుడిగా పనిచేస్తున్నారు. రాత్రి విధులు ముగించుకుని తిరిగి వస్తుండగా చార్జింగ్ లిడ్‌పై కాలు మోపడంతో లిడ్ ఓపెన్ అయి మంటలు రేగాయి. దీంతో అతడి శరీరం కొంత కాలిపోయింది. సహచర కార్మికులు ఉక్కు జనరల్ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. స్టీల్‌ప్లాంట్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ముగ్గురికి ప్రాణదానం

బాలుడికి బ్రెయిన్‌డెడ్ : అవయవదానానికి అంగీకరించిన తల్లిదండ్రులు



యువంత్ (ఫైల్ ఫొటో)

విశాఖపట్నం ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): ఆడుతూ పాడుతూ చదువుకునే వయసులోని ఓ బాలుడికి అరుదైన వ్యాధి సోకడంతో బ్రెయిన్‌డెడ్ అయింది. అంతటి విషాదంలోనూ అతడి తల్లిదండ్రులు అవయవదానానికి ముందుకు రావడంతో ముగ్గురి ప్రాణాలు నిలిచాయి. దీనికి సంబంధించి వివరాలిలా ఉన్నాయి. శ్రీకాకుళం జిల్లా సంతబొమ్మాళి మండలం కాపుగోదాయవలసకు చెందిన వాతాడ చిరంజీవులు దంపతులకు ఇద్దరు కుమారులు. ఆరో తరగతి చదువుతున్న చిన్న కుమారుడు యువంత్ జన్మదిన వేడుకలకు సిద్ధమవుతున్న తరుణంలో అతడికి విపరీతమైన గొంతు నొప్పి వచ్చింది. దీంతో వెంటనే స్థానిక వైద్యులను సంప్రతించారు. మొదట సాధారణ సమస్యగా పరిగణించి, చికిత్స చేసినప్పటికీ ఫలితంలేకపోవడంతో శ్రీకాకుళంలోని ఆస్పత్రికి తరలించాలని సూచించారు. బాలుడ్ని శ్రీకాకుళంలోని ప్రైవేటు ఆస్పత్రికి తీసుకు వెళ్లేసరికి ఆరోగ్యం మరింత క్షీణించింది. దీంతో విశాఖ కేజీహెచ్‌కు తరలిం చారు. అక్కడ వైద్యులుతీవ్రంగా శ్రమించినప్పటికీ బాలుడి ఆరోగ్యంలో పురోగతి కనిపించలేదు. పైగా బ్రెయిన్‌డెడ్ అయినట్టు గుర్తించారు. విషయాన్ని తల్లిదండ్రులకు తెలియజేసి, అవయవదానంపై అవగాహన కల్పించడంతో వారు అంగీకరించారు. దీంతో ఈ సమాచారాన్ని జీవన్‌దాన్ రాష్ట్ర కోఆర్డినేటర్ డాక్టర్ రాంబాబుకు తెలిపారు. అతని ఆదేశాల మేరకు బాలుడి శరీరంలో పనిచేస్తున్న రెండు కిడ్నీలు, లివర్ సేకరించారు. జీవన్‌దాన్ ప్రొటోకాల్ మేర కు ఒక కిడ్నీని శ్రీకాకుళం ఆస్పత్రికి, మరో కిడ్నీ, లివర్‌ను నగరంలోని రెండు ఆస్పత్రులకు తరలించి, రోగులకు అమర్చారు. ఈ సందర్భంగా అవయవదానానికి ప్రోత్సహించిన వైద్యులు, బాలుడి తల్లిదండ్రులను డాక్టర్ రాంబాబు ప్రత్యేకంగా అభినందించారు.

సముద్రంలో గల్లంతైన విద్యార్థి మృతి



పవన్‌తేజ (ఫైల్ ఫొటో)

రాంబిల్లి, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాంబిల్లి పంచాయతీ శివారు వాడపాలెం సముద్రతీరంలో గల్లంతైన ఇంజనీరింగ్ విద్యార్థి మొక్క పవన్‌తేజ (17) మృతదేహం సోమవారం రామకొండ వద్ద లభ్యమైందని సీఐ నరసింగరావు తెలిపారు. విశాఖలో స్థిరపడిన మొక్క శ్రీధర్, మొక్క మల్లికార్జునరావుల కుమారులు సూర్యతేజ, పవన్‌తేజ ఈ నెల 9న స్వగ్రామం మండలంలోని కొత్తపేటలో పూజా కార్యక్రమాలకువచ్చారు. వీరితోపాటు మరికొంత మంది వాడపాలెం సముద్రతీరానికి వెళ్లారు. వీరిలో నలుగురు స్నానాలు చేస్తుండగా బలమైన కెరటం వచ్చి లాగేసింది. ఆ సమయంలో మెరైన్ పోలీసులు, మత్స్యకారులు ముగ్గురిని ఒడ్డుకు చేర్చారు. వీరిలో సూర్యతేజ మృతిచెందగా, పవన్‌తేజ గల్లంతయ్యాడు. సోమవారం వాడపాలెం సమీపంలోని రామకొండ తీరం వద్దకు చేరడంతో మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించినట్టు సీఐ చెప్పారు.

వీఎంఆర్‌డీఏ చీఫ్ ఇంజనీర్‌గా వినయకుమార్

విశాఖపట్నం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): విశాఖ మహా నగర ప్రాంత అభివృద్ధి సంస్థ (వీఎంఆర్‌డీఏ) చీఫ్ ఇంజనీర్ (సీఈ)గా ఎం.వినయకుమార్‌ను నియమిస్తూ సోమవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇతను ప్రస్తుతం ఏపీ అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌లో పనిచేస్తున్నారు. వీఎంఆర్‌డీఏలో ఇంజనీరింగ్ పనులున్నాయని పూర్తిస్థాయి సీఈ కావాలని కమిషనర్ విశ్వనాథన్ చేసిన అభ్యర్థన మేరకు నియామకం చేపట్టినట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ప్రస్తుతం సూపరింటెండెంట్ ఇంజనీర్ భవానీశంకర్ సీఈగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. గతంలో ఇళ్ల కాలనీలకు రైతుల నుంచి భూములు తీసుకున్నారు. వారికి అభివృద్ధి చేసిన ప్లాట్లు ఇవ్వాల్సి ఉంది. లేఅవుట్లు, మౌలిక వసతుల కల్పన పనులు ఉన్నాయి. ఈనేపథ్యంలో వినయ్‌కుమార్‌ను ఏడాదిపాటుడిప్యూటేషన్‌పై నియమించారు.